ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 02.08.2024 | సంపుటి : 11 సంచిక : 23 | పేజీలు : 12 వెల: రూ. 4/-

RNI NO.APTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



షూటింగ్‌లో స్వప్నిల్‌కు

## కాంస్యం

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు మరో పతకం వచ్చింది. యువ షూటర్ స్వప్నిల్ సత్తా చాటాడు. మెన్స్ 3 పొజిషన్ షూటింగ్ ఫైనల్‌లో మూడో స్థానంలో నిలిచాడు దీంతో కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. కాస్త నెమ్మదిగా ప్రారంభించిన స్వప్నిల్.. కీలక సమయంలో పుంజుకొన్నాడు.ఒక దశలో నాలుగు, ఐదు స్థానాల మధ్య కొనసాగిన అతడు.. టాప్-3 లోకి వచ్చాక మాత్రం వెనక్కి తిరిగి చూడలేదు. చివరికి 451.4 పాయింట్లను సాధించి కాంస్యం అందుకొన్నాడు.

వివరాలు స్పోర్ట్స్‌లో..

హమాస్ సైనిక విభాగాధిపతి

## డెయిఫ్ మృతి



జులై 13న జరిపిన దాడుల్లో అతడు మరణించినట్లుగా నిర్ధారించిన ఇజ్రాయెల్

2లో



ఎన్నాళ్లో వేచిన ఉదయం..

# ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ అధికారం రాష్ట్రాలదే

## సుప్రీం చారిత్రాత్మక తీర్పు

- ఉపకులాల వర్గీకరణను సమర్థించిన ధర్మాసనం
- ఏడుగురు సభ్యుల సిజెఐ బృందం సంచలన తీర్పు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు చారిత్రక తీర్పును వెల్లడించింది. ఎస్సీల ఉపవర్గీకరణకు రాష్ట్రాలకే అధికారం ఉందని, వారికే అవకాశం ఇవ్వాలని సర్వోన్నత న్యాయస్థానం తన తీర్పులో చెప్పింది. ఎస్సీ వర్గీకరణ చెల్లుబాటుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. ఎస్సీ వర్గీకరణ అంశంపై ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీంకోర్టులో 3 రోజుల పాటు విచారణ జరిగింది. వర్గీకరణ సమర్థనీయమేనని నాడు కేంద్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. సుదీర్ఘ వాదనల తర్వాత ఫిబ్రవరి 8న తీర్పును రిజర్వు చేసిన సుప్రీంకోర్టు.. తాజాగా నిర్ణయాన్ని వెల్లడించింది.. విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అవసరమని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం 6:1 నిష్పత్తితో తీర్పును వెల్లడించింది.. దీనివల్ల ఎస్సీ ఎస్టీలోని వెనుకబడిన ఉప కులాలకు లబ్ది చేకూరుతుందని అభిప్రాయపడింది. వర్గీకరణతో సమానత్వానికి భంగం వాటిల్లదని.. జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. వర్గీకరణతో ఆర్టికల్ 14లోని సమానత్వ హక్కుకు భంగం వాటిల్లదు.. వర్గీకరణ అనేది ఆర్టికల్ 341/2కి ఉల్లంఘన కాదు .. ఆర్టికల్ 15, 16లో వర్గీకరణ వ్యతిరేకించే అంశాలూ లేవని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల్లో క్రిమీలేయర్‌ను గుర్తించడానికి రాష్ట్రాలు.. ఒక నిర్దిష్టమైన విధానాలు తీసుకురావాలని.. జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. కాగా..వర్గీకరణపై 2 దశాబ్దాల క్రితం ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పక్కకుపెట్టింది. ఈ క్రమంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణపై సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లను ఉపవర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. ఈమేరకు 2004లో ఐదుగురు సభ్యులు ఇచ్చిన తీర్పును తాజాగా విస్తృత ధర్మాసనం పక్కనబెట్టింది. 6:1 మెజారిటీతో సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తుది తీర్పు వెలువరించింది. తాజా తీర్పును అనుసరించి ప్రభుత్వాలు దీనిపై తదుపరి మార్గదర్శకాలు రూపొందించుకోవాలని సూచించింది. వ్యవస్థాగతంగా ఎదుర్కొంటున్న వివక్ష కారణంగా ఎస్సీ,ఎస్టీ వర్గాల వారు పైకి రాలేక పోతున్నారు. ఒక కులంలో ఉపవర్గాలు చేసేందుకు రాజ్యాంగంలోని 14వ అధికరణ అనుమతి కల్పిస్తుంది. అందుకే 2004 నాటి ఈవీ చిన్నయ్య తీర్పును మేం వ్యతిరేకిస్తున్నాం. రాష్ట్రాలు ఉపవర్గీకరణ చేసుకునేందుకు అనుమతి కల్పిస్తున్నాం' అని సీజేఐ ధర్మాసనం స్పష్టంచేసింది. అణగారిన వర్గాల వారికి మరిన్ని ప్రయోజనాలు కల్పించేందుకు రిజర్వ్‌డ్ కేటగిరీలో రాష్ట్రాలు ఉప వర్గీకరణ చేసుకోవచ్చని కోర్టు వెల్లడించింది. ధర్మాసనంలో దీనికి అనుకూలంగా ఆరుగురు న్యాయమూర్తులు తీర్పు చెప్పగా.. జస్టిస్ బేలా ఎం.త్రివేది మాత్రం ఉప వర్గీకరణ సాధ్యం కాదంటూ వ్యతిరేకిం చారు.ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ కోటా రిజర్వేషన్లలో 50శాతాన్ని వాల్మీకి, మజహబీ సిక్కు సామాజికవర్గాలకు తొలి ప్రాధాన్యంగా

మిగతా 2లో..

# సుప్రీం కోర్టు తీర్పుపై కృష్ణమాదిగ హర్షం

- మూడు దశాబ్దాల పోరాటానికి దక్కిన విజయం వెల్లడి
- అమరులైన మాదిగ పోరాటా యోధులకు అంకితం
- ఈ తీర్పుతో న్యాయం మా వైపు ఉందని రుజువైంది
- పోరాటంలో సహకరించిన అందరికీ మా కృతజ్ఞతలు
- మీడియా ముందు భావోద్వేగానికి గురైన మందకృష్ణ



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును మాదిగ పోరాట సమితి అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ స్వాగతించారు. కీలక తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ విషయంలో ప్రధానమంత్రి మోదీ, హోంమంత్రి అమిత్‌షా, వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎపి సిఎం

మిగతా 2లో..

## ఉద్యోగ నోటిఫికేషన్లలో వర్గీకరణ అమలు చేస్తాం

- తీర్పును స్వాగతించిన సీఎం రేవంత్‌రెడ్డి
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన



**హైదరాబాద్(జనంసాక్షి):** ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీం తీర్పును సిఎం రేవంత్ రెడ్డి స్వాగతించారు. మాదిగ, మాదిగ ఉపకులాల యువకులు 27 ఏళ్లుగా పోరాటం చేశారని రేవంత్‌రెడ్డి అన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో శాసనసభలో సీఎం కీలక ప్రకటన చేశారు. ఇప్పుడు ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లలోనూ

మిగతా 2లో..

# కొత్త రేషన్‌కార్డుల జారీకి సర్కారు నిర్ణయం

- విడివిడిగా రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు
- ఉత్తమ్ అధ్యక్షతన కేబినెట్ సబ్‌కమిటీ భేటి
- ఎమ్మెల్సీలుగా కోదండరామ్, ఆమేర్‌అలీఖాన్‌ల పేర్లు సిఫార్సు

## నేడు అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటన

- జీహెచ్ఎంసీలో ఔటర్ గ్రామాల విలీనానికి కేబినెట్ సబ్ కమిటీ
- ధరణి పేరును భూమాతగా మారుస్తూ కేబినెట్ నిర్ణయం
- నిఖత్ జరీన్, సిరాజ్‌కు చెరో 600 గజాలస్థలం,ప్రభుత్వోద్యోగం
- జంటజలాశయాలకు మల్లన్న సాగర్ నుంచి నీటి తరలింపు
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి



**హైదరాబాద్(జనంసాక్షి):**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కొత్త రేషన్ కార్డుల జారీ విధివిధానాల రూపకల్పనకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు విడిగా ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీలో ఔటర్ గ్రామాల విలీనానికి కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంత్రులు సీతక్క,శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అమిర్‌ఖాన్‌ల పేర్లను మరోమారు రెకమండ్ చచేస్తూ గవర్నర్‌కు తీర్మానం పంపాలని కేబినేట్ నిర్ణయించింది. అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. దాదాపు రెండు గంటలకు పైగా జరిగిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ధరణి పేరును భూమాతగా మారుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సమావేశం ముగిసిన తర్వాత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. గౌరవెల్లి ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చేయడానికి రూ.437 కోట్లు విడుదలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అసెంబ్లీలో శుక్రవారం జాబ్ క్యాలెండర్ ప్రకటించ బోతున్నట్లు వెల్లడించారు. ఎన్నికల మేనిఫెస్టోలని అంశాలను తప్పక నెరవేరుస్తాం అన్నారు. క్రీడాకారులు ఈషాసింగ్, నిఖత్ జరీన్, సిరాజ్‌కు ఒక్కొక్కరికీ 600 గజాల చొప్పున హైదరాబాద్‌లో ఇంటి స్థలం, నిఖత్ జరీన్, సిరాజ్‌కు గ్రూప్-1 ఉద్యోగం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. విధుల్లో చనిపోయిన రాజీవ్ రతన్ కుమారుడికి మున్సిపల్ కమిషనర్ ఉద్యోగం, మరో అధికారి మురళి కుమారుడికి గ్రూప్-1 ఉద్యోగం

మిగతా 2లో..



## ఉత్తరకొరియాలో జలవిలయం

బోటులో స్వయంగా వరద ప్రాంతాలను సందర్శించిన కిమ్..

**సియోల్(జనంసాక్షి):** ఉభయ కొరియా దేశాల మధ్య ఉద్రిక్తతలు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉంటాయి. క్షిపణి ప్రయోగాలతో కిమ్ కవ్వింపులు.. సియోల్ యుద్ధ సన్నాహాలతో నిత్యం ఈ రెండు దేశాల మధ్య వైరం కొనసాగుతూనే ఉంటుంది.అలాంటిది ఇప్పుడు తమ దాయాది కష్టాల్లో ఉంటే

మిగతా 2లో..

## 'బండ్ల' ఊగిసలాట

మంత్రి జూపల్లితో చర్చలు

కాంగ్రెస్‌లోనే కొనసాగాలని బుజ్జగింపులు

10లో

# నిరుద్యోగాన్ని రూపుమాపుతాం

అభివృద్ధి ఫలాలు తెలంగాణ ప్రజలకు అందిస్తాం

యంగ్ ఇండియా స్కిల్‌యూనివర్సిటీకి సీఎం శంకుస్థాపన



**హైదరాబాద్(జనంసాక్షి):** యంగ్ ఇండియా స్కిల్‌యూనివర్సిటీకి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు శంకు స్థాపన చేశారు. ఈ స్కిల్‌యూ నివర్సిటీ రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్ పేటలో పెడుతు న్నారు. 57 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీని రాష్ట్ర ప్రభు త్వం నిర్మించనుంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మాణం జరగనుంది. దీంతో పాటు మరో నాలు గు సెంటర్లకు సీఎం శంకుస్థాపన చేశారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ప్రైమరీ హెల్త్ సెంటర్, మోడ్రన్ స్కూల్ కమ్యూనిటీ సెంటర్లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్ర మంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజ రయ్యారు. గత పాలకులు మూడు నగరాలు నిర్మించారని, ఈ ప్రభుత్వం నాలుగో సిటీని నిర్మించనుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంలో హెల్త్ స్పోర్ట్స్ ఇతర కంపెనీలకు హబ్‌గా మారుస్తామని వివ రించారు. యువతకు నైపు ణ్య శిక్షణ ఇప్పించి ఉద్యోగం కల్పిం చే బాధ్యత తీసుకుంటామని అన్నా రు. భవిష్యత్తులో ఈ ప్రాంతానికి మెట్రో రైలు కూడా నిర్మించే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చా రు.'ఈ ప్రాంత అభివృద్ధి కోసం విలువైన భూములను ప్రభుత్వా నికి ఇచ్చారు. రైతుల త్యాగానికి ఫలితం ఉండాలంటే

మిగతా 2లో..

## స్కిల్ వర్సిటీ ద్వారా 2లక్షల ఉద్యోగాలు భర్తీ

అసెంబ్లీలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' బిల్లు

ఉద్దేశాలను వివరించిన మంత్రి శ్రీధర్ బాబు

2లో



## రాహుల్ కుట్టిన బూట్లకు రూ.10 లక్షల గిరాకీ

**సుల్తాన్‌పూర్(జనంసాక్షి):**రామ్ చేత్ రోడ్డు పక్కన ఓ సాధారణ చెప్పుల దుకాణం యజమాని. రోజుల వ్యవధిలోనే ఒక్కసారిగా పాపులర్ అయ్యారు. లోకసభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆయన దుకాణానికి వెళ్లి కూర్చోవడమే అందుక్కారణం.పరువు నష్టం కేసులో జులై 26న కోర్టుకు హాజరైన తర్వాత తిరిగి వెళ్తూ.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్

మిగతా 2లో..

## కేసీఆర్‌ను తిట్టేందుకే అసెంబ్లీ సమావేశాలు

- నాలుగు గంటలు నిలుచున్నా మైక్ ఇవ్వలేదు
- రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది
- మీడియా సమావేశంలో మండిపడ్డ సబితా

**హైదరాబాద్(జనంసాక్షి):**కేసీఆర్‌ను తిట్టేందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఉందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. ఎంతసేపూ కేసీఆర్‌ను తిట్టడం కాదు.. సమర్థ పాలనపై దృష్టి పెటాలని సూచించారు. శాసనసభలో తాను కనిపిస్తేనే.. సీఎం రేవంత్‌రెడ్డికి కంటగింపుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తెలంగాణభవన్‌లో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో కలిసి ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మహిళల పట్ల సీఎం ప్రవర్తించిన తీరుపై విమర్శలు గుప్పించారు. సభలో మాట్లాడే అవకాశం ఇవ్వాలని 4 గంటలు నిల్చున్నా కూడా మైక్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'మేం ఇప్పటి వరకు ఎంతోమంది సీఎంలను చూశాం. వైఎస్ఆర్, చంద్రబాబు, కేసీఆర్ మహిళలకు సభలో ఎంతో గౌరవం ఇచ్చేవారు. మహిళలకు అవకాశం

మిగతా 2లో..



# కేరళలో మృత్యుకేళీ..

- 294కి చేరిన మృతుల సంఖ్య
- ఇది జాతీయ విపత్తు..
- వరదబాధిత ప్రాంతాలను సందర్శించిన రాహుల్, ప్రియాంక



**వయనాడ్(జనంసాక్షి):** కేరళలో సంభవించిన ప్రకృతి విపత్తు వందలాది మందిని బలి తీసుకొంది. ఎన్నో కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చింది. బాధితుల నుపరామర్శిం చేందుకు కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ వయనాడ్‌ను సందర్శించారు. కొండచరి యలు విరిగిపడిన ప్రాంతాల్లో పర్యటించారు. ఆయనతో పాటు ప్రియాంక గాంధీ వెళ్లారు. అక్కడ నెలకొన్న పరిస్థితి చూసి ఆయన భావోద్వే గానికి గురయ్యారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందు తున్న క్షతగాత్రులతో కాంగ్రెస్ నేతలు మాట్లా డారు. అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. "దేశంలోనే అత్యంత భయం కరమైన విషాద ఘటన వయనాడ్‌లో చోటు చేసు కొంది. ప్రజలు తమ ఇళ్లు, కుటుంబ సభ్యులను కోల్పోవడం బాధాకరం. ఇలాంటి సమయంలో వారిని ఏ విధంగా ఓదార్చాలో తెలియడం లేదు. నా తండ్రి (రాజీవ్ గాంధీ) చనిపోయినప్పుడు ఎలా బాధపడ్డానో.. ఈరోజు అలాగే అనిపిస్తోం ది" అంటూ భావోద్వేగానికి గురయ్యారు. "నా దృష్టిలో ఇది జాతీయ విపత్తు. ఈ ఘటనలో భారీ ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. కేరళకు జరిగిన నష్టం దేశానికి తీరని విషాదం. ఇది రాజకీయాలకు సమయం కాదు.. బాధితులం దరికీ అవసరమైన సాయం అందించడానికే ప్రా ధాన్యం ఇవ్వాలి. ప్రభుత్వం నుంచి బాధితులకు రావాల్సిన సాయం అందేవరకు కాంగ్రెస్ పోరాడుతుంది. ఇలాంటి

మిగతా 2లో..

## సుప్రీం తీర్పుపై కృష్ణమాదిగ హర్షం

చంద్రబాబు ఇలా చాలామంది సహా యం చేశారని గుర్తు చేశారు. ఈ విజయం కోసమే 30 ఏళ్లుగా పోరాటం చేశాం. ఎందరినో ఉద్యమకారులను కోల్పోయామన్నారు. అయినా పట్టు వ దలకుండా ఉప వర్గీకరణ సాధించుకున్నామని అభిప్రాయపడ్డారు. ఈ ఉద్యమాన్ని నీరుగార్చేందుకు చాలా మంది ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. అయితే ఇది ఒకరి గెలుపో ఇంకొకరి ఓటమో కాదన్నారు. దళితుల అభివృద్ధి కోసం అందరూ కలిసి రావాలని మందకృష్ణ పిలుపునిచ్చారు. రానురాను ప్రభుత్వ రంగాల్లో వర్గీకరణ పరిధి తగ్గిపోతుందని అది పెంచేందుకు అందరి నాయకులు కృషి చేయాలని అభిప్రాయపడ్డారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేసే అధికారం.. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది. 6:1 మెజారిటీతో సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పును వెల్లడించింది. వర్గీకరణచేసే వెసులుబాటు రాష్ట్రాలకు ఉండాలని సుప్రీం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ స్పందిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. మీడియా ఎదుటే ఆయన కంటనీరు పెట్టుకున్నారు. 'మా 30 ఏళ్ల పోరాటానికి న్యాయం జరిగింది. సుప్రీంకోర్టు తీర్పు న్యాయాన్ని బతికించింది. ఈ ప్రక్రియ వేగవంతానికి ప్రధాని నరేంద్ర మోదీ చొరవ తీసుకున్నారు. వర్గీకరణ చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కు ప్రత్యేక ధన్యవాదాలు. ఈ విజయాన్ని అమరులకు అంకితం ఇస్తున్నాం. రిజర్వేషన్ల సిస్టమ్ ఇప్పుడు రెండో అడుగు వేయబోతుంది. తెలుగు రాష్ట్రాల్లో వర్గీకరణ అనివార్యం. వర్గీకరణకు సంబంధించిన జీవోలు వచ్చిన తర్వాతే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలి. ఉద్యోగ నోటిఫికేషన్లు సరిచేసుకోవాల్సిన అవసరం ఉంది. రీ-నోటిఫికేషన్లు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మందకృష్ణ మాదిగ కోరారు. వర్గీకరణకు జనాభా లెక్కలతో పనిలేదని మరోసారి గుర్తు చేశారు. ఇందుకు సహకరించిన వారికి కృతజ్ఞత సభలు ఉంటాయని మందకృష్ణ వెల్లడించారు.

### ఉద్యోగ నోటిఫికేషన్లలో వర్గీకరణ అమలు చేస్తాం

వర్గీకరణను అమలు చేసేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకుని వస్తామని అన్నారు. వర్గీకరణ కోసం గతంలో ఇదే శాసనసభలో వాయిదా తీర్మానం ఇచ్చాం. అప్పుడు నాతో పాటు సంపత్‌కుమార్‌ను సభ నుంచి బహిష్కరించారు. గత ప్రభుత్వం ఏబీసీడీ వర్గీకరణ అంశంపై ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తామని చెప్పింది. అలా తీసుకెళ్లకుండా మాదిగ సోదరులను మోసం చేశారు. డిసెంబర్ 3, 2023న ప్రజాప్రభుత్వం బాధ్యత తీసుకున్న తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచన మేరకు మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో శాసనసభ్యులు, అడ్వొకేట్ జనరల్ ను దిల్లీకి పంపించాం. న్యాయ కోవిదులతో చర్చించి వర్గీకరణపై సుప్రీంకోర్టులో బలమైన వాదనను కాంగ్రెస్ ప్రభుత్వం వినిపించింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు మాదిగ, మాదిగ ఉపకులాల వర్గీకరణకు అనుకూలమైన తీర్పు ఇచ్చింది. సుప్రీం రాజ్యాంగ ధర్మాసనానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. దేశంలోనే అందరికంటే ముందు భాగాన నిలబడి ఏబీసీడీ వర్గీకరణ చేసే బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. ఇప్పుడు ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లలోనూ వర్గీకరణను అమలు చేస్తాం. దీనికి అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకొచ్చి మాదిగ సోదరులకు న్యాయం చేస్తాం. మాదిగ, మాదిగ ఉపకులాల వర్గీకరణకు సంపూర్ణంగా సహకరించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేస్తున్నాను అని సీఎం కోరారు. ఎస్సీ వర్గీకరణకు మాదిగ, మాల ఉప కులాలకు వర్గీకరణకు వాయిదా తీర్మానం ఇస్తే గత ప్రభుత్వం సంపత్ కుమార్‌ను సస్పెండ్ చేసిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ అధికారం రాష్ట్రాలదే

ప్రత్యేకిస్తూ 2006లో పంజాబ్ ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. అయితే, ఎస్సీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణ చెల్లదంటూ పంజాబ్, హరియాణా హైకోర్టు 2010లో తీర్పు వెలువరించింది. ఈవీ చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 2004లో వెలువరించిన తీర్పును ఉల్లంఘించేలా పంజాబ్ చట్టం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. షెడ్యూల్డ్ కులాల జాబితాలోకి ఏదైనా సామాజిక వర్గాన్ని చేర్చాలన్నా, తొలగించాలన్నా పార్లమెంటుకు మాత్రమే అధికారం ఉంటుందని, రాష్ట్రాల శాసనసభలకు కాదని ఈవీ చిన్నయ్య కేసులో సుప్రీంకోర్టు 2004లో తీర్పు చెప్పింది. దాన్నే పంజాబ్, హరియాణా తమ ఉత్తర్వులో హైకోర్టు ప్రస్తావించింది. దీంతో, హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పంజాబ్ ప్రభుత్వం అప్పట్లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అనంతరం దీనిపై మరో 22 పిటిషన్లు దాఖలయ్యాయి. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కూడా ఇందులో వ్యాజ్యదారుగా ఉన్నారు. ఈ పిటిషన్లను విచారించిన అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం.. 2020లో ఈ వివాదాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేసింది. దీనిపై సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం ఈ ఏడాది ఆరంభంలో విచారణ జరిపి తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఉపవర్గీకరణ చేసుకొనేలా రాష్ట్రాలకు అనుమతినిస్తూ గురువారం కీలక తీర్పు వెలువరించింది. విచారణ సమయంలో కేంద్రం కూడా ఎస్సీ,ఎస్టీలో ఉపవర్గీకరణను సమర్థించింది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ విజయం కోసమే 30 ఏండ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో చాలా మంది తమ ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ఉద్యమాలను దెబ్బతీసే కుట్రలు ఎన్నో జరిగాయని విమర్శించారు. అయినా సహనం కోల్పోకుండా పట్టుదలతో పోరాటం చేసి విజయం సాధించామని తెలిపారు. 1994లో ప్రకాశం జిల్లా ఈదుమూడిలో వర్గీకరణ ఉద్యమాన్ని ప్రారంభించామన్నారు. జాతికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు పోరాడామని అన్నారు. న్యాయం కోసం ఎమ్మార్పీఎస్‌కు అండగా నిలిచిన వారందరికీ ఈ విజయం అంకితం ఇస్తున్నామన్నారు. ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్లు కూడా సరిచేయా ల్సిన అవసరం ఉందన్నారు. వర్గీకరణకు జనాభా లెక్కలతో పనిలేదని చెప్పారు. వర్గీకరణ కోసం ప్రధాని మోదీ చొరవ తీసుకున్నారని చెప్పారు. అనుకూల తీర్పునిచ్చిన జడ్జిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఏనాటికైనా ధర్మమే గెలుస్తుందని 2004 నవంబర్ 5న చెప్పానని గుర్తుచేశారు. అలాగే సుప్రీంకోర్టు తీర్పుతో మంద కృష్ణమాదిగ భావోద్వేగానికి గురయ్యారు.. మీడియా ఎదుట కంటనీరు పెట్టుకున్న మంద కృష్ణ.. తమ 30 ఏళ్ల పోరాటానికి న్యాయం జరిగిందంటూ వ్యా ఖ్యానించారు. సుప్రీంకోర్టు తీర్పు న్యాయాన్ని బతికిం చిందంటూ పేర్కొన్నారు. కోటాలో సబ్‌కోటాపై సుదీర్ఘకా లంగా కోర్టులో కేసులు ఉన్నాయి.. ఈ క్రమంలో ఉపవ ర్గీకరణ కోరుతూ ఎమ్మార్పీఎస్ సుప్రీంను ఆశ్రయిం చింది.. పంజాబ్ ప్రభుత్వం సైతం వర్గీకరణపై సుప్రీంలో కేసు వేసింది.. ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీంలో 3 రోజు లు సుదీర్ఘ వాదనలు సైతం జరిగాయి. ఇదిలాఉంటే.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు హైదరాబాద్ మాదిగ విశ్వరూప సభలో ప్రధాని మోదీ సైతం వర్గీకరణకు అనుకూలంగా మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అని, సుప్రీం కోర్టులో కూడా వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని నాడు ప్రధాని మోదీ హామీ ఇచ్చారు.

# కేరళలో మృత్యుకేళి



విపత్తులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. దీనిపై సమగ్ర కార్యచరణ ప్రణాళిక అవసరం" అని రాహుల్ పేర్కొన్నారు. కాగా.. వయనాడ్‌లో ప్రకృతి సృష్టించిన విలయంలో మృతదేహాలు బయటపడుతూనే ఉన్నాయి. ఇప్పటివరకు మృతుల సంఖ్య 291కి పైగా చేరుకుంది. గత మూడు రోజులుగా ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. ప్రకృతి సృష్టించిన విలయంలో మృతుల సంఖ్య 294కి చేరింది. మరో 200 మంది అచూకీ గల్లంతైనట్లు అధికారులు తాజాగా అంచనా వేశారు.మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్లు చెబుతున్నారు. ముండక్కై, చూరాల్ మల ప్రాంతాలు ఆనవాళ్లు లేకుండా పోయిన సంగతి తెలిసిందే. వందలాది గృహాలు నేలమట్టమయ్యాయి. ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బురద తొలగి స్తున్నకొద్దీ శవాలు బయపడుతున్నాయని సహాయక బృం దాలు చెబుతున్నాయి. కొన్ని చోట్ల తాళ్ల సాయంతో తాత్కాలిక వంతెనలను నిర్మించి ప్రజలను సురక్షిత ప్రాం తాలకు తరలిస్తున్నారు. కేరళలోని చాలా పర్వతాల వాలు 20 డిగ్రీల కంటే ఎక్కువగా ఉంటుంది. దీనివల్లే ప్రమాద తీవ్రత అధికంగా ఉన్నట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు. విరిగిపడిన కొండచరియల శిథిలాలు నదిలో 8కి.మీ మేర కొట్టుకెళ్లినట్లు తెలిపారు. భారీ వర్షాలకు కేరళలో విరిగిపడుతోన్న కొండచరియలు ఊళ్లకు ఊళ్లనే నాశనం చేస్తున్నాయి. వందల మందిని బలితీసుకుంటున్నాయి. వయనాడ్‌లో ఇటీవల సంభవించిన ఘటనలో 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా అనేక మంది ఆ శిథిలాల కిందే చిక్కుకుపోయారు.కనీవినీ ఎరుగని ఈ విపత్తుకు సంబంధించిన ఉపగ్రహ చిత్రాలను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ విడుదల చేసింది. అక్కడ సంభవించిన విలయాన్ని 3డీ రూపంలో చూపించింది. కొండచరియలు విరిగిపడిన ఘటనలో దాదాపు 86వేల చ.మీటర్ల భూభాగం జారిపడిపోయినట్లు ఇస్రో అంచనా వేసింది. సముద్రమట్టానికి 1550 మీటర్ల ఎత్తులో ఈ కొండచరియలు విరిగిపడిన ప్రదేశాన్ని గుర్తించింది. ఇరువంజిపుళ నదిలో దాదాపు 8కి.మీ మేర ఈ శిథిలాలు కొట్టుకుపోతున్నట్లు సమాచారం. వయనాడ్‌లో చోటుచేసుకున్న భారీ వినాశనాన్ని అంచనా వేసేందుకు ఇస్రోకు చెందిన కార్టోశాట్-3, ఆర్ఐఎస్ఏటీ అత్యాధునిక ఉపగ్రహాలను నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఆ ప్రాంతంలో అంతరిక్షం నుంచి తీసిన 3డీ చిత్రాలను విశ్లేషించింది. గతంలోనూ అదే ప్రాంతంలో కొండచరియలు విరిగిపడిన విషయాన్ని పేర్కొంది. రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలకు వయనాడ్ ప్రాంతం మొత్తం తడిగా మారిపోయిందని అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ అట్మాస్ఫెరిక్ రాడార్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ నిపుణులు పేర్కొన్నారు. అరేబియా సముద్ర తీరంలో దట్టమైన మేఘాల ధోరణిని శాస్త్రవేత్తలు ముందుగానే గుర్తించారని అన్నారు. ఈ కారణంగా కేరళలో అతి తక్కువ వ్యవధిలో అత్యంత భారీ వర్షాలు పడి కొండచరియలు విరిగిపడే అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

## రాహుల్ కుట్టిన బూట్లకు రూ.10 లక్షల గిరాకీ

శివారులోని విధాయక్ నగర్‌లోని ఓ చెప్పుల దుకాణానికి రాహుల్ వెళ్లిన సంగతి తెలిసిందే. ఆయనతో చాలా సేపు మాట్లాడారు. ఆయన చెబుతుంటే ఓ 'షూ' కూడా కుట్టారు. దీంతో రామ్ చేత్ ఇమేజ్ ఒక్కసారిగా మారిపోయింది. అటువైపుగా వెళ్తున్న వారంతా కారు ఆపి మరీ, ఆయన యోగక్షేమాలు అడుగుతున్నారు. సెల్ఫీలు దిగుతూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు.మరోవైపు రాహుల్ కుట్టిన 'షూ'కి విపరీతమైన గిరాకీ ఏర్పడింది. ఆయన వెళ్లిన వెంటనే ఒకరు ఫోన్ చేసి.. దానిని రూ.5 లక్షలకు విక్రయించాల్సిందిగా కోరారట. ఇంకొకరు రూ.10 లక్షలు ఇస్తామని చెప్పారట. మరొకరైతే.. 'బ్యాగు నిండా డబ్బిస్తా.. ఇచ్చేయ్' అన్నారట. అయితే, దానిని విక్రయించబోనని, రాహుల్‌కి గుర్తుగా తన వద్దే ఉంచుకుంటానని రామ్ చేత్ చెబుతున్నారు. మరోవైపు రాహుల్‌తో దిగిన ఫొటో వార్తాపత్రికల్లో వచ్చినప్పటి నుంచి అధికారులు కూడా అప్రమత్త మయ్యారు. ఏమైనా సమస్యలుంటే చెప్పాలని స్థానిక అధికారులు వచ్చినట్టు ఆయన చెప్పారు. రాహుల్ ఆదేశాల మేరకు.. ఆ తర్వాతి రోజునే పార్టీ నేతలు రూ.10 లక్షల విలువైన చెప్పులు కుట్టే మిషన్‌ను ఆయనకు అందజేశారు. అయితే, తన ఇంటికి కరెంట్ సదుపాయం లేకపోవడంతో, కుమారుడి ఇంటి వద్ద పెట్టి చెప్పులు కుడుతున్నానని రామ్ చేత్ చెప్పు కొచ్చారు.

## కేసీఆర్‌ను తిట్టేందుకే అసెంబ్లీ సమావేశాలు

ఇవ్వాలని చెప్పేవారు. సభలో 9 మంది మహిళా సభ్యులున్నా.. మాట్లాడే అవకాశమే రావట్లేదు. ఎస్సీ వర్గీకరణపై మాట్లాడుదామనుకుంటే మైకు ఇవ్వలేదు. పార్టీ మారటం పెద్ద నేరమైతే.. ఇప్పుడు కాంగ్రెస్‌లోకి భారాస ఎమ్మెల్యేలు రాలేదా? రాహుల్ గాంధీ మిమ్మల్ని నమ్మితే మీరు ఆయన బతుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ చేస్తారా? నా వల్లే సీఎల్పీ పదవి పోయిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఇప్పుడు ఎస్సీ నేతకు సీఎం పదవి ఇవ్వాలని ఆయన ఎందుకు అడగలేదు? సభలో లేని ఎమ్మెల్సీ కవిత గురించి ఎందుకు ప్రస్తావించాలి? ఆడబిడ్డ అయితే.. శత్రువు కుమార్తె అయినా జాలి చూపే సమాజం మనది. మమ్మల్ని అవమానించిన తీరును రాష్ట్రమంతా గమనించింది. రాష్ట్రంలో, హైదరాబాద్‌లో మహిళలకు భద్రత కరువైందని సబిత అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మేం ముగ్గురం మహిళా ఎమ్మెల్యేలం సభలో నిల్చొని ఉంటే.. అయ్యో పాపం అనాల్సింది పోయి.. కాంగ్రెస్ సభ్యుల ముఖాల్లో రాక్షసానందం కనిపించిందని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.

# హమాస్ సైనిక విభాగాధిపతి మహమ్మద్ డెయిఫ్ మృతి

### జులై 13న జరిపిన దాడుల్లో మరణించినట్లుగా నిర్ధరించిన ఇజ్రాయెల్

**టెల్అవీవ్(జనంసాక్షి):** హమాస్‌పై యుద్ధంలో ఇజ్రాయెల్ పైచేయి సాధిస్తోంది. గతేడాది అక్టోబరు 7 నాటి మెరుపుదాడులకు ప్రధాన సూత్రధారిగా భావిస్తోన్న హమాస్ సైనిక విభాగాధిపతి మహమ్మద్ డెయిఫ్ ను అంతమొందించినట్లు టెల్ అవీవ్ ప్రకటించింది. గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంలో జులై 13న జరిపిన దాడుల్లో అతడు హతమైన విషయాన్ని నిర్ధరించింది. పలు మార్లు చిక్కినట్లే చిక్కి చేజారిపోగా.. డెయిఫ్ లక్ష్యంగా గాజాలో చేసిన దాడిలో అతడు ప్రాణాలు కోల్పోయినట్లు తమ నిఘా విభాగం అంచనాకు వచ్చిందని వెల్లడించింది.గాజాలోని ఖాన్ యూనిస్ శరణార్థి శిబిరంలో 1965లో డెయిఫ్ జన్మించాడు. పూర్తి పేరు మహమ్మద్ డియాబ్ ఇబ్రహీం అల్ మస్రీ. 1980ల చివర్లో హమాస్‌లో చేరాడు. హమాస్ ఉగ్రవాదులు తమ ఉనికి ఇజ్రాయెల్ దళాలకు తెలియకుండా రోజుకో సానుభూతిపరుడి ఇంట్లో దాక్కొంటారు. అందుకనే మస్రీ పేరు డెయిఫ్‌గా మారింది. డెయిఫ్ అంటే అరబిక్ భాషలో 'అతిథి' అని అర్థం. హమాస్ మిలిటరీ యూనిట్ 'అల్ కస్సం బ్రిగేడ్'లో పనిచేశాడు.అతడు ఎక్కడ పెరిగాడు.. ఏం చదువుకున్నాడు తదితర వివరాలు ఎవరికీ తెలియవు. హమాస్ బాంబుల తయారీ నిపుణుడు అయ్యాష్‌కు సన్నిహితుడు. అయ్యాష్ గతంలో ఇజ్రాయెల్ దళాలపై పలు బాంబుదాడులు చేశాడు. అతడు ఇజ్రాయెల్ దళాల చేతిలో హతమయ్యాక.. 2002లో హమాస్‌లోని మిలిటరీ వింగ్ బాధ్యతలు డెయిఫ్ చేపట్టాడు. హమాస్ వాడే 'కస్సాం' రాకెట్ల తయారీ వెనుక కీలక పాత్ర పోషించాడు. ఇజ్రాయెల్ దళాలకు తలనొప్పిగా మారిన గాజా టన్నెల్ నెట్‌వర్క్ నిర్మాణం వెనుక మాస్టర్ మైండ్ కూడా అతడే. ఇజ్రాయెల్ దళాలకు చిక్కకుండా ఎక్కువ సమయం ఆ సొరంగాల్లోనే గడుపుతాడని సమాచారం.ఇజ్రాయెల్ దళాలు డెయిఫ్ కోసం తీవ్రంగా గాలించాయి. అత్యాధునిక కమ్యూనికేషన్ వ్యవస్థలు, కంప్యూటర్లకు దూరంగా ఉండడంతో నిఘా సంస్థలకు డెయిఫ్‌ను గుర్తించడం అసాధ్యమైంది. అతడి రహస్య జీవితం నుంచి అస్సలు బయటకు రాలేదట. ఇప్పటి వరకు అతడిపై ఇజ్రాయెల్ దళాలు ఏడుసార్లు దాడులు చేశాయి. ప్రతిసారీ వెంట్రుకవాసిలో ప్రాణాలతో బయటపడ్డాడు. 2000లో జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆ సమయంలో ఒక కన్ను పోవడంతోపాటు కొన్ని అవయవాలు దెబ్బతిన్నట్లు తెలిసింది.2006లో హమాస్ సభ్యుడి ఇంట్లో ఉండగా జరిగిన దాడిలో డెయిఫ్ మరోసారి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనల్లో తప్పించుకున్న విధానంతో హమాస్‌లో అతడు పాపులర్ అయ్యాడు. అందుకే అతడిని 'ది క్యాట్ విత్ నైన్ లైవ్స్' అని పిలుస్తారు. 2014లో ఐదోసారి జరిగిన దాడి నుంచి కూడా బయటపడ్డాడు. ఈ దాడిలో అతడి భార్య, పిల్లలు మరణించారు. 2021 గాజాపై జరిపిన ఆపరేషన్‌లో కూడా రెండుసార్లు తప్పించుకున్నాడు. గతేడాది అక్టోబరులో 'ఆపరేషన్ అల్ అక్సా స్ట్రామ్' మొదలైందంటూ ప్రకటించిందీ అతడే. ఇజ్రాయెల్‌పై రాకెట్ల వర్షానికి రూపకర్త కావడంతో మరోసారి కోసం తీవ్రంగా జల్లెడ పట్టిన ఇజ్రాయెల్.. ఎట్టకేలకు అతడిని హతమార్చింది.

# ఉత్తరకొరియాలో జలవిలయం

సాయానికి ముందుకొచ్చి మానవత్వాన్ని చాటుకుంది దక్షిణ కొరియా భీకర వరదలతో అతలాకుతలమైన ఉత్తరకొరియా కు మానవతా సాయం అందిస్తామని ఆఫర్ చేసింది.ఉత్తరకొరియాలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో నదులకు వరదలు రావడంతో వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో బాధితులను ఆదుకునేందుకు సహాయ సామగ్రిని అందజేస్తామని దక్షిణ కొరియా ప్రకటించింది. వాటిని ఎలా సరఫరా చేయాలన్న దానిపై చర్చించేందుకు తక్షణమే స్పందించాలని ఉత్తరకొరియా రెడ్ క్రాస్ సంస్థను కోరింది. అయితే, సియోల్ ఆఫర్‌పై కిమ్ సర్కారు స్పందించకపోవడం గమనార్హం.

**స్వయంగా బోటులో వెళ్లిన కిమ్..**

మరోవైపు వర్షాల కారణంగా ఉత్తరకొరియా వ్యాప్తంగా అనేక ప్రాంతాలు నీటమునిగాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీని ప్రకటించిన అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ స్వయంగా విపత్తు సహాయక చర్యల్లో భాగస్వామి అయ్యారు. రెస్క్యూ సిబ్బందితో పాటు బోటులో వెళ్లి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని అంచనా వేశారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలను స్థానిక మీడియాలో ప్రచురించడంతో ఇవి కాస్తా వైరల్‌గా మారాయి.వర్షాల కారణంగా బుధవారం నాటికి 4100 ఇళ్లు ధ్వంసమయ్యాయి. 7,410 ఎకరాల పంటకు నష్టం వాటిల్లింది. చైనా సమీపంలోని సినాయ్జు, యిజు పట్టణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అయితే, ప్రాణ నష్టంపై కిమ్ సర్కారు ఇంకా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. విపత్తు సహాయక చర్యల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను కఠినంగా శిక్షించాలని కిమ్ జోంగ్ ఉన్ ఆదేశించినట్లు తెలుస్తోంది.ఇదిలా ఉండగా.. 2019 నుంచి దక్షిణ కొరియాతో ఉత్తరకొరియా దౌత్య సంబంధాలను పూర్తిగా తెంచుకుంది. అప్పటి నుంచి ఈ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. కొవిడ్ మహమ్మారి సమయంలో కిమ్ రాజ్యానికి సాయం చేస్తామని దక్షిణ కొరియా ప్రకటించినప్పటికీ.. అందుకు ఉ.కొరియా తిరస్కరించడం గమనార్హం.








# నిరుద్యోగాన్ని రూపుమాపుతాం

ఈ ప్రాం తంలో అభివృద్ధి జరగాలి. స్కిల్ యూనివర్సిటీ నిర్మించి అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందిస్తాం. తెలంగాణ సమాజం ఎదుర్కొన్న ప్రధాన సమస్య నిరుద్యోగం. ఏటా వేలాది మంది యువత ఇంజినీరింగ్ పట్టాలు అందు కుంటున్నారు. ఇంజినీరింగ్ పట్టాలు పొందుతున్నారు కానీ సరైన నైపుణ్యాలు ఉండటం లేదు.' అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.ప్రస్తుత కాలానికి తగినట్లు యువతలో నైపుణ్యాలు పెరగాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రూ.150 కోట్లతో 57 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మించనున్నామని అన్నారు. స్కిల్ యూనివర్సిటీతో పాటు మరో నాలుగు ప్రధాన కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్కిల్ యూనివర్సిటీతో కలిసి పని చేసేందుకు ఎన్నో సంస్థలు ముందుకు వచ్చాయని వివరించారు. ఔటర్ రింగ్‌రోడ్డు, ఎయిర్ పోర్టుతో హైదరాబాద్ రూపురేఖలు మారిపోయాయని గుర్తు చేశారు. ఓఆర్ఆర్ విమానాశ్రయంతో రంగారెడ్డి జిల్లా భూముల విలువలు పెరిగాయని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

### స్కిల్ వర్సిటీ ద్వారా 2లక్షల ఉద్యోగాలు భర్తీ

**హైదరాబాద్(జనంసాక్షి):** అతి త్వరలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. స్కిల్ వర్సిటీ ద్వారా రాబోయే రోజుల్లో 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారు. శాసనసభలో 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' బిల్లును మంత్రి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2 లక్షల ఉద్యోగాలు కల్పించినా.. మరో 20 లక్షల మంది ఉపాధి కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ప్రభుత్వ పరంగా అందరికీ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదు. గ్రాడ్యుయేట్లలో పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలు కొరవడ్డాయి. వారిలో స్కిల్స్ పెంపుపై పారిశ్రామిక వేత్తలు, వీసీలు, విద్యార్థులతో చర్చించాం. 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' స్థాపనకు ప్రతిపాదిస్తున్నాం అని అన్నారు. విదేశాలకు వెళుతున్న విద్యార్థులు సరైన స్కిల్స్ లేకపోవడంతో రాణించలేకపోతున్నారని, అది గమనించి సిఎం రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారన్నారని అన్నారు. అన్ని కోర్సులు 50 శాతం ప్రాక్టికల్ కాంపోనెంట్ కలిగి ఉంటాయి. నైపుణ్యాలు, ఉపాధి అంతరాల పరిష్కారం కోసం ప్రత్యేక సంస్థ ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నాం. స్కిల్ యూనివర్సిటీ ఉపాధి కల్పిస్తుంది.. రాష్ట్ర ఆర్థిక వృద్ధిని పెంచుతుంది. రాష్ట్రంలో మరిన్ని పరిశ్రమల స్థాపనకు ఊతమిస్తుంది. 2024-25 సంవత్సరంలో 2వేల మంది విద్యార్థులకు.. వచ్చే ఏడాది 10వేల మందికి శిక్షణ ఇస్తాం. ముచ్చర్లలో స్కిల్ వర్సిటీ కోసం శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేయబోతున్నాం అని మంత్రి తెలిపారు. నిరుద్యోగులు, యువతలో స్కిల్స్ పెంపుపై పారిశ్రామికవేత్తలు, వీసీలు, విద్యార్థులతో చర్చించామని.. రాష్ట్రంలో 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీ' స్థాపనకు ప్రతిపాదిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. నైపుణ్యాలు, ఉపాధి అంతరాల పరిష్కారం కోసం ప్రత్యేక సంస్థ ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో 4 వేల ఎకరాల్లో నగరం రూపుదాలుస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన బుధవారం మాట్లాడారు. రాజధానిలో మరో నూతన నగరం నిర్మిస్తామని చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ ఇలా 3 నగరాలున్నాయని.. ముచ్చర్ల నాలుగో నగరంగా అవతరిస్తుందని స్పష్టం చేశారు.

## కొత్త రేషన్‌కార్డుల జారీకి సర్కారు నిర్ణయం

ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఇద్దరు ఎమ్మెల్సీల నియామకంపై గవర్నర్‌కు మళ్లీ ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించాం. కోదండరాంరెడ్డి, అమీర్ ఖాన్ పేర్లను మరోసారి గవర్నర్‌కు పంపిస్తాం. నిజాం చక్కెర పరిశ్రమ పునరుద్ధరణకు, హైదరాబాద్‌లో మూసీ సుందరీకరణకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది. మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను హైదరాబాద్ జంట జలాశయాలకు తరలిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. కొత్త రేషన్ కార్డుల జారీకి కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించిన విధివిధానాల రూపకల్పనకు కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన రేషన్ కార్డుల జారీ విధివిధానాల సబ్ కమిటీ ఏర్పాటు కానుంది. రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు విడివిడిగా ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది.జీహెచ్ఎంసీలో ఔటర్ గ్రామాల విలీనానికి కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ కమిటీలో సభ్యులుగా మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, సీతక్క వ్యవహరించనున్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏడాది నిర్దిష్టమైన కాల వ్యవధిలో ఉద్యోగ నియామకాలు చేపట్టేందుకు జాబ్ క్యాలెండర్‌ను కేబినెట్ ఆమోదించింది అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ నెల 2వ తేదీన అసెంబ్లీ వేదికగా జాబ్ క్యాలెండర్ ప్రకటించబోతున్నట్లు మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. కేరళలో వయనాడ్‌లో భారీ వర్షాలతో పాటు కొండచరియలు విరిగిపడి చాలా మంది చనిపోయారు. కేరళలో జరిగిన విషాదంపై తెలంగాణ కేబినెట్ సంతాప తీర్మానం ఆమోదించింది. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేసింది. ప్రభుత్వం తరపున అవసరమైన సహాయక చర్యలను అందించేందుకు ముందుకు వచ్చిందని మంత్రి పేర్కొన్నారు. రేషన్ కార్డుల జారీతో పాటు రాష్ట్ర ప్రజలందరి హెల్త్ ప్రొఫైల్‌తో హెల్త్ కార్డులను జారీ చేయాలని కేబినెట్ చర్చించింది. దీనికి సంబంధించిన విధి విధానాలను ఖరారు చేసేందుకు రెవెన్యూ శాఖ మంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి, సివిల్ సప్లయిస్ మంత్రితో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. త్వరలోనే అర్హులైన పేదలందరికి కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని మంత్రి ప్రకటించారు. గౌరవెల్లి ప్రాజెక్టు పరిధిలో అసంపూర్తిగా నిలిచిపోయిన కుడి, ఎడమ కాల్వలు పూర్తి చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దాదాపు రెండు వేల ఎకరాల భూసేకరణ చేపట్టేందుకు అవసరమయ్యే నిధులతో సవరణ అంచనాలను రూపొందించాలని నిర్ణయం తీసుకుంది. నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు తగిన చర్యలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. రెండో విడతగా చెల్లించాల్సిన బకాయిల చెల్లింపులకు ఆమోదం తెలిపింది. అవసరమైతే ఇథనాల్, విద్యుత్తు ఉత్పత్తికి అక్కడి ఫ్యాక్టరీల్లో ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని చర్చించింది. శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘానికి ఆ బాధ్యతలు అప్పగిం చింది. మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీటిని శామీర్‌పేట చెరువు నింపి, అక్కడి నుంచి హైదరాబాద్‌లో ఉన్న జంట జలాశయాలు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌కు తరలించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొత్తం 15 టీఎంసీలను తరలించి, అందులో 10 టీఎంసీలతో చెరువులు నింపి, మిగతా నీటిని హైదరాబాద్ తాగునీటి అవసరాలకు వినియోగించాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

**తెలంగాణ ప్రభుత్వము**
**ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు (పీహెచ్) డివిజన్ కరీంనగర్, కరీంనగర్ జిల్లా**

ఆసక్తి వ్యక్తీకరణకు ఆహ్వాన నోటీసు

EOI No.2007/T4/EEPHKNR/EOI/Consultancy/2024-25 తేది: 31.07.2024

కరీంనగర్ పీహెచ్ డివిజన్‌లో ఏదైనా గ్రాంటు కింద 2 సంవత్సరములకు గానూ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు జ్యూరిడిక్షన్ కింద అన్ని యూఎల్‌బీలలో డీపీఆర్ఎస్ తయారు చేయుటకు అనుభవం కలిగిన కన్సల్‌టెంట్ల నుండి సీల్డ్ కవర్‌లలో ఆసక్తి వ్యక్తీకరణ ఆహ్వానించడమైనది. 'పేఅండ్ అకౌంట్స్ ఆఫీసర్,కరీంనగర్' పేరున రూ.5వేల డిమాండ్ డ్రాఫ్టును కేవలం ఆర్ఎఫ్‌పీ డాక్యుమెంటు మాత్రమే దరఖాస్తు చేయవలెను. షెడ్యూల్‌జారీ చేయు తేది: 02.08.2024 ఉ॥ 11 గం॥లకు. సీల్డ్ ఆసక్తి వ్యక్తీకరణ దాఖలుకు చివరి తేది: 07.08.2024 సా॥ 4గం॥ల వరకు.ఈవోఐ తెరచు తేది: 07.08.2024 సా॥ 4.30గం॥ల నుండి.

**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు(ఎఫ్ఏసీ) పబ్లిక్‌హెల్త్ డివిజన్,కరీంనగర్**

DIPR No.394-DP/CL/ADVT/1/2024-25

# ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ తీర్పు చారిత్రాత్మకం



- మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ బ్యూరో, ఆగస్టు01 (జనంసాక్షి) : విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఉపవర్గీకరణ సమంజసమేనని, ఉపవర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. పేదలకు న్యాయం జరగాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశమని.. ప్రభుత్వ ఫలాలు అందరికీ అందాలని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పుతో కోట్లాది మంది దళితుల చిరకాల స్వప్నం నెరవేరబోతోందని హర్షం వ్యక్తం చేశారు. వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ మద్దుతు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. మందకృష్ణ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం కొనసాగిన 3 దశాబ్దాల పోరాటాలు ఫలించిందని అన్నారు. ఈ సందర్భంగా మందకృష్ణకు అభినందనలు, తెలిపారు.కమని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. పేదలకు న్యాయం జరగాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశమని.. ప్రభుత్వ ఫలాలు అందరికీ అందాలని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పుతో కోట్లాది మంది దళితుల చిరకాల స్వప్నం నెరవేరబోతోందని హర్షం వ్యక్తం చేశారు. వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ మద్దుతు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. మందకృష్ణ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం కొనసాగిన 3 దశాబ్దాల పోరాటాలు ఫలించిందని అన్నారు. ఈ సందర్భంగా మందకృష్ణకు అభినందనలు, తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ ఉపవర్గీకరణ తీర్పును స్వాగతిస్తున్నాం

- గతంలోనే కెసిఆర్ వర్గీకరణకు మద్దతిచ్చారు
- అసెంబ్లీలో ఎమ్మెల్యే హరీష్ రావు వెల్లడి



హైదరాబాద్, ఆగస్ట్1 (జనంసాక్షి) : ఎస్సీ, ఎస్టీ ఉపవర్గీకరణ అంశంపై సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును బీఆర్ఎస్ పార్టీ పక్షాన స్వాగతిస్తున్నామని.. హర్షం వ్యక్తం చేస్తున్నామని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ శాసనసభలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై హరీశ్‌రావు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణపై తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సభా నాయకుడిగా కేసీఆర్ నవంబర్ 29, 2014లో వర్గీకరణ వెంటనే చేయాలని ఆనాడు సభలో తీర్మానం ప్రవేశపెట్టారన్నారు. కేంద్రానికి ఏకగ్రీవంగా వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేసిన పార్టీ బీఆర్ఎస్ అని.. తీర్మానం చేయడంతో పాటు ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలని తీర్మానం కాపీని స్వయంగా కేసీఆర్ తీసుకొని వెళ్లి ఆ నాటి ఉప ముఖ్యమంత్రులు, దళిత నాయకులతో కలిసి ప్రధానిని కలిసి అందజేశారని గుర్తు చేశారు.అంతే కాకుండా వర్గీకరణ ప్రాధాన్యతను ప్రధానికి కేసీఆర్ వివరించారని.. ప్రధాని ఆ రోజు కూడా చాలా స్పష్టంగా ఇది న్యాయమైన డిమాండ్ అనీ, దీన్ని తప్పకుండా పరిష్కరిస్తామని ఆ రోజు సానుకూలంగా స్పందించారన్నారు. అయితే, వర్గీకరణ పోరాటం సుదీర్ఘమైందని.. ఎన్నో త్యాగాలు జరిగాయన్నారు. ఎంతో మంది ప్రాణాలు అర్పించిన సంగతి మనకు తెలుసునన్నారు. ఇదే గాంధీ భవన్ దగ్గర పెట్రోల్ పోసుకొని ఆ రోజు కొందరు మాదిగలు ఆత్మాహుతికి పాల్పడితే.. అప్పటి ప్రభుత్వం కనీసం వాళ్లను పట్టించుకున్న పాపానపోలేదని మండిపడ్డారు. కానీ, ఆ మాదిగలకు కేసీఆర్.. మా ప్రభుత్వం వచ్చిన వెంటనే వారందరికీ ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆ కుటుంబాలను ఆదుకున్న పార్టీ బీఆర్ఎస్, నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. ఆ నాడు కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేసిందని.. వర్గీకరణ చేయడం లేదని మందకృష్ణ మాదిగ నేతృత్వంలోని గాంధీ భవన్ వద్ద పెద్ద ఎత్తున మాదిగలు ముట్టడికి వచ్చి పోరాటం చేసేందుకు వచ్చిన విషయాన్ని గుర్తు తెచ్చుకోవాలని హితవు పలికారు. ఆ రోజు అమరులైన కుటుంబాలను కేసీఆర్ ప్రభుత్వం ఆదుకున్నది తప్ప గతంలో ఉన్న కాంగ్రెస్ పట్టించుకోకుండా అన్యాయం చేసిన పార్టీ కాంగ్రెస్ అంటూ ధ్వతజమెత్తారు. ఏదిఏమైనా ఈ సందర్భం చాలా సంతోషమైన సందర్భమన్నారు. దశబ్దాలా కల నెరవేరినటువంటి రోజని.. దాంతోనే ఇవాళ బీఆర్ఎస్ పార్టీ తరపున సుప్రీంకోర్టు తీర్పును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామన్నారు. అలాగే, ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్కిల్ యూనివర్సిటీకి సంబంధించిన బిల్లుకు బీఆర్ఎస్ పార్టీ తరపున సంపూర్ణ మద్దతును తెలుపుతున్నాం. కానీ, నిన్న ఇవాళ సభ జరిగిన తీరు మా హృదయాలను గాయపరిచిందన్నారు. మహిళా శాసనసభ్యులను అవమానించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



### మహిళా ఎమ్మెల్యేలపై అనుచిత వాఖ్యలను ఖండిస్తూ
## కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఆందోళన

- చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో మహిళా కార్పోరేటర్లు, శ్రేణుల నిరసన

కరీంనగర్ బ్యూరో, జులై 01 (జనం సాక్షి) : శాసనసభ సభ్యుల అభిప్రాయలను గౌరవించి సభను నడిపించడం సమాజానికి గౌరవ ప్రదం అని బీఆర్ఎస్ పార్టీ నగర మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ పార్టీ మహిళపట్ల ఎమ్మెల్యే పట్ల చేసిన అనుచిత వాఖ్యలకు పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కరీంనగర్ లో ఆంధోళన చేపట్టా రు. నగరంలోని తెలంగాణ చౌక్ వద్ద బీఆర్ఎస్ పార్టీ మహిళ కార్పోరేటర్లు, కార్పోరేటర్లు, నాయ కులు మేయర్ యాదగిరి సునీల్ రావు, నగర అద్యక్షులు చల్ల హరిశంకర్ ఆద్వర్యంలో ధర్నా చేపట్టారు. సీఎం చిత్రపటం చూపిస్తూ... డౌన్ డౌన్ అంటూ నినాధాలు చేశారు. నిండు సభలో పార్టీ సీనియర్ మహిళ ఎమ్మెల్యే పట్ల చేసిన అనుచిత వాఖ్యలను ఖండిస్తూ...నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... విభిన్న పార్టీలు, సభ్యుల బిన్నాభిప్రాయాలు సభలో ఉండటం సహజమని తెలంగాణ శాసనసభకు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. అసెంబ్లీ సమావే శాలు హుందా తనంతో సజావుగా నడిస్తేనే గౌరవ ప్రదం గా ఉంటుందన్నారు. అలాంటి సభలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళ ఎమ్మెల్యే పట్ల అనుచిత వాఖ్యలను చేయడం శోచనీయ మని వారి పై చేసిన వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపా రు. మహిళ ఎమ్మెల్యే పై చేసిన వాఖ్యలను వెంటనె ఉపసం హరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కార్పోరేటర్లు, మహిళ కార్పోరేటర్లు, మహిళ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష పాత్ర పోషిస్తాం

- నిరాశ్రయుడైన బత్కయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- నాలుగు రోజులైనా పాలకులు స్పందించకపోవడం బాధాకరం
- ఓట్ల కోసం కాదు ప్రజల కోసం పనిచేసేవాడే నాయకుడు
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్



మహాముత్తారం, ఆగస్టు 01 (జనంసాక్షి) : ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ స్పష్టం చేశారు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం బోర్లగూడెంలో గత నాలుగు రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇళ్లు దగ్గమైన బతుకయ్య కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. గురువారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సర్వం కోల్పోయి నిరాశ్రయుడైన బతుకయ్యకుటుంబాన్ని స్థానిక పాలకులు, అధికారులు పరామర్శించకపోవడం విడ్డూరమన్నారు. పొట్టకూటి కోసం కులవృత్తిని నమ్ముకుని బోర్లగూడెం గ్రామంలో ఉపాధి పొందుతున్న బతుకయ్య నాలుగు రోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో పని ముట్లు, యంత్రాలతో పాటు సర్వం కోల్పోయి సుమారు రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందన్నారు. ఇప్పటి వరకు అధికారులు వచ్చి కనీసం విచారణ చేయలేదని, కాంగ్రెస ప్రభుత్వంలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఆయన విమర్శించారు. ఉపాధితో పాటు సర్వం కోల్పోయిన బతుకయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఇప్పటి వరకు స్థానిక ఎమ్మెల్యే, అధికారులు ఎవరూ రాకపోవడంతో బతుకయ్య స్వయంగా తనకు ఫోన్ చేసి మీ ద్వారానైనా ప్రభుత్వానికి తన గోడు తెలియాలని కోరారని ఆయన వివరించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కులవృత్తులను ప్రోత్సహిస్తున్నామని చెబుతున్నారే తప్ప కనీసం సాయం అందించడం లేదన్నారు. అగ్ని ప్రమాదంతో ఆస్తినష్టం జరిగి సర్వం కోల్పోయి ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్న బతుకయ్య కుటుంబానికి సాయం చేయాలనే ఆలోచన స్థానిక నాయకులకు, ఎమ్మెల్యేకు రాకపోవడం బాధాకరమన్నారు. బతుకయ్య కుటుంబానికి అండగా నిలిచి ప్రభుత్వ పరంగా సాయం అందించేలా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## విద్యుత్ అధికారుల పొలంబాట

- రైతుల ముంగిట టీజీ ఎన్పీడీసీఎల్ సేవలు
- క్షేత్ర స్థాయిలో సమస్యలు తెలుసుకుని సత్వరమే పరిష్కారం...
- వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు వినూత్న కార్యక్రమాలు...
- వెంకటాపూర్ మండలంలో వ్యవసాయ క్షేత్రము లోని ట్రాన్స్ఫార్మర్లను పరిశీలిస్తున్న సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి.....





వెంకటాపూర్(రామప్ప)ఆగస్టు01(జనం సాక్షి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లో పొలం బాటలో భాగంగా విద్యుత్ అధికారులు నేరు గా పొలాల వద్దకు చేరుకుని రైతులను కలిశారు. విద్యుత్ అధికారులు నేరుగా పొలాల వద్దకు వచ్చిన ఎన్పీడీసీఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి, సిజిఎం ఓపి 2 జి.కిషన్, ఎస్ఈ ఆపరేషన్ భూపాలపల్లి బి.మలచూర్ నాయక్,ములుగు డిఈ పి. నాగేశ్వర్ రావు,డిఈ ఎంఆర్టి సదానందం,ములుగు ఇన్చార్జి ఏడిఈ స్వామి రెడ్డి, ఎస్పిఎం ఎడిఈ బి.సందీప్ పాటిల్, వెంకటాపూర్ ఎఈ ఎం.సురేష్, మల్లంపల్లి ఏఈ వేణుగోపాల్, సబ్ ఇంజనీర్ బి సాంబరాజు, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ ఉదయభాస్కర్,లైన్ ఇన్స్పెక్టర్ వి. సమ్మిరెడ్డి, లైన్ మెన్.వేణు, విద్యుత్ సిబ్బంది మొత్తం క్షేత్ర స్థాయిలో పర్యటించారు.రైతులను కలిసి విద్యుత్ పరంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు.విద్యుత్ సరఫరాలో ఉన్న ఇబ్బందులు, లోఓల్టేజీ,హైఓల్టేజీ విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లై పడుతున్న భారం,తరచూ మరమ్మతులు వస్తున్నాయా? తరచూ కాలిపోతుందా? కాలిపోయిన వెంటనే ట్రాన్స్ ఫార్మర్ మారుస్తున్నారా? అదనపు ట్రాన్స్ ఫార్మర్ అవసరమా? ఒరిగిన విద్యుత్ స్తంభాలు,లూజ్ లైన్లు, ట్రాన్స్ఫార్మర్లకు ఏబీ స్విచ్ లున్నాయా? ట్రాన్స్ఫార్మర్ల గద్దెలు ఎత్తు తక్కువ గా ఉండి ప్రమాదకరంగా ఉన్నాయా? వంటి సమస్యలు తెలుసుకున్నారు.రైతులు చెప్పిన సమస్యలు నమోదు చేసుకుని వాటిని సాధ్యమైన మేరకు త్వరగా పరిష్కరిస్తామన్నారు.అదే విధంగా రైతులకు విద్యుత్ తో జరిగే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.పంట పొలాల చుట్టూ విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా జరిగే ప్రమాదాలపై వివరించారు.మోటార్లకు ఎర్తింగ్ ఏర్పాటు చేసు కోవడం,కెపాసిటర్లు అమర్చుకోవడం, అతుకులులేని సర్వీస్ వైర్ వినియోగంపై అవగాహన కల్పించారు.రైతులు సొంతంగా ఫ్యూజ్ వైర్ మారిస్తే జరిగే నష్టం.. ప్రమాదంపై వివరించారు. విద్యుత్ ప్రమాదాలు ఏఏ సందర్భాల్లో జరుగుతాయో రైతులకు విడమరిచి చెప్పారు.ఇలాంటి సేవలు అందించడం ద్వారా రైతులకు విద్యుత్ అధికారులు,సిబ్బందిపై నమ్మకం కలుగుతుందని, విద్యుత్ సంస్థ వల్ల రైతులకు మేలు జరుగుతుందని, రైతులతో సత్సంబంధాలు ఏర్పడుతాయని ఎన్పీడీసీఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు.

## ఇన్నర్ రింగ్ రోడ్ భూ నిర్వాసితులకు పరిహారం చెల్లింపునకు వేగవంతంగా చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాలు




వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 1 (జనంసాక్షి) : ఇన్నర్ ఇన్నర్ రింగ్ రోడ్ కోసం రైతుల నుండి తీసుకున్న భూమి, భూ నిర్వాసితులకు సత్వరమే పరిహారం చెల్లించేందుకు చర్యలు వేగవంతంగా చేపట్టాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ఈనగాల వెంకట్రామి రెడ్డి, వైస్ చైర్ పర్సన్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖడే, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణిలతో కలిసి ఇన్నర్ రింగ్ రోడ్ కొరకు భూములు తీసుకొన్న రైతులకు పరిహారం చెల్లింపు, క్రీడానగరం ఏర్పాటుకు భూగుర్తింపుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్య శారదా దేవి మాట్లాడుతూ ఇన్నర్ రింగ్ రోడ్డు కు భూములు ఇచ్చిన తిమ్మాపూర్, ఖిలా వరంగల్ గొర్రెకుంట ఏనుమాముల రైతులకు త్వరితంగా పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రెవిన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్లో స్పోర్ట్స్ స్టేడియం క్రీడా నగరం ఏర్పాటు చేయుటకు గాను నగర పరిసరాల్లో 50 నుండి 100 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించాలని ఆర్ డి ఓ కు సూచించారు. ఈ సందర్భంగా కూడా చైర్మన్ ఈనగాల వెంకట్రామి రెడ్డి మాట్లాడుతూ వరంగల్ కోసం స్పోర్ట్స్ స్టేడియం ఆవశ్యకత ఎంతైనా ఉందని, వరంగల్ నగరం పరిసరాల్లో క్రీడా నగర్ ఏర్పాటుకు ప్రభుత్వ భూమిని గుర్తించాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్డీవో కృష్ణవేణి, కుడా పిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్రావు,కలెక్టరేట్ సూపరిన్టెండెంట్ చంద్రశేఖర్, తాసిల్దారులు నాగేశ్వరరావు, రియాజుద్దీన్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

## 3న జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు మంత్రుల రాక..

- వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన..
- పర్యటనకు ఏర్పాట్లు సిద్ధం చేయాలి : జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా బ్యూరో, (జనంసాక్షి) : ఈ నెల 3వ తేదీన రాష్ట్ర మంత్రులు జిల్లా పర్యటన సందర్భంగా అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం గణపురం మండలం, మైలారం గ్రామంలో ఇండస్ట్రియల్ పార్కు తదితర అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు మంత్రులు శంకుస్థాపనలు చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్టేజీ ఏర్పాట్లు పర్యవేక్షణ చేయాలని ఆర్ అండ్ బి ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. విద్యుత్ అంతరాయం రాకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. మైదానాన్ని పరిశుభ్రం చేసి వాటర్ ప్రూఫ్ టెంట్, కుర్చీలు వేయాలని అన్నారు. మంచినీరు ఏర్పాటు చేయాలని ఆర్ డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వాహనాలు పార్కింగ్ స్థలాన్ని పరిశీలించి, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. విధులు కేటాయించిన సిబ్బంది ఎలాంటి అంతరాయం రాకుండా ఏర్పాట్లు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఈఈ వెంకటేశ్వర్లు, ఆర్ డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, ఆర్డీఓ మంగిలాల్, ఎంపిడిఓ భాస్కర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

- ఖానాపూర్‌లో భారీ ర్యాలీ
- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందిరామయ్య




ఖానాపూర్ రూరల్, ఆగస్టు 1 (జనం సాక్షి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందిరామయ్య డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయాలనే డిమాండ్ తో పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం ఖానాపూర్ లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక విశ్రాంతిభవనం నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అదికారంలోకి వచ్చి 7 నెలలు కావస్తున్నా హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందనీ అన్నారు. ముఖ్యంగా ఇచ్చిన అన్నీ హామేలతోపాటు 8 గ్యారంటీలను అమలుచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందనీ అన్నారు. ఋణ మాఫీని కూడా హామీ ఇచ్చిన ప్రకారం ఆగస్టు 15 లోపు 2 లక్షల రూపాయలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని, తప్పులు పడిన వేలాది మంది రైతుల పేర్లను సరిచేసి వారికి బేషరతుగా రుణమాఫీ అందించాలని అన్నారు.పోడుసాగుదారులందరికి పట్టాలను, సాగు హక్కులను కల్పించాలని, అర్హులైన ప్రతిఒక్కరికి తెల్ల రేషన్ కార్డు ఇవ్వాలన్నారు. ఇంటి స్థలం లేని వారికి ఇంటి స్థలాన్ని, గృహ నిర్మాణానికి 10 లక్షల రూపాయలను ఇవ్వాలని, అర్హులైన వారందరికి ప్రభుత్వ వాగ్దానం ప్రకారం పెంషన్లు ఇవ్వాలనీ డిమాండ్ చేశారు.రైతాంగ రుణాలను రద్దు చేసి కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. స్కాలర్ షిప్స్ ను, ఫీజు రియంబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలను వెంటనే చెల్లించాలని అన్నారునిరుద్యోగ ఖాళీలపై శ్వేత పత్రం ప్రకటించి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాల అన్నారు.ఖానాపూర్ డబుల్ బెడ్ రూమ్ లలో నివాసముంటున్న వారిని వెంటనే గుర్తించి ఇంటి పట్టాలు ఇవ్వాలనీ డిమాండ్ చేశారు.డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రక్కన తక్షణమే ప్రభుత్వ అధికారులు భూమి సర్వే నిర్వహించి ఇండ్లు లేని నిరుపేదలకు మిగిలిన భూమిలో ఇందిరమ్మ గృహాలు నిర్మించి ఇవ్వాలనీ డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) మండల నాయకులు జక్కుల రాజన్న, మడావి అంకుష్ రావ్, కుంచపు ఎల్లయ్య, దాదాబాయి, వర్మ, కత్తుల శ్రీకాంత్, దాదేబాయ్ తదితరులున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
02 ఆగస్ట్ 2024

# తల్లిపాలే బిడ్డకు రక్షణ కవచం

(ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు: ఆగస్టు1 నుంచి 7వరకు)



తల్లి ఆరోగ్యానికి, పుట్టబోయే శిశు ఆరోగ్యానికి అవినాభావ సంబంధం ఉంటుంది. ఆరోగ్యంగా ఉన్న అమ్మ సంరక్షణలో శిశు ఆరోగ్యం మరింత మెరుగ్గా ఉంటుంది. అందుకే కడుపులో ఊపిరి పోసుకున్నప్పటి నుంచి పసిపిల్లల్ని కంటికి రెప్పలా కాపాడే బాధ్యత అమ్మ చూసుకుంటుంది. తల్లి తనువులోని అనువణువు అర్పించి, నెత్తుటి చుక్కలని క్షీరామృతంగా మార్చి బిడ్డకు జీవం పోస్తుంది. శిశువుల, తల్లుల ఆరోగ్యం, శ్రేయస్సు కోసం తల్లిపాల ప్రాముఖ్యత, బిడ్డ పోషణ, ఆరోగ్యం తదితర విషయాల్లో ఆమెకు తగినంత అవగాహన కల్పిస్తూ ఆ దిశలో కాబోయే తల్లిని ప్రోత్సహించడం మనందరి బాధ్యత. అందుకే బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు తాగించడం, మొదటి ఆరునెలల వయస్సు వరకు తల్లిపాలు మాత్రమే ఇప్పించడం, ఆరునెలల తర్వాత అదనపు ఆహారం ఇవ్వడంతో పాటు తల్లిపాలు రెండేళ్ళ వరకు లేదా వీలైనంత ఎక్కువ కాలం ఇప్పించటం వంటి లక్ష్యాలతో ఆగస్టు 1992 నుండి ప్రతి ఏడాది ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) యూనిసెఫ్ సహకారంతో భారతదేశంతో సహా 170 దేశాలు "ప్రపంచ తల్లిపాల వారోత్స వాలను" జరుపు కుంటున్నాయి. వైద్యరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ, స్వచ్ఛంద సంస్థలు, ప్రచార సాధనాలు దీనిపై ర్యాలీలు, అవగాహనా సమావేశాల ద్వారా విస్తృత ప్రచారం చేయడం జరుగుతుంది.

**అవగాహన లోపమే అనర్థాలకు మూలమా! :** తల్లిపాలు పూర్తిగా కొనసాగించకపోవటం వల్ల కలిగే నష్టాలపై మన దేశంలో జరుపబడిన ఒక అంతర్జాతీయ అధ్యయనం ప్రకారం ప్రతి ఏడాది నీళ్ళవిరేచనాలు, న్యుమోనియా (శ్వాసకోశ జబ్బు)లతో దాదాపు ఒకలక్ష మంది 5 ఏళ్ల లోపు పిల్లలు చనిపోతున్నారు. ప్రతి ఏటా 3 కోట్ల మంది పిల్లలు నీళ్ళవిరేచనాలకు, 24 లక్షల మంది చిన్నారులు న్యుమోనియా జబ్బులకు, 40,382 మంది పిల్లలు స్థూలకాయానికి లోనవుతున్నారు. ప్రతి యేటా సుమారు 7000 మంది తల్లులు రొమ్ము క్యాన్సర్, 1700 మంది తల్లులు గర్భాశయ క్యాన్సర్ జబ్బుల బారిన పడుతు న్నారు. కొంతమంది తల్లులకు అమ్మపాల ప్రాముఖ్యతపై సరియైన అవగాహన లేకపోవడమే ఈ అనర్థాలకు మూలం. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (2019-21) ప్రకారం 41.8 శాతం తల్లులు మాత్రమే మొదటి గంటలో తల్లిపాలు ప్రారంభి స్తున్నారు. 45.9 శాతం పిల్లలకు మాత్రమే 6 నెలల వయస్సులో అదనపు ఆహారం మొదలుపెట్టడం జరుగుతుంది. తల్లిపాలి వ్వడం అనేది తల్లీబిడ్డల ఇద్దరి హక్కు. తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచి ప్రసవించే వరకు బిడ్డకి పోషణ తల్లి నుంచి పేగు ద్వారా క్రమం తప్పకుండా అందుతూ ఉండేది. అప్పుడే పుట్టిన బిడ్డకి పోషణ లభించాలంటే తల్లిపాలు ఎంత తొందరగా ఇస్తే అంత మంచిది.

**ముర్రు పాలే తొలి మురిపాలు:** గంటలోపు తల్లి ఇచ్చే ముర్రుపాలే బిడ్డకి తొలి మురిపాలు. ప్రసవం తర్వాత బిడ్డను తల్లి వద్దకు తీసుకురా గానే గంట లోపు తల్లి పాలను తాగించాలి. అప్పుడే పుట్టిన శిశువుకు 12గం. నిద్ర అవసరం. పుట్టిన గంటలోపు పాప నిద్రలోకి జారుకోక ముందే ముర్రుపాలు తాగించాలి. ఒక వేళ సీజేరియన్ కాన్పు అయితే తల్లి స్పృహలోకి వచ్చిన వెంటనే బిడ్డకి పాలు పట్టించాలి. తల్లి యొక్క బంధువులు లేదా ఆషా కార్యకర్తలు తల్లి మొదటి సారి బిడ్డకు పాలిచ్చే వరకు తల్లి శరీరమునకు హత్తుకొని, చనుమొన లను బిడ్డ స్పృశించినట్లు చేసి పాలు ఇచ్చే విధంగా తోడ్పడాలి. బిడ్డ తల్లి చనుమొనలను స్పృశిస్తూ చీకడం వల్ల పాల ఉత్పత్తి త్వరగా జరుగును. కాన్పు అయిన మొదటి రెండు మూడు రోజులు తల్లిపాలు చిక్కగా, పసుపు రంగులో ఉంటాయి. వీటిని ముర్రుపాలు లేదా కొలాస్ట్రం అంటారు. ముర్రుపాలలో బిడ్డ రక్షణకు అవసరమయ్యే రోగనిరోధక శక్తి ఉండటం వల్ల ఇది ఒక వ్యాక్సిన్ లాగా ఉపయోగపడుతుంది.

**తల్లులకు ముఖ్యమైన సలహా :** ఉద్యోగినులైన తల్లులు గృహిణిగా ఉంటూ, ఉద్యోగం చేసుకుంటూ తమ పిల్లలకు తల్లిపాలు కొనసాగించడం కొంత ఇబ్బందికరమే.మనదేశంలో ప్రసూతి ప్రయోజన (సవరణలతో) చట్టం 2017 ప్రకారం అధికారిక రంగంలో పనిచేస్తున్న తల్లులకు 26 వారాలు (6 నెలలు) పూర్తి జీతంతో కూడిన ప్రసూతి సెలవు లభిస్తుంది. కాంట్రాక్ట్, సంఘటిత, అసంఘటిత రంగాలలో పనిచేసే మహిళలందరికీ వర్తిస్తుందని తెలుసుకోవాలి. తెలంగాణ రాష్ట్రంలో 180 రోజుల ప్రసూతి సెలవుకు అదనంగా ప్రభుత్వ మహిళా ఉద్యోగినిలకు 90 రోజులు శిశు సంరక్షణ సెలవు (చైల్డ్ కేర్ లీవ్ జీవో 209, తేదీ:21-11-2016) ఉపయోగించుకో వచ్చు. గర్భిణీ దశలో బాలింత సమయంలో కుటుంబ సభ్యుల సహకారం తప్పనిసరి అందించాలి. పాలిచ్చే తల్లులు తప్ప కుండా రోజుకు 4-5 లీటర్లు నీరు తీసుకోవాలి. పాలివ్వడం ద్వారా తల్లి అందం ఏమాత్రం తగ్గదన్న నగ్నసత్యం తెలుసు కోవాలి. పాలు బాగా పడి కొనసాగేందుకు తరచుగా బిడ్డకు పాలివ్వడం, గర్భవతిగా (చూలింతగా) ఉన్నప్పుడు, పురుడు తరువాత (బాలింతగా) కూడా మంచి పౌష్టిక (సంతులన) ఆహారం తీసుకోవాలి. దీనికోసం ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా తల్లికి అందిస్తున్న పోషకాహారం మరియు ఆరు నెలలు నిండిన శిశువుకు బాలామృత అనుబంధ ఆహార సౌకర్యాలు ఉపయోగించుకోవాలి.



**నాశబోయిన నరసింహ (నాన)**
**కవి,రచయిత, ఆరోగ్య విస్తరణ అధికారి,**
**8555010108**

# పార్లమెంట్‌లో కులం ప్రస్తావన?



**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్,
విశ్లేషకులు
9951865223

*పవిత్రమైన పార్లమెంట్‌లో కులగణన గురించి ప్రస్థావిస్తున్న నాయకుడి కులం ఏమిటో ఆయనకే తెలియదని, ఆయన కులగనణ గురించి అడుగుతాడని పరోక్షంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ని అవమానిస్తూ బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతాడు. ఆయన ను మెచ్చుకుంటూ పీఎం నరేంద్ర మోడీ ట్విట్ చేస్తారు. దేశం అంతా ఇప్పుడు విషయం చర్చా నీయంశం అయిపోతుంది. ఎన్నికల ప్రచారం లో పీఎం మోడీ పలు మార్లు మైనారిటీ లను అవమానిస్తూ వారు హిందూ మహిళల తాళిబొట్లు లాక్కొని వెళ్తారని, బర్లను తీసుకెళు తారని,ఆ వర్గంను వారు వేసుకునే బట్టలతో గుర్తించవచ్చు అని ఇలా మాటలతో అవమానాలకు గురిచేస్తారు. గతంలో మంత్రి గా ఉన్న ఇదే అనురాగ్ ఠాకూర్ ముస్లింలను గోలి మారో సాలోంకు అంటాడు. ఉన్నత వర్గాలకు చెందిన అనురాగ్ ఠాకూర్ కు బలహీన వర్గాలు అంటే ఇంత చులకన దేనికి?*




### ఒక సభ్యుడి కులం కోసం మాట్లాడుతారా?

ఒక సభ్యుడి కులం గురించి పార్లమెంట్ లో ప్రస్థావిస్తాడా? అంటూ యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ ధ్వజం ఎత్తారు. అఖిలేష్ యాదవ్ ఇలాంటి కులం పేరిట జరిగిన ఎన్నో అవమానాలను ఎదురుకున్నారు. పార్లమెంట్ ఎన్నికలప్పుడు కన్నోజ్ లో ఒక గుడికి అఖిలేష్ వెళ్లి వచ్చాక బీజేపీ కార్యకర్తలు గంగా జలం తో శుద్ధి చేశారు. ఈ విషయాన్ని శుద్ధి చేసిన వారే వైరల్ చేసారు. 2017 లో యూపీ లో అధికారం కోల్పోయాక ఆయన సీఎం గా ఉన్న గృహాన్ని ఖాళీ చేసిన సందర్భంగా బీజేపీ సీఎం యోగి ఆదిత్య నాథ్ కొన్ని రోజులు గెస్ట్ హౌస్ లో ఉండి, గంగా జలం తో శుద్ధి చేసి, హోమం, పూజలు చేసి ఆ గృహం లోకి వెళ్ళాడు. గతంలో ప్రస్తుత బీహార్ సీఎం నితీష్ కుమార్ ను పట్టుకుని ఆయన డిఎన్ఏ లో గడ్బడ్ ఉందని పీఎం మోడీ అన్నారు. అప్పుడు తీవ్ర ఆందోళనలు మోడీకి వ్యతిరేకం గా జరిగాయి.ఇలాగే మైన్పూరి లో జరిగింది.

### బీజేపీలో బడుగుల మీద ప్రేమ లేదు

బీజేపీ లో కులం పట్టుకుని దళితులు, ఎస్టీ లను, బిసి, ఓబీసీ లను అసలు మనుషులు గానే చూడని వారంతా' అన్నిహిలేషన్ అఫ్ కాస్ట్' లాంటి రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన పుస్తకం చదవాలి. రాం మందిర్ శంకుస్థాపన కు అప్పటి రాష్ట్రపతి కోవింద్ ను పిలువలేదు. అదే రాంమందిర్ ప్రారంభోత్సంలో ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ ముర్ ను పిలువలేదు అంటే బీజేపీ వాళ్లకు దళితులు, ఎస్టీలు అంటే ఎంత వ్యతిరేకత ఉందో స్పష్టం అవుతున్నది.కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభం రాష్ట్రపతి లేకుండానే జరుగుతుంది. మధ్యప్రదేశ్ లో ఒక ఆదివాసీ యువకుడి మీద బీజేపీ కార్యకర్త ఉత్స పోసి దాడి చేసి కొట్టిన ఘటన, చెత్తిస్ గడ్ లో గొడ్డు మాంసం తిన్నారని ఇద్దరు ఆదివాసీ యువకుల ప్రాణాలు తీస్తారు. యూపీ లో ఆవులు దొంగిలించారనే నెపం తో ఇద్దరు ముస్లిం యువకులను జీపులో పెట్టి డోర్లు వేసి పెట్రోల్ పోసి తగుల బెట్టి సజీవంగా దహనం చేస్తారు. ఢిల్లీలో రోడ్డు మీద నమాజు చదువుతున్నారని పోలీసులు నమాజు లో ఉన్నవారిని బూటు కాలుతో తన్నుతారు. పీఎం స్వంత రాష్ట్రం అయిన గుజరాత్ లో దళితుడు పెండ్లిలో గుర్రం ఎక్కుతాడా, మీసం పెంచుతాడా? అంటూ దాడి చేసిన సంఘటన ను ఎలా మర్చిపోగలం.





### రాజ్యాంగం చదవండి

బీజేపీ వాళ్ళు ఒకసారి రాజ్యాంగం, మండల్ కమిషన్ మీద వచ్చిన పుస్తకాలు చదవాలి. సామాజిక వర్గం సంఖ్యను బట్టి భాగస్వామ్యం ఇష్టం లేని బీజేపీ, సామాజిక వర్గం సంఖ్యను బట్టి భాగస్వామ్యం కోసం కులగణనను డిమాండ్ చేస్తున్న రాహుల్ గాంధీ అంటే గిట్టదు. నిజాయితీ గా మాట్లాడే వారు, నిజం చెప్పే వారు అంటే కోపం, అందుకే ఎప్పుడెప్పుడివో పాత, అవుట్ డేటెడ్, తలా, తోక లేని విషయాలను ఎత్తి చూపుతూ, ఇప్పుడు వచ్చిన బడ్జెట్ లోని లొసుగులను పార్లమెంట్ లో చర్చించకుండా తప్పించు కోడానికి, దాటవేయడానికి ఇలా కులం ప్రస్తావన తెచ్చారు. పాపం ఈ సారి ఎందుకో గాని అనురాగ్ ఠాకూర్ కు మంత్రి పదవి రాలేదు, ఇలాగైనా ప్రతిపక్ష నేతను కొంత విమర్శిస్తే, అది మోడీ దృష్టి కి వస్తే మరో సారి మంత్రి ని అయిపోతానని అనురాగ్ ఠాకూర్ అనుకుంటున్నట్లు ఉన్నది.

### అనురాగ్, పీఎంలు క్షమాపణ చెప్పాలి

కాని ఆయన అలా కులం కోసం మాట్లాడి ఎంత తప్పు చేసాడో ఆయనకు అర్థం కానట్లు ఉన్నది. బీజేపీ లో కొందరు అలాగే ఉంటారు, వారికి మోడీ ని ప్రసన్నం చేస్తే చాలు, అలా ఉండిపోతారు, ఎట్లబడితే, అట్ల మాట్లాడుతారు, మాజీ కేంద్రమంత్రి స్మితి ఇరాని గతి పట్టే దాకా అంతే, మరీ అనుభవాల నుంచి గుణ పాఠాలు నేర్చువాలి!పీఎం మోడీ కి ఒకరి భుజం మీద తుపాకి పెట్టి ఇటీవల పేల్చుతున్న వన్నీ, ఆయన నేరుగా పేల్చుతున్న వాటి తో సహా మాటలు, వ్యూహాలు ఫెయిల్ అవుతున్నాయి!రాహుల్ గాంధీ ఇప్పుడు బీజేపీ కి కొరకరాని కొయ్య అయ్యిందు. అటు మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ కూడ అంతే, బీజేపీ వర్సెస్ ఇండియా కూటమి ముందు ఇప్పుడు చాలా సవాళ్ళు ఉన్నాయి.జరా పైలం!రాహుల్కు మాత్రమే కాదు, మొత్తం దేశం లోని 90 శాతం ఉన్న బడుగు,బలహీన, వెనుకబడిన తరగతుల ప్రజలకు బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్, ఆయన అనుచిత, అభ్యన్తరకర మాటలను మెచ్చుకున్న పీఎం నరేంద్ర మోడీలు దేశానికీ క్షమాపణ చెప్పాలి.

# సమకాలిన మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడిదారీ విధానం

**పెట్టుబడిదారీ విధానం ముఖ్యమైన లక్షణం లాభం పొందాలనే ఉద్దేశ్యం. 18వ శతాబ్దపు తత్వవేత్త ఆధునిక ఆర్థిక శాస్త్ర పితామహుడు అయిన ఆడమ్ స్మిత్ ఇలా అన్నాడు: "మేము మా విందును ఆశించేది కసాయి, బ్రూవర్ లేదా బేకర్ యొక్క దయాదాక్షిణ్యాల నుండి కాదు, కానీ వారి స్వంత ఆసక్తిని బట్టి." స్వచ్ఛంద మార్పిడి లావాదేవీకి సంబంధించిన రెండు పార్టీలు ఫలితంపై వారి స్వంత ఆసక్తిని కలిగి ఉంటాయి, కానీ మరొకరు ఏమి కోరుకుంటు న్నారో ప్రస్తావించకుండా అతను లేదా ఆమె కోరుకున్నది పొందలేరు. ఈ హేతుబద్ధమైన స్వార్థమే ఆర్థికాభివృద్ధికి దారితీయగలదు.**

1. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో, మూలధన ఆస్తులు-ఫ్యాక్టరీలు, గనులు రైలుమార్గాలు-ప్రైవేట్ యాజమాన్యం నియంత్రించబడతాయి, డబ్బు వేతనాల కోసం శ్రమను కొనుగోలు చేస్తారు. పెట్టుబడిదారీ విధానం కొన్ని రూపాలు నేడు దాదాపు అన్ని ఆర్థిక వ్యవస్థలకు ఆధారం అయినప్ప టికీ, గత శతాబ్దంలో చాలా వరకు ఇది ఆర్థిక సంస్థకు సంబంధించిన రెండు ప్రధాన విధానాలలో ఒకటి. మరొకటి, సోషలిజంలో, రాష్ట్రం ఉత్పత్తి సాధనాలను కలిగి ఉంటుంది ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థలు లాభాల కంటే సామాజిక మంచిని పెంచడానికి ప్రయత్నిస్తాయి. పెట్టుబడి దారీ విధానం క్రింది స్తంభాలపై స్థాపించబడింది. ప్రైవేట్ ఆస్తి, ఇది భూమి ఇళ్ళు స్టాక్‌లు బాండ్‌ల వంటి కనిపిం చని ఆస్తులను కలిగి ఉండటానికి ప్రజలను అనుమతిస్తుంది.

- స్వీయ-ఆసక్తి, దీని ద్వారా ప్రజలు సామాజిక రాజకీయ ఒత్తిళ్లను పట్టించుకోకుండా వారి స్వంత మేలు కోసం పని చేస్తారు. ఏది ఏమైనప్పటికీ, ఈ సమన్వయం లేని వ్యక్తులు స్మిత్ 1776 వెల్త్ ఆఫ్ నేషన్స్ మాటలలో, వారు అదృశ్య హస్తం ద్వారా మార్గనిర్దేశం చేయబడినట్లుగా సమాజానికి ప్రయోజనం చేకూర్చారు.
- పోటీ, మార్కెట్లలోకి ప్రవేశించడానికి , నిష్క్రమించడానికి సంస్థల స్వేచ్ఛ ద్వారా, సామాజిక సంక్షేమాన్ని పెంచుతుంది, అంటే ఉత్పత్తిదారులు వినియోగదారుల ఉమ్మడి సంక్షేమం
- కొనుగోలుదారులు అమ్మకందారుల మధ్య పరస్పర చర్యల ద్వారా వికేంద్రీకృత పద్ధతిలో ధరలను నిర్ణయించే మార్కెట్ మెకానిజం-ధరలు, ప్రతిఫలంగా, వనరులను కేటాయించడం, ఇది సహజంగా వస్తువులు సేవలకు మాత్రమే కాకుండా వేతనాలకు కూడా అత్యధిక బహుమతిని కోరుతుంది.
- వినియోగం, ఉత్పత్తి పెట్టుబడికి సంబంధించి ఎంచుకునే స్వేచ్ఛ-అసంతృప్తి చెందిన కస్టమర్‌లు వేర్వేరు ఉత్పత్తులను కొనుగోలు చేయవచ్చు,పెట్టుబడిదారులు మరింత లాభదాయ కమైన వెంచర్‌లను కొనసాగించవచ్చు, కార్మికులు మెరుగైన వేతనం కోసం తమ ఉద్యోగాలను వదిలివేయవచ్చు.
- ప్రైవేట్ పౌరుల హక్కులను రక్షించడానికి మార్కెట్ల సక్రమ పనితీరును సులభతరం చేసే క్రమమైన వాతావరణాన్ని నిర్వహించడానికి ప్రభుత్వం పరిమిత పాత్ర. ఈ స్తంభాలు ఏ మేరకు పనిచేస్తాయి అనేది పెట్టుబడిదారీ విధానం యొక్క వివిధ రూపాలను వేరు చేస్తుంది. స్వేచ్ఛా మార్కెట్లలో, లైసెజ్-ఫెయిర్ ఆర్థిక వ్యవస్థలు అని కూడా పిలుస్తారు, మార్కెట్లు తక్కువ లేదా నియంత్రణ లేకుండా పనిచేస్తాయి. మార్కెట్లు ప్రభుత్వాల సమ్మేళనం కారణంగా పిలవబడే మిశ్రమ ఆర్థిక వ్యవస్థలలో , మార్కెట్లు ప్రధాన పాత్ర పోషిస్తాయి, కాలుష్యం ట్రాఫిక్ రద్దీ వంటి మార్కెట్ వైఫల్యా లను సరిచేయడానికి ప్రభుత్వం ద్వారా ఎక్కువ స్థాయిలో నియంత్రించబడతాయి.

మిశ్రమ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలు నేడు ప్రబలంగా ఉన్నాయి. పెట్టుబడిదారీ విధానం అనేక ఛాయలు, ఆర్థికవేత్తలు వివిధ ప్రమాణాలను ఉపయోగించి పెట్టుబడి దారీ విధానాన్ని వివిధ సమూహాలుగా వర్గీకరిస్తారు. ఉదాహరణకు, పెట్టుబడిదారీ విధానాన్ని ఉత్పత్తి ఎలా నిర్వహించబడుతుందనే దాని ఆధారంగా కేవలం రెండు రకాలుగా విభజించవచ్చు. ఉదారవాద మార్కెట్ ఆర్థిక వ్యవస్థలలో, పోటీ మార్కెట్ ప్రబలంగా ఉంటుంది ఉత్పత్తి ప్రక్రియలో ఎక్కువ భాగం యునైటెడ్ స్టేట్స్ యునైటెడ్ కింగ్‌డమ్‌లో కనిపించే స్వేచ్ఛా-మార్కెట్ పెట్టుబడిదారీ విధానం వలె వికేంద్రీకృత పద్ధతిలో జరుగుతుంది. సమన్వయ మార్కెట్ ఆర్థిక వ్యవస్థలు , మరోవైపు, జర్మనీ జపాన్‌లో వలె యూనియన్లు వ్యాపార సంఘాల వంటి మార్కెట్-యేతర సంస్థల ద్వారా ప్రైవేట్ సమాచారాన్ని మార్పిడి చేసుకుంటాయి.

ఇటీవల, ఆర్థికవేత్తలు నాలుగు రకాల పెట్టుబడిదారీ విధానానికి అనుగుణంగా ఆవిష్కరణలను నడిపించడంలో వ్యవస్థాపకత పాత్ర (వ్యాపారాలను ప్రారంభించే ప్రక్రియ) ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడానికి కొత్త ఆలోచనలను రూపొందించే సంస్థాగత సెట్టింగ్‌ల ఆధారంగా గుర్తించ బడ్డారు (బామోల్, లిటన్ స్క్రామ్ 2007). రాష్ట్ర మార్గనిర్దేశక పెట్టుబడిదారీ విధానంలో , ఏయే రంగాలు వృద్ధి చెందాలో ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ప్రారంభంలో వృద్ధిని ప్రోత్సహించాలనే కోరికతో ప్రేరేపించబడిన ఈ రకమైన పెట్టుబడిదారీ విధానం అనేక నష్టాలను కలిగి ఉంది : అధిక పెట్టుబడి, తప్పు విజేతలను ఎంచుకోవడం, అవినీతికి గురికావడం ఇకపై సముచితం కానప్పుడు మద్దతునుఉపసంహరించుకోవడంలో ఇబ్బంది. ఒలిగార్కిక్ పెట్టుబడిదారీ విధానం జనాభాలో చాలా ఇరుకైన భాగాన్ని రక్షించడం సుసంపన్నం చేయడం వైపు దృష్టి సారించింది. ఆర్థిక వృద్ధి అనేది కేంద్ర లక్ష్యం కాదు, ఈ రకం ఉన్న దేశాలు అసమానత అవినీతికి పెద్ద మొత్తంలో ఉన్నాయి. పెద్ద-సంస్థ పెట్టుబడిదారీ విధానం ఆర్థిక వ్యవస్థల ప్రయోజనాన్ని పొందుతుంది. ఉత్పత్తుల భారీ ఉత్పత్తికి ఈ రకం ముఖ్యమైనది. వ్యవస్థాపక పెట్టుబడిదారీ విధానం ఆటోమొబైల్, టెలిఫోన్ కంప్యూటర్ వంటి పురోగతులను ఉత్పత్తి చేస్తుంది. ఈ ఆవిష్కరణలు సాధారణంగా వ్యక్తులు కొత్త సంస్థల ఉత్పత్తి. అయినప్పటికీ, కొత్త ఉత్పత్తులను భారీగా ఉత్పత్తి చేయడానికి మార్కెట్ చేయడానికి పెద్ద సంస్థలు అవసరం, కాబట్టి పెద్ద-సంస్థ వ్యవస్థాపక పెట్టుబడి దారీ విధానం ఉత్తమంగా కనిపిస్తుంది. ఇది ఇతర దేశాల కంటే యునైటెడ్ స్టేట్స్‌ను ఎక్కువగా వర్ణించే రకం.

1930ల మహా మాంద్యం సమయంలో, అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలు విస్తృతంగా నిరుద్యోగాన్ని చవిచూశాయి. తన 1936 ఉద్యోగ, వడ్డీ డబ్బు యొక్క సాధారణ సిద్ధాంతంలో , బ్రిటీష్ ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కీన్స్ పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడి మందగమనం నుండి కోలుకోవడానికి కష్టపడుతుందని వాదించారు, ఎందు కంటే పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అధిక నిరుద్యోగం వృద్ధి లేకుండా సమతుల్యతలో నిరవధికంగా ఉంటుంది. 1930వ దశకంలో చూసినటువంటి అధిక నిరుద్యోగం ప్రతి ద్రవ్యోల్బ ణంతో పోరాడటానికి మొత్తం డిమాండ్‌ను ప్రోత్సహించ డానికి రాష్ట్ర ప్రమేయం లేకుండా లైసెజ్-ఫెయిర్ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలు తమ స్వంతంగా బాగా పనిచేస్తాయనే భావనను కీనేసియన్ ఆర్థికశాస్త్రం సవాలు చేసింది.

సాధారణంగా పెట్టుబడిదారీ విధానం విజయానికి దారితీసే శక్తులు కూడా దాని వైఫల్యానికి నాంది పలుకుతాయి. ప్రభుత్వాలు వాటిని నియంత్రించే నిబంధనలను-ఆస్తి హక్కులను నిర్ధారించే చట్టాలు-వస్తువులను ప్రజలను తరలించడానికి రోడ్లు హైవేలు వంటి సరైన మౌలిక సదుపాయాలతో మార్కెట్‌లకు మద్దతు ఇచ్చినప్పుడు మాత్రమే స్వేచ్ఛా మార్కెట్లు అభివృద్ధి చెందుతాయి. అయితే, ప్రభుత్వాలు వ్యవస్థీకృత ప్రైవేట్ ప్రయోజనాల ద్వారా ప్రభావితమవుతాయి, ఇవి ప్రజా ప్రయోజనాలను పణంగా పెట్టి తమ ఆర్థిక స్థితిని కాపాడుకోవడానికి నిబంధనల శక్తిని ఉపయోగించుకోవ డానికి ప్రయత్నిస్తాయి-ఉదాహరణకు, వారి విజయానికి కారణమైన అదే స్వేచ్ఛా మార్కెట్‌ను అణచివేయడం ద్వారా.కాబట్టి, రాజన్ జింగాల్స్ (2003) ప్రకారం, సమాజం "పెట్టుబడిదారుల నుండి పెట్టుబడిదారీ విధానాన్ని రక్షించాలి"-అంటే, దాని సమర్థవంతమైన పనితీరుకు ఆటంకం కలిగించే శక్తివంతమైన ప్రైవేట్ ప్రయోజనాల నుండి స్వేచ్ఛా మార్కెట్‌ను రక్షించడానికి తగిన చర్యలు తీసుకోవాలి. రాజకీయ ఆసక్తి పెట్టుబడిదారీ వర్గం కలిస్తే, "క్రోనీ క్యాపిటలిజం" ఉద్భవించవచ్చు బంధుప్రీతి సామర్థ్యం కంటే ఎక్కువ లాభదాయకంగా ఉంటుంది. పోటీని నిర్ధారించడానికి ఉత్పాదక ఆస్తుల యాజమాన్యం యొక్క ఏకాగ్రత తప్పనిసరిగా పరిమితం చేయబడాలి. , పోటీ విజేతలు పరాజితులను కలిగిస్తుంది కాబట్టి, ఓడిపో యిన వారికి తప్పనిసరిగా పరిహారం చెల్లించాలి. స్వేచ్ఛా వాణిజ్యంఅధికారంలో ఉన్న సంస్థలపై బలమైన పోటీ ఒత్తిడి కూడా శక్తివంతమైన ప్రయోజనాలను దూరంగా ఉంచు తుంది. అత్యంత ఇటీవలి అధ్యయనం 18వ శతాబ్దానికి సంబంధించి కీలకమైన ఆర్థిక సామాజిక విధానాలను వెలికితీసే ఏకైక డేటా సేకరణను విశ్లేషిస్తుంది. సమకాలీన మార్కెట్ ఆర్థిక వ్యవస్థలలో, పెట్టుబడిపై రాబడి రేటు తరచుగా మొత్తం వృద్ధిని అధిగమిస్తుందని కనుగొంది. సమ్మేళనంతో, ఆ వ్యత్యాసం కొనసాగితే, మూలధన యజమానుల వద్ద ఉన్న సంపద ఇతర రకాల ఆదాయాల కంటే (ఉదాహరణకు వేతనాలు) చాలా వేగంగా పెరుగుతుంది, చివరికి వాటిని విస్తృత మార్జిన్‌తో అధిగమిస్తుంది. ఈ అధ్యయనానికి ఆరాధకులు ఉన్నంత మంది విమర్శకులు ఉన్నప్పటికీ, పెట్టుబడిదారీ విధానంలో సంపద పంపిణీపై చర్చకు ఇది జోడించబడింది స్మిత్ కనిపించకుండా ఉండేలా ప్రభుత్వ విధానాలు సాధారణ ప్రజల ద్వారా పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను సరైన దిశలో నడిపించాలనే నమ్మకాన్ని ఇది బలపరిచింది. చేయి సమాజానికి అనుకూలంగా పని చేస్తూనే ఉంటుంది.

2.వెయేండ్ల ప్రణాళిక కంటే ముందు దేశం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడం కీలకం. అసమానత, అంతరాలు, ఆకలితో అలమటించే వాడికి కడుపు కోతతో అల్లాడే వారికి కావలసింది ఆహారం ,చేతిలో ఖర్చుకు డబ్బులు. తీయటి మాటలు సానుభూతి వచనాలు పనిచేయవు కదా ? పేదలు ఒకవైపు కడుపు మాడి దయనీయ స్థితిలో బతుకుతూ ఉంటే మరొకవైపు ఆకాశాన్ని తాకే మేడలతోసంపన్నులు కులుకుతూ ఉంటే ఈ దేశం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చు కున్నదంటే ఎలా నమ్ముతాం? ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో 5వ ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్నదని త్వరలోనే 3వ స్థానానికి చేరుకుంటుందని కేంద్ర ప్రభుత్వం బిజెపి పెద్దలు ఇటీవల ఎన్నికల సందర్భంలో పదే పదే వక్కాణించి నారు. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వస్తామని 2047 చేరుకోవడం టార్గెట్గా పనిచేస్తామని తమ వద్ద 1000ఏళ్ల బృహత్ ప్రణాళిక ఉన్నదని చేసిన ప్రకటనలు అందరికీ తెలిసే ఉంటుంది . సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతం కాకూడదని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు హెచ్చరిస్తుంటే సామ్యవాద దేశంగా తీర్చి దిద్దుతామని రాజ్యాంగ పీఠికలో మనకు మనమే రాసుకుంటే దానికి భిన్నంగా సమానత్వము లేదు, సామ్యవాదము లేదు, అన్నింట అంతరాలు అసమానతలే. కాగా 40 శాతం సంపద కేవలం 1 శాతం ఉన్న సంపన్న వర్గాల చేతిలో ఉన్నది అనే చేదు వాస్తవం ఈ పాలకులను ఆలోచింప చేయలేక పోవడం విడ్డూరమే కాదు పేదల పట్ల వివక్షత, బాధ్యతా రాహిత్యం, యాచకులుగా చూడడం, సంపన్నులకు దోచు పెట్టడం వంటి భ్రమల్లో పాలకులు లీనమై పోవడమే కారణం అని విశ్లేషకులు రాజనీతిజ్ఞులు అభిప్రాయపడు తున్నారు. కళ్ళజోడు పెడితే కానీ కనిపించని దోమల కాటుతో దేశవ్యాప్తంగా కోట్లాదిమంది రోగగ్రస్తులై మృత్యువాత పడుతుంటే ఆ వైపుగా పాలకులు తీసుకున్న చర్యలేమిటి చూపిన పరిష్కార మార్గాలు ఏమిటి ? చట్టసభల్లో ప్రజల ధనంతో విమర్శించుకోవడం, వ్యక్తిగత దూషణలకు పాల్పడడం, చర్చ లేకుండానే బిల్లులను ఆమోదించడం, అవసరమైన చట్టాలను చేయడానికి ప్రజలు డిమాండ్ చేసినా నిరాకరించడం తప్ప ఈ దేశంలో పరిపాలనలో వచ్చినటువంటి మార్పులు చూపగలరా? రైతు ఉద్యమంలో కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కావాలని డిమాండ్ చేస్తూ నెలలు సంవత్సరాల తరబడి పోరాటం చేస్తే రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని హామీ ఇచ్చిన బిజెపి కేంద్ర ప్రభుత్వం రైతుల మీద బుల్లెట్ల వర్షం కురిపించినది నిజం కాదా?

పలు సందర్భాలలో కేంద్రం ప్రకటించినటువంటి హామీలు వాగ్దానాలను పరిశీలించినప్పుడు ప్రజల ఆకాంక్షలు ప్రయోజనాలు నిరాకరించబడి విస్మరించబడి ఆడంబరాలకు మాత్రమే పరిమితమైనటువంటి ప్రకటన పేదల కన్నీటిని తుడిచిందా?అసమానతలు అంతరాలను అంతం చేసినదా? సమానత్వాన్ని సాధించి పెట్టినవా? ఉన్న రాజ్యాంగాన్ని అమలు చేయడం ద్వారా ప్రజలకు రాజ్యాంగబద్ధమైన హక్కులను సాధించుకునే అవకాశం మెండుగా ఉన్నప్పటికీ మరింత మెరుగైన జీవన ప్రమాణాలు సాధించాలంటే రాజ్యాంగాన్ని మార్చాలని పదేపదే ప్రకటించడం, పోయిన ఎన్నికల సందర్భంలో 400 సీట్లు దాటితే కచ్చితంగా రాజ్యాంగాన్ని తిరిగి రాస్తామని చేసిన భాసలు పుండు ఒకచోట ఉంటే మందు ఒకచోట పెట్టినట్టుగా ఉన్నది. 56 శాతానికిపైగా ఉన్న బిసి వర్గాలుఈ దేశంలో ఎందరున్నారో ఇప్పటికీ ప్రభుత్వం దగ్గర గణాంకాలు లేవు 1931లో ఆంగ్లేయులు చేసినదే తప్పస్వతంత్ర భారతదేశంలో బీసీ వర్గాల జనాభా లెక్కలు కుల గణన చేయకపోవడం మెజారిటీ ప్రజానీకాన్ని నిర్లక్ష్యం చేయడమే కదా ! ఆ వర్గాలకు చెందిన ప్రజలు కోరిన చట్టబద్ధంగా కోర్టుకు వెళ్లిన పోరాట రూపాలను ఎంచుకున్న కేంద్రం దిగిరా లేదంటే ఇది మొండి వైఖరి కాదా ? ఇప్పటికీ ఆ వర్గాలకు చట్టసభల్లో కానీ ఉద్యోగ విద్య వివిధ రంగాలలో కానీ స్థానం లేకపోవడం , రిజర్వేషన్లు లేని కారణంగా చట్టసభల్లోకి కాలు పెట్టే అవకాశం రాకపోవడం, అన్ని పార్టీల నాయకత్వం ఆధిపత్య వర్గాల చేతిలో ఉన్న కారణంగా అధికారానికి నోచుకోకపోవడం కళ్ళ ముందు జరుగుతుంటే బీసీల పట్ల చూపుతున్న వివక్షత శత్రు పూరిత వైఖరి పెను ప్రమాదం కాదా! . శాస్త్ర సాంకేతిక రంగాలలో గణనీయమైన మార్పు సాధించినామని ప్రకటించినప్పటికీ రోగాల బారిన పడి ఎందరో చనిపోతున్న ఇప్పటికీ సరైనటువంటి ఆరోగ్య వైద్య సౌకర్యాలు లేకపోవడం అటు ఉంచితే మామూలు దోమకాటుకు బలవుతున్న వారు ఎందరో! ఆ చిన్న అంశం మీద ప్రభుత్వం దృష్టి సారించని కారణంగాఎంతో సౌకర్యాలు ఉన్న పట్టణాలు గ్రామాలలో ప్రత్యామ్నాయలతో దోమలను అరికట్టడానికి ప్రయత్నిస్తుంటే ఆటవిక ప్రాంతాల్లో ఉండే ఆదివాసి కుటుంబాలు సంచార జాతులు ఎంత దయనీయ పరిస్థితుల్లో బతుకుతున్నారు. అనేక కీటకాలు దోమలు పాములు లాంటి విష క్రిమికీటకాల బారిన పడి మృత్యు వాత పడుచుంటే కనీస రవాణా, వైద్య సౌకర్యం కూడా అందుబాటులో లేక డోలీలలో నలుగురు మో సుకుని పోయే పరిస్థితులు ఇప్పటికీ కొనసాగుతుంటే 1000ఏళ్ల ప్రణాళిక మూగబోయినదా? 2047 లక్ష్యంగా ప్రకటించిన ప్రణాళికలు ఏమైనవి? ఉద్యోగ,ఉపాధి అవకాశాలేవీ!రైతులు పేద వర్గాలు చిరు వ్యాపారులు తీసుకున్న రుణం చెల్లించలేని పరిస్థితిలో నిర్బంధంగా వసూలు చేయడమే కాదు నడి బజార్లో అవమానించి ఆత్మహత్యలకు పురికొలిపిన సందర్భాలు ఎన్నో. కానీ సంపన్నవర్గాలు బాకీ పడినటువంటి రుణాలను మాఫీ చేసి సుమారు 15 లక్షల కోట్ల ప్రజాధనాన్ని అప్పనంగా కట్టబెట్టిన కేంద్ర ప్రభుత్వం ఇదే ధోరణితో పేద వర్గాలను అణచివేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ తమ హక్కుల కోసం పోరాడే వారిని నిర్బంధించడాన్నీ గమనిస్తే ఈ దేశంలో దోమలకు ఉన్న స్వేచ్ఛ కూడా పౌర సమాజానికి లేదు అని తేలిపోతున్నది. "ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచే చర్యలకు పాలకులు రాజ్యాంగాన్ని ఉపయోగించకపోతే ఉన్న రాజకీయ వ్యవస్థను చిదిమి వేసి కొత్త వ్యవస్థను ప్రజలు ఆవిష్కరించుకుంటారు ఇది చారిత్రక సత్యం" అని ఆనాడే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ హెచ్చరించిన నేపథ్యంలో ఇప్పటికైనా ప్రజలను ప్రభువులు గా చూడాలి, పాలకులు సేవకులుగా మారాలి, ప్రజల హక్కులను కాలరాచే ధోరణి మానుకోవాలి, యాచకులుగా బానిసలుగా చూస్తే సహించే పరిస్థితి లేదని తెలుసుకుంటే మంచిది . అప్పుడే దోమల నిర్మూలనతోపాటు ప్రజాస్వామ్య పరిరక్షణ సా కారం అవుతుంది. పాలకుల నిర్లక్ష్యానికి దోమకాటు ఒక చిన్న ఉదాహరణ మాత్రమే . ఇలాంటి ఆకృత్యాలు పాలకుల సాక్షిగా జరుగుతుంటే భారతదేశంలో న్యాయ వ్యవస్థ ఆధిపత్యం కొనసాగాలి పాలకులు సేవకులుగా మారాలి ఆ వైపుగా ప్రజా ఉద్యమాలు నిరంతరం కొనసాగాలి.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**

## నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు

### జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి కాట



**హైదరాబాద్ సిటీ, ఆగస్టు 01(జనంసాక్షి):**
జిహెచ్ఎంసి పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న మాల్స్, మల్టీప్లెక్స్‌లపై చర్యలకు ఉపక్రమించినట్లు జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి కాట తెలిపారు. నగరంలోని పలు మాల్స్, మల్టీప్లెక్స్, సినిమా థియేటర్‌లలో నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుండి పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అట్టి విషయమై తనిఖీలు చేయుటకు ప్రత్యేకంగా టీమ్స్ వేసినట్లు తెలిపారు. సంబంధిత టీమ్‌ల తనిఖీలలో కొన్నిచోట్ల నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నట్లు వెల్లడైందన్నారు. సింగిల్ స్క్రీన్ థియేటర్ కింద రిజిస్టర్ చేసుకుని, మల్టిపుల్ స్క్రీన్ నడిపిస్తున్నట్లు బయటపడిం దన్నారు. అదేవిధంగా అక్కడ ఫుడ్ స్టాల్స్ ను తనిఖీ చేయగా కొన్ని చోట్ల ఫుడ్ స్టాల్ లలో అమ్ముతున్న తినుబండారాలు నాణ్యత లేనివిగా గుర్తించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తనిఖీలలో అక్రమాలకు గుర్తించిన ఆయా మాల్స్‌కు, మల్టీప్లెక్స్‌లకు కమిషనర్ ఆదేశాల మేరకు ఆయా క్షేత్రస్థాయి అధికారులకు నోటీస్ లు జారీ చేసారు.

# అక్రమ నిర్మాణాలపై పట్టింపేది

- కరెంటు స్తంభాన్ని ఆక్రమించి నిర్మాణం
- పాత భవనాలపై అదనపు అంతస్తులు
- ఎమ్మెల్యే చెప్పిన పట్టించుకోరా





**మల్కాజిగిరి,ఆగస్టు1(జనంసాక్షి)**
మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ఈస్ట్ ఆనంద్ బాగ్,గౌతమ్ నగర్,మౌలాలి,నే రెడ్ మెట్,వినాయక నగర్ డివిజన్ లలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న అధికారులు నోటీసులు జారీ చేసి వసూళ్లకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే, డివిజన్ కార్పొరేటర్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసి అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన లంచాలకు అలవాటు పడిన టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు ఆనంద్ బాగ్ డివిజన్ లోని సత్తిరెడ్డి నగర్‌లో ఎలాంటి సెట్ బ్యాక్ లు లేకుండా 10 ఫీట్ల రోడ్లు లో రెండు ఫ్లోర్ల పాత బిల్డింగ్‌పై మరో రెండు ఫ్లోర్లు అదనంగా నిర్మిస్తున్నారని, మౌలాలిలో ఓ వ్యక్తి 10 ఫీట్ల రోడ్డులో కరెంటు స్తంభాన్ని ఆక్రమించి నాలుగు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నాడు.దీంతో స్థానికంగా పార్కింగ్, ట్రాఫిక్,డ్రైనేజీ సమస్య తలెత్తుతుందని టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అక్రమ నిర్మాణ దారులతో అధికారులు లోపాయి కారి ఒప్పందాలు కుదుర్చుకొని ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి గండి కొడుతూ అక్రమ నిర్మాణదారులకు వత్తాసు పలుకుతూ త్వరితగతిన నిర్మా ణాలు పూర్తి చేసుకొని బిల్డిం గుకు సున్నం వేసుకోవాలని ఉచిత సలహాలిస్తూ అందిన కాడికి దండుకుంటు న్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పం దించి మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసు కోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

- పలు హొటల్లో నాసిరక ఆహార పదార్థాలు
- తూతూ మంత్రంగా ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు
- సంఘటన జరుగుతూనే స్పందిస్తారా..?

**ఖైరతాబాద్,ఆగస్టు 1 (జనం సాక్షి) :**
నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నాచి రకం ఆహారాన్ని సరఫరా చేస్తున్న వ్యాపారులపై ఫుడ్ సేఫ్టీ అధికా రులు చూసి చూడనట్టు వవరిస్తుండడంతో పలు హొటల్లో నాసిరకం ఆహారాన్ని పలువురు వినియో గదారులకు అందిస్తుండడంతో పలువురు అనారో గ్య బారిన పడుతున్నారు. నాణ్యత ప్రమాణాలను పాటించకపోవడంతో పలువురు హొటల్ల నిర్వాహ కులు నాసిరకం ఆహారాన్ని అందిస్తుండడంతో పలు సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. జిహెచ్ఎంసి అనుమతితో ఏటా నగరంలో కొలువు తీరుతున్నాయి. హైదరాబాదులో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతున్నడంతో హొటల్ వ్యాపారం కూడా జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో చట్టంలోను లుస్కులను ఆసరాగా చేసుకొని నాణ్య త ప్రమాణాలు పాటించకుండా ఆహారాన్ని విని యోగదారులకు అందిస్తున్నారు. ఆహార భద్రత చట్టంలోని అంశాలను హొటల్ నిర్వాహకులు పాటించాల్సి ఉండగా అవి ఏమీ తమకు పట్టనట్టు హొటల్ నిర్వాహకులు చేస్తున్నారు. జిహెచ్ఎంసి, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పర్వేషణలో నగరంలోని పలు సర్కిలలో ఫుడ్ ఇన్స్పెక్టర్లు ప్రతినిత్యం హొటలో నిర్వహించాల్సి ఉంది. అధికారులు పర్యవేక్షణ లోపంతో పలు హొటల్లలో కుళ్ళిన మాంసం, పాచిపోయిన కూరగాయలతో తినుబండారాలు తయారు చేస్తుండడంతో నగర ప్రజలు పలు రోగాల బడిన పడుతున్నారు. మొన్న బెంగుళూరులో కుక్క మాంసం సరఫరా పై పెద్ద రాగడాని జరుగుతుంది. నిన్న పటాన్చెరువు రాఘవేంద్ర హొటల్లో పురుగులతో కూడిన చట్నీని కస్టమర్కు సప్లై చేయడంతో వారి డొల్లతనం బయ టపడింది. ముఖ్యంగా జిహెచ్ఎంసి ఖైరతాబాద్ జోన్ లోని సర్కిల్ 17 , సర్కిల్ 18 లలో పలు ఓట్లను నిర్వహిస్తున్నారు. స్టార్ హొటల్‌తో పాటు, పప్పు, బార్, ఎంఎన్‌సి రెస్టారెంట్లు, మధ్యతరగతి రెస్టారెంట్లు వేలాదిగా ఉన్నాయి. ఫుడ్ సేఫ్టీ పర్య వేక్షణ లోపంతో పలు సంఘటనలు చోటు చేసు కుంటున్నాయి. ఆయా సర్కిల్లో ఫుడ్ ఇన్స్పెక్టర్లు నిద్ర వ్యవస్థలో ఉండటంతో వినియోగదారుల ఆరోగ్యానికి దెబ్బ కొడుతోంది. హొటల్ నిర్వాహకులతో ఫుడ్ ఇన్స్పెక్టర్లు లాలూచీ పడుతుండడంతో వాళ్ల వ్యాపారం నిరాకంటంగా కొనసాగుతుంది. హొటా ళ్లలో తనిఖీ చేయకపోవడంతో ఆహార భద్రత చట్టాన్ని అధికారులే తుంగలో తొక్కుతున్నారు. హొటళ్లలో తనిఖీలు నిర్వహించాల్సిన అధికారుల నిర్ల క్ష్యం కారణంగా ప్రజల ప్రాణాలు గాలిలో దీపంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సర్కిల్లో పనిచేస్తున్న ఫుడ్ ఇన్స్పెక్టర్లకు తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా ఆహార వ్యాపారాన్ని నిర్వహిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసు కునేలా ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## దోమల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**హైదరాబాద్ సిటీ, ఆగస్టు 01(జనంసాక్షి):**
దోమల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్ పిలుపునిచ్చారు. జిహెచ్ఎంసి ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో గురువారం బంజారాహిల్స్ లోని పాఠశాల, ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, ఎన్ బిటి నగర్, తదితర ప్రాంతాల్లో విద్యార్థులు, కాలనీ వాసులకు డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా నివారణ, దోమల నియంత్ర ణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బంజా రాహిల్స్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డెంగ్యూ అవగా హనలో భాగంగా ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా రవీందర్ నాయక్ మాట్లా డుతూ... ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకో వాలని, నీటి నిల్వలతో దోమలు ఉత్పత్తి జరుగుతుందని, వారానికోసారి ఇంట్లో డ్రమ్స్, బిందెలు, బకెట్లు తదితరా లలో నీటిని మార్చాలని, నీటి నిల్వ ఉన్న పాత్రలపై మూతలు పెట్టాలని తెలిపారు. అదేవిధంగా ప్రతి శు క్రవారం డ్రై డేగా పాటించి ఇంట్లో దోమలు నిల్వ ఉండే పనికిరాని వస్తువులను తీసివేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంపై అవగాహన కల్పించారు. ఎన్‌బిటి నగర్ లో డెంగ్యూ బాధితుల ఇళ్లను సందర్శిం చి జ్వర బాధితుల గురించి వాకబ్ చేసి సంబంధితులకు తీసుకోవాల్సిన చికిత్సలు, జాగ్రత్తలను వివరించారు. డెంగ్యూ టెస్టులు ఎక్కడ చేయించుకుంటున్నారు? ఎప్ప టి నుండి డెంగ్యూతో బాధపడుతున్నారు తదితరాలను విషయాలను అడిగి ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రుల లో ఉచిత చికిత్సలు, మందులు అందజేయడం జరుగు తుందని, డాక్టర్ల పర్యవేక్షణ ఉంటుందని, ప్రభుత్వ ఆసు పత్రులలో చికిత్స పొందాలని సూచించారు. పిమ్మట బంజారాహిల్స్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోజువారీ ఓ పి జ్వరం కేసులు, డెంగ్యూ కేసుల రికా ర్డులను పరిశీలించి వివరాలను సంబంధిత వైద్యాధి కారిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా దోమల నివారణకు, డెంగ్యూ తదితర వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యల గురించి చీఫ్ ఎంటమాలజీ డా రాంబాబు, డిఎంఅండ్ హెచ్ఓ డా వెంకట్‌లు పబ్లిక్ హెల్త్ డైరెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎంటమాలజిస్ట్ రజిని పాల్గొన్నారు.

## వెంటనే రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలి



### కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి

**ఎల్బీనగర్, ఆగస్టు 1 (జనం సాక్షి)**
హయత్ నగర్ డివిజన్‌లోని గాంధీ బొమ్మ వీధిలో భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ పునర్నిర్మాణ పనులు పూర్తయి దాదాపు నెల రోజులు గాడుస్తున్నప్పటికీ, సీసీ రోడ్ లా మరమ్మత్తులు చేపట్టకపోవడంతో వర్షాలు పడినప్పుడల్లా రోడ్లని బురదగా మరి బస్తీ వాసులకు ఈ వీధిలో ఉన్నటువంటి వ్యాపారులకు ఇబ్బందికరంగా మారుతుందని సమాచారం రావడంతో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, సమందిత మండలి అధికారులతో సమస్యను పరిశీలించి సీసీ రోడ్ మరమ్మత్తుల పనులను చేపట్టడం జరిగింది. అదేవిధంగా వారు భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ పనులు పూర్తయిన వెంటనే ఎలాంటి ఆలస్యం చేయకుండా సీసీ రోడ్ల మరమ్మత్తులు జరిపించాలని జలమండలి అధికారి డీజీఎమ్ మాధవికి తెలపడం జరిగింది. ఈ పరిశీలనలో బీజేపీ మల్కాజ్గిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్, జలమండలి సూపెర్వైసోర్ బాలు, బస్తీ వాసులు శ్రీనివాస్అ,లీ , ఆగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు నిల్..అక్రమ నిర్మాణాలు ఫుల్



- ఎంఎస్ఎన్ పరిశ్రమలో అడ్డగోలుగా నిర్మాణాలు
- లక్షల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న ఎంఎస్ఎన్ యాజమాన్యం

**నందిగామ ఆగస్టు 01, (జనంసాక్షి)**
నందిగామ మండల పరిధిలోని ఎంఎస్ ఎన్ ఫార్మా పరిశ్రమలో అక్రమనిర్మాణాలు అడ్డగోలుగా చేపడుతున్న సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే మండల కేంద్రంలో కొన్ని కార్పొరేట్ పరిశ్రమల అక్రమాలకు అడ్డుకట్ట లేకుండా పోయింది. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ఎద్దేచగా నిర్మాణాలు చేపడుతున్నారు నిఘా వ్యవస్థ నిద్రిస్తుందా అని అనుమానాలు కలుగుతున్నాయి..? అక్రమ నిర్మాణాలు చేపడుతున్న పరిశ్రమలు అనుమతులు పొందమని జవాబిస్తున్నారు. ఇట్టి నిర్మాణాలపై స్థానిక పంచాయతీ కార్యదర్శి వివరణ కోరగా పరిశ్రమలో నూతనంగా నిర్మిస్తున్న షెడ్డుకు యాజమాన్యం పంచాయతీ ద్వారా ఎలాంటి అనుమతులు పొందలేరని ఎంఎస్ఎన్ పరిశ్రమకు రొండో నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా అక్రమ కట్టడలను అడ్డుకోవాల్సిన సంబంధిత అధికారులు ఆమ్యామ్యలతో సరిపెట్టుకుంటున్నారని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను అడ్డుకోని చట్టరీత్య చర్యలు చేపట్టాలని పరిశ్రమ పన్నుల ద్వారా ప్రజలకు రావలసిన అభివృద్ధిని కాపాడాలని కోరుతున్నారు.



## రేవంత్ రెడ్డి మహిళలకు క్షమాపణ చెప్పాలి

**మల్కాజిగిరి,ఆగస్టు1(జనంసాక్షి)**
అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ మహిళ శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసి కించపరిచే విధంగా మాట్లాడి అవమానించినందుకు వెంటనే మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ మల్కాజిగిరి చౌరస్తాలో జేఏసీ వెంకన్న ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ ను దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మీనా ఉపేందర్ రెడ్డి, శాంతి శ్రీనివాస్ రెడ్డి,సబిత అనిల్ కిషోర్,సీనియర్ నాయకులు బద్ధం పరశురాం రెడ్డి, రావుల అంజయ్య, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, జవహర్ నగర్ కార్పొరేటర్ మురుగేష్,ఖలీల్,రాము యాదవ్, ఉపేందర్ రెడ్డి, అనిల్ కిషోర్,ఉపేందర్, నీలం సతీష్, బాబు పాటిల్, నర్సింగ్, కాటంరాజు,అమినుద్దీన్, సత్తయ్య, ఉస్మాన్, భాగ్యనంద్, చంద్రమౌళి, బిక్షపతి, గణేష్,బాలకృష్ణ, ఇబ్రహీం,రమేష్, శ్రీనివాస్ గౌడ్, దినేష్, నవాబ్, నర్సింగ్, జనార్ధన్, నవీన్, శ్రీనివాస్, శ్రీకాంత్, మల్లేష్ యాదవ్, అనిల్, కిట్టు, బాచి, లక్ష్మణ్, నవీన్ యాదవ్, వాసు, శ్రీధర్, సంతోష్, కృష్ణ, వెంకట్, ప్రసాద్, చోటు, వైశాలి, స్వప్న, నవనీత, రజిని, అనిత, లలిత, లక్ష్మి ,ఉమా,పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎగుమతి ఆర్డర్ పొందిన ఫిలాటెక్స్ లిమిటెడ్

**ఖైరతాబాద్, ఆగస్ట్ 01 (జనంసాక్షి)**
నగరానికి చెందిన ప్రముఖ సాక్స్, కాటన్ ఉత్పత్తుల తయారీ సంస్థ ఫిలాటెక్స్ ఫ్యాషన్స్ లిమిటెడ్ వారి సబ్సిడరీ సంస్థకు 2,97,388 మెట్రిక్ టన్నుల వైట్ మార్బుల్ సరఫరా చేసేందుకు రూ.293 కోట్ల విలువైన ఎగు మతి ఆర్డర్ లభించిందని ఆ సంస్థ ప్రతినిధులు గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ గత నెల 26న జరిగిన ఫిలాటెక్స్ ఫ్యాషన్స్ లిమిటెడ్ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విభాగంలో సునీల్ అగర్వాల్‌ను కంపెనీ అదనపు డైరెక్టర్, సీఈఓగా నియమించడానికి ఆమోదం తెలిపిందన్నారు.

## తల్లి పాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

### అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 01 (జనంసాక్షి)**
తల్లిపాలలో నవజాత శిశువులకు రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు అనేక రకాల ఆరోగ్య లక్షణాలు ఉంటాయి అన్ని అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. 2024 ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకొని గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ) రాధిక గుప్తా చేత తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేసే గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఒక తల్లి తన బిడ్డకు ఇవ్వగల మొట్టమొదటి కానుక తల్లిపాలు, మొదటి ఆరు నెలల వరకు పుట్టిన పిల్లలకు, కేవలం తల్లిపాలే సంపూర్ణ ఆహారం, సంపూర్ణ ఆరోగ్యం అందించడానికి తోడ్పడుతుంది అన్నారు. 'సి' సెక్షన్ ద్వారా పుట్టిన శిశువు మనుగడకు తల్లిపాలు పట్టించడం తప్పనిసరి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకొని, జిల్లాలోని గ్రామ, వార్డు స్థాయిలలో తల్లిపాల విశిష్టతను విస్తృత స్థాయిలో దాని వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి రఘునాథ స్వామి, సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి, సిడిపివోలు తదితరులు పాల్గొన్నారు.

## 5జీ డాటాను అంతకుమించి పురోగతులపై దృష్టిసాదించాలి

### మలేషియా సిటీ యూనివర్సిటీ యూసిఎస్ఐ డాక్టర్ రేణు కొలందై స్వామి




**మొయినబాద్ ఆగస్టు 01 (జనం సాక్షి)**
ఎలక్ట్రానిక్స్ కంప్యూటర్ కింగ్ కమ్యూనికేషన్లలో 5జి డెవలప్మెంట్ పై కేఎల్ యూనివర్సిటీ మొట్టమొదటి అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం జరుగుతుందని కేఎల్ యూనివర్సిటీ వాయిస్ ఛాన్సలర్ డాక్టర్ పార్థసారథి వర్మ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ కంప్యూటర్ కమ్యూనికేషన్‌లో ఆవిష్కరణ శ్రేష్టత దిశగా ముందుకు వెళుతుందని సూచించారు. ఇందులో భాగంగా ప్రపంచంలోని అత్యుత్తమ నిపుణులను ఒకే చోట చేర్చడం సాంకేతిక భవిష్యత్తును రూపొందించే శిరమైన అభివృద్ధికి దోహదపడే పరిశోధన సహకారాన్ని ప్రోత్సహించాలని కళాశాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఇందులో భాగంగా రెండు రోజుల పాటు యూఎస్ఏ యూరప్ దక్షిణాఫ్రికా మలేషియా చైనాతో సహా 5 దేశాలలో 93 సంవత్సరాలు నుండి 176 పత్రాలు ఈ సదస్సులో సమర్పించడం జరిగిందని అన్నారు. ఈ సదస్సు సమీక్ష ప్రక్రియను అనుసరించి 42 అధిక అర్హత కలిగిన పత్రాలు ఆమోదించబడ్డాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి మలేషియా యూనివర్సిటీ నుంచి ముఖ్య వ్యక్తులు డాక్టర్ రేణు కొలందై స్వామి మలేషియాలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఫ్యాకల్టీ డాక్టర్ ఎస్‌బి గోయల్ భారతదేశం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్లోని ఆర్ అండ్ డిడి సెంట్రల్ డైరెక్టర్ ప్రొఫెసర్ సామ్రాట్ సభ వంటి ప్రముఖులు నిపుణులు పాల్గొని సమర్పించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తు దిశలపై సమగ్ర పరిజ్ఞానాన్ని అందించేందుకు ఈ అంతర్జాతీయ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అజ.జ్ నగర్ క్యాంపస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ డాక్టర్ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



## రాచకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ సిబ్బందికి ఉచిత మెగా హెల్త్ క్యాంప్

**మల్కాజిగిరి,ఆగస్టు1(జనంసాక్షి)**
నేరెడ్ మెట్ లోని రాచకొండ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని అడ్మిన్ డిసిపి ఇందిర పేర్కొన్నారు.రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఆదేశాలతో డిసిపి అడ్మిన్ ఇందిర పర్యవేక్షణలో రాచకొండ కమిషనరేట్ కార్యాలయ సిబ్బందికి నేరెడ్ మెట్‌లోని కమిషనర్ కార్యాలయంలో యూనిట్ డిస్పెన్సరిలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంపులో మెడికవర్ హాస్పిటల్, మాక్సీవిజన్ కంటి హాస్పిటల్, సౌజన్య డెంటల్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించి మందులను ఉచితంగా అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ డాక్టర్ సరిత, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సిహెచ్ భద్రా రెడ్డి, మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ సాకేత్, డాక్టర్ శృతి పల్లవి, డాక్టర్ రాధిక, టెక్నీషియన్ హేమ,జనరల్ మేనేజర్ రవి కుమార్, భద్రత పిర్వో శివ్వ, మ్యాక్సీవిజన్ అప్తమాలజిస్ట్ శివాజీ, శ్రీలేఖ,అమీన్,మార్కెటింగ్ మేనేజర్ మహేందర్,సౌజన్య డెంటల్ హాస్పిటల్ డాక్టర్ లిఖిత, డాక్టర్ వైష్ణవి, మార్కెటింగ్ కిరణ్ సిబ్బంది పాల్గొన్నారు.

## యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలి



### అధికారులకు చైర్మన్ చంద్రారెడ్డి సూచన

**కీసర, ఆగస్టు 01 (జనంసాక్షి)**
యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ను అందుబాటులోకి తీసుకురావాలని చైర్మన్ చంద్రారెడ్డి అన్నారు. గురువారం నాగారం మున్సిపల్ కార్యాలయంలో బ్లూ క్రాస్ అధికారులతో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఎంవోయూ గురించి మున్సిపల్ కమిషనర్ రాజేంద్ర కుమార్‌తో కలిసి సమావేశం నిర్వహిం చారు. మున్సిపాలిటీ పరిధిలోని యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని చర్చించారు. చైర్మన్ మాట్లాడుతూ.. యానిమల్ బర్త్ కంట్రోల్‌ను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీఈఈ సుదర్శనం రఘు, మున్సిపల్ సానిటేషన్ ఇన్స్పెక్టర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గజానికో గుంత...!

### పెరుగుతున్న ప్రమాదాలు



షాద్ నగర్ ఆగస్టు 01(జనంసాక్షి)
గజానికో గుంత వాహనం ముందుకు కదిలితే కడుపులో పేగులుకదిలే దుస్థితి నరకం చూస్తూ ప్రయాణం కొనసాగుతుంది. ఆ రహదారిపై గుంతల మయంగా మారినా రహదారిపై ప్రయాణం చెయ్యాలంటేనే వాహనదారులు నిత్యం ప్రమాదాల భారినా పడుతున్నారు. రంగరెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజక వర్గ పరిధిలోని చౌదర్ గూడ మండలం నుండి జాకారం వైపు వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో రోడ్డుపై కంకరరాళ్ళు తెలి ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మెరుగైన రోడ్డు రవాణా సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్

- బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత
- 66 మంది బాల కార్మికులకు విముక్తి
- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్




**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 1(జనంసాక్షి)**
బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ పేరుతో ప్రతి సంవత్సరం రెండు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, ఈ కార్యక్రమాల ద్వారా బాల కార్మికులకు విముక్తి కల్పించి, స్కూల్ లకు పంపిస్తూ మంచి ఫలితాలు రాబట్టడం జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ జరుగుతుందన్నారు. ఆపరేషన్ ముస్కాన్ ను విజయవంతం చేసిన వివిధ శాఖలకు చెందిన అధికారులను, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన గల నెల రోజులుగా అనగా జూలై 1 నుండి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్-ఎక్స్‌లో భాగంగా వివిధ శాఖలు: పోలీసు శాఖ, చైల్డ్ లేబర్, సిడబ్ల్యూసి, డిసిపియు. విద్యాశాఖ మరియు చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్ మొదలైన శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి, ఆపరేషన్ ముస్కాన్-ఎక్స్‌ను విజయవంతం చేయడం జరిగిందని, ఆపరేషన్ ముస్కాన్-ఎక్స్‌టీం ను అభినందించారు. ఆపరేషన్ ముస్కాన్-ఎక్స్ లో భాగంగా ఈ సంవత్సరం మొత్తం 66 మంది బాల కార్మికులను రక్షించడం జరిగిందని, వీరిలో 63-మంది బాలురు, 03-మంది బాలికలు ఉన్నారు. బాలలను కార్మికులుగా పనిలో పెట్టుకున్న యజమానులపై 23 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పిల్లలను పనిలో పెట్టుకున్నా, వెట్టిచాకిరికి గురి చేసినా, బలవంతంగా బిక్షాటన చేయించినా, పశువుల కాపరులుగా, కిరాణం దుకాణాలు, మెకానిక్ షాపులు, హొటళ్లు, ఇటుక బట్టీలు, పౌల్ట్రీ ఫామ్ లు ఇతర ప్రదేశాలలోనూ పని చేయించడం, చట్టరీత్యా నేరం, ఎవరైనా పై చర్యలకు పాల్పడితే అట్టి వ్యక్తులపై చట్టరిత్య క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. బాల కార్మికులు ఎవరైన కనిపించినట్లయితే చైల్డ్ లైన్ నెంబర్ 1098 లేదా డైల్ 100 కు గాని సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

# సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం

### బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ





**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**
ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. గురువారం ఆమె "జనం సాక్షి" తో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుమతిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనదని అన్నారు . దేశ అత్యున్నత న్యాయ స్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, ఈ గొప్ప తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చొరవతోనే ఎస్సీల 30 ఏళ్ల కల నెరవేరిందని, వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేసిన పోరాటం ఫలించిందని ఆమె పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ప్రధాని మోదీ ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ కోసం ఎంతగానో కృషి చేశారని, బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తీసేస్తారంటూ తప్పుడు ప్రచారం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఇవాళ సుప్రీం కోర్టు ఇచ్చిన ఈ తీర్పు చెంపపెట్టులాంటిదన్నారు . ఎస్సీ వర్గీకరణకు సహకరించి ఆ వర్గాల చిరకాల కల నెరవేరేలా కృషి చేసిన ప్రధాని మోదీకి, కేంద్ర మంత్రులు అమిత్ షా, కిషన్ రెడ్డి లకు ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగతి పోరాటం చేసిన మందకృష్ణ మాదిగను గత ప్రభుత్వాలు మోసం చేశాయని బిజెపి మాత్రం ఇచ్చిన మాటను నిలబెట్టుకుందన్నారు. దేశంలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, అభ్యున్నతి బీజేపీతోనే సాధ్యమని, అందుకే అన్ని వర్గాల ప్రజలు గమనించి కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని మూడోసారి కూడా అధికారంలోకి తెచ్చారని అన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు చేసిందేమీ లేదనీ ఈ వర్గీకరణ ఘనత బిజెపికే దక్కుతుందన్నారు.

# జిల్లాలో 30, 30 (ఎ) పోలీసు యాక్ట్ అమలు

### జిల్లా ఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**



జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని ఈ నెల రోజుల పాటు ఆగస్టు 31 వరకు జిల్లా వ్యాప్తం గా 30,30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్.పి. యోగేష్ గౌతమ్ఒక ప్రకటనలో తెలిపారు.దీని ప్రకారం పోలీసు అధికారులకు ముందస్తు అనుమతి లేకుండా జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిదులు, వివిధ సంఘాలు ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపినారు. అలాగే ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా ప్రజా ధనానికి, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్.పి హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసు వారికి ఈ విషయంలో సహకరించాలని ఎస్పీ కోరారు. ఎలాంటి అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట

### మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**మక్తల్ ఆగస్టు 01 (జనంసాక్షి)**



మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని, అందుకే అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంను సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మహిళలను అగౌరవపరిచారని బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న ప్రయత్నాలను ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి లను మంత్రులుగా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని అన్నారు. టీఆర్ఎస్ హయాంలో తొలి టర్మ్‌లో మంత్రి వర్గంలో ఒక్క మహిళకూ స్థానం కల్పించలేదని, మహిళా కమిషన్ చైర్మన్ పదవిని సైతం చాలా రోజులు ఖాళీగా ఉంచిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది అన్నారు. అసెంబ్లీలో కీలక అంశాలపై చర్చ జరుగుతుంటే తమ తప్పిదాలు ఎక్కడ బయటపడుతాయోనని పక్కదారి పట్టించే చర్యలు చేపడుతున్నారని, ప్రజలు అంతా గమనిస్తున్నారని అన్నారు. మహిళా సంక్షేమం కోసం పాటుపడే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. మహిళలు కాంగ్రెస్ పార్టీకే అండగా నిలిచారని తేల్చి చెప్పారు.

# చెత్తను రోడ్డుపై వేస్తే జరిమానా కట్టాల్సిందే

- మున్సిపల్ కమిషనర్ తిరుపతి
- హెూటల్ యజమానికి వెయ్యి జరిమానా విధించిన కమిషనర్



**జోగిపేట, ఆగస్టు1(జనంసాక్షి):**
అందోల్ జోగిపేట మున్సిపల్ పట్టణంలో ఎక్కడైనా రోడ్లపై చెత్త వేస్తే జరిమానా కట్టాల్సిందని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ తిరుపతి అన్నారు. వ్యాపారస్తులు, గృహాలకు సంబంధించిన చెత్తను రోడ్లపై.. ఎక్కడ బడితే అక్కడ పారబోస్తే జరిమానా విధిస్తామన్నారు. గురువారం ఉదయం మున్సిపల్ పట్టణంలోని మటన్ మార్కెట్, అందోల్ పెట్రోల్ పంపు తదితర ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బందితో కలిసి కమిషనర్ ఆకస్మికంగా తనకి చేశారు. ఉదయం కాలనీలోకి వచ్చే చెత్త సేకరించే వహనాల్లోనే చెత్త వెయ్యాలని, రోడ్డుపై వేసి పరిసర ప్రాంతాలను ఆపరి శుభ్రంగా తయారుచేస్తే జరిమానాలు విధిస్తామని కమిషనర్ అన్నారు. ఇప్పటికైనా మార్పు రానట్టైతే తాము తీసుకోబోయే చర్యల్లో 3 నెలల జైలు శిక్షపడే అవకాశం ఉంటుందని, ప్రజలు, వ్యాపారస్తులు ఇది గమనించి మున్సిపల్ అధికారులకు సహకరించాలన్నారు. చెత్తను రోడ్డుపై వేస్తున్నందుకు అందోల్ పెట్రోల్ పంపు వద్ద గల హెూటల్ యజమానికి రూ. 1000 జరిమానా విధించారు. మటన్ మార్కెట్ ను అకస్మాత్తుగా తనిఖీ చేసి ఆరోగ్యంగా ఉన్న జీవాలను మాత్రమే విక్రయాలు జరపాలని, లేనట్లయితే చర్యలు తీసుకుంటామని అన్నారు. స్లాటర్ హౌస్‌ను రోజు శుభ్రం చేసుకోవాలని, కొత్తగా నిర్మించిన స్లాటర్ హౌస్ నీటిని మురికి కాల్వలోకి వెళ్లేందుకు వీలుగా డ్రైనేజీ పైప్ కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందని, పనులు పూర్తయ్యాక అప్పగిస్తామని కమిషనర్ తెలిపారు. మటన్ దుకాణ దారులకు దుకాణాలను కేటాయిస్తామని, పట్టణ పరిశుభ్రతకు అందరూ సహకరించాలని కోరారు. శానిటరీ ఇన్స్పెక్టర్ వినయ్ కుమార్, ఆర్ఐ నారాయణ, శివలు కమిషనర్ వెంట ఉన్నారు.



# చెరువులు, కుంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

**సిద్దిపేట ప్రతినిధి 01 ఆగస్టు (జనం సాక్షి)**
సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయా మండల రెవెన్యూ, నీటిపారుదల, భూ-సర్వే అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ఎచ్ఎండిఎ పరిధిలో జిల్లాలోని 3మండలాల్లో మొత్తం చెరువులు, కుంటలను సర్వే అధికారులు భూ-విస్తీర్ణం రికార్డులను పరిశిలించి మ్యాప్ లను సిద్ధం చెయ్యాలి. మండల రెవెన్యూ, భూ-సర్వే, నీటిపారుదల శాఖ అధికారులు ఆయా చెరువులు, కుంటల ప్రాంతాలను క్షేత్ర స్థాయిలో పరిశిలించాలి. ఆయా గ్రామా పంచాయతీలలో వాటి భూ సర్వే మ్యాప్, సర్వే నంబర్ లను గోడపై అతికించాలి. ఎచ్ఎండిఎ అధికారుల మార్గదర్శకాల ప్రకారం ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి వాటి భద్రత చర్యల గుర్చి చర్చించాలని అదికారులకు తెలిపారు. అందరు అదికారులు సమన్వయంతో ఈ భద్రత చర్యలను చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డిఓ బన్సీలాల్, ఎడి సర్వేలాండ్ వినయ్ కూమార్, కలెక్టరేట్ ఎఓ అబ్దుల్ రహమాన్, ఆయా మండల తహసీల్దార్లు, సర్వేయర్లు, నీటిపారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్‌లో మెడిసిన్ సీటు సాధించడం అభినందనీయం

### ప్రణతి సింధేను సన్మానించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**వనపర్తి ఆగస్టు 01 (జనంసాక్షి)**
సాధారణ కుటుంబానికి చెందిన విద్యార్థిని నీట్ పరీక్షల్లో 544 మార్కులతో ప్రతిభ కనబరిచి మెడిసిన్‌లో సీటు సాధించడం అభినందనీయమని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కొనియాడారు. గురువారం నీట్ ద్వారా మెడిసిన్‌లో సీటు సాధించిన వనపర్తి జిల్లా అప్పాయి పల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు డి. మాధవరావు, సుధాజ్యోతి దంపతుల కూతురు ప్రణయ్ సింధేను మాజీ మంత్రి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువును కష్టంగా భావించకుండా ఇష్ట పడి చదివితే లక్ష్యాన్ని సులభంగా సాధించవచ్చని అన్నారు. పిల్లల అభిరుచికి తగిన విద్యను కొనసాగించడానికి తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. మెడిసిన్ అభ్యసించడంలో రాణించాలని ,వైద్య వృత్తిలోకి ప్రవేశించి పేద ప్రజలకు సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు వి. నర్సింహారెడ్డి, ఎండి.మునీరొద్దీన్, మాజీ మున్సిపల్ చైర్మెన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ ,ప్రేమ్ నాథ్ రెడ్డి, సూగూరు రామస్వామి, రవికుమార్, తోట శ్రీను, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం చొరవతో నెరవేరనున్న గౌరవెల్లి ప్రాజెక్టు..!

### గౌరవెల్లి ప్రాజెక్ట్ పెండింగ్ పనుల కోసం 437 కోట్లు విడుదలకి క్యాబినెట్ ఆమోదం

**హుస్నాబాద్, ఆగస్ట్ 01(జనంసాక్షి)**
హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి గురువారం కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకుగాను ప్రాజెక్ట్ పెండింగ్ పనుల పూర్తి కోసం రూ.437 కోట్లు విడుదల చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహచర క్యాబినెట్ మంత్రులకు,మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం

### సిపిఐ (ఎంఎల్)మాస్ లైన్ పార్టీ రాష్ట్ర నాయకులు బి. రాము

**మహబూబ్ నగర్ ఆగస్టు 1 (జనం సాక్షి)**
ఎన్నికల ముందు తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ రాష్ట్ర నాయకులు బి. రాము అన్నారు. మహబూబ్నగర్ జిల్లా కోయిలకొండ మండల తాహసిల్దార్ కార్యాలయం ముందు గురువారం సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ పార్టీ డివిజన్ నాయకులు ఎదిరింటి నర్సిములు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు . కొత్త రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు, ఇందిరమ్మ ఇల్లను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . అసెంబ్లీ ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆయన విమర్శించారు. వృద్ధులకు 4 వేల, వికలాంగులకు 6 వేల చొప్పున పెంచి పెన్షన్లు ఇస్తామని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు, వ్యవసాయ కూలీలకు, సంవత్సరానికి 12 వేల జీవన భృతిని, రైతు భరోసా ఎకరానికి 15 వేలు, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వాటి అమలును మరిచిపోయారని ఆయన విమర్శించారు . 10 ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు రైతు భరోసా తక్షణమే అందించాలని అయిన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమ పార్టీ చేస్తున్న పోరాటాలకు ప్రజలు , రైతులు , నిరుద్యోగులు, విద్యార్థులు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ఈనెల 8 వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముట్టడి మరియు 21న చలో హైదరాబాద్ కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ధర్నా అనంతరం డిమాండ్స్‌తో కూడిన విజ్ఞాపన పత్రాన్ని కోయిలకొండ తాసిల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ నాయకులు ఇస్మాయిల్, ప్రభాకర్, ఐఎఫ్ టియు మండల అధ్యక్షులు శ్రీను నాయక్ వెంకటయ్య, అజ్జు పాషా, గోపాల్, చంద్రశేఖర్, నర్సిములు, వినయ్, మల్లేష్, మొగులప్ప, రాందాస్, లక్ష్మమ్మ, ప్రతాప్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం ఎందుకు..?

- ఆకస్మికంగా పాఠశాల తనిఖీ
- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి

**మునిపల్లి ఆగస్టు 1(జనంసాక్షి)**
విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి విద్యాశాఖ అధికారులకు వార్నింగ్ ఇచ్చారు. ఇటీవల మునిపల్లి మండలంలో రెసిడెన్షియల్ విద్యార్థులు రోడ్లపై ధర్నా చేశారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ క్రాంతి వల్లూరి గురువారం లింగంపల్లి రెసిడెన్షియల్ హాస్టల్ పాఠశాల కళాశాలను పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పిల్లలు రోడ్లపై న వచ్చి ధర్నా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదైనా సమస్యలు ఉంటే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకోరావాలని సూచించారు. చదువుతున్న విద్యార్థినులకు సంబంధించి పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక విద్యను అధ్యాపకులు బోధిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ పాఠాలు తమకు బోధిస్తున్నారని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. విద్యార్థులు పట్టుదలతో చదివి భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కళాశాల ఆవరణలో పరిశీలించగా పరిశుభ్రత లేదని పరిశుభ్రంగ ఉండేలా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో ,రాజు ,తహసీల్దార్, ప్రిన్సిపాల్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**



ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. గురువారం కౌకుంట్ల మండలంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పర్యటించి పలు ప్రభుత్వ కార్యాలయాలు ఆకస్మిక తనిఖీ చేశారు. కౌకుంట్ల మండల తహశీల్దార్ కార్యాలయం ను ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బంది ఎంత మంది ఉన్నారని, సిబ్బంది నిర్వహిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు . ధరణి స్లాట్ రిజిస్ట్రేషన్ ల గురించి ఆరా తీశారు. మండలంలో ప్రభుత్వ భూములు, శిఖం భూములు అన్యాక్రాంతం కాకుండా వాటిని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం మండలంలోని పేరూరులో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను ఆమె పరిశీలించారు. 80 డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి అయ్యాయని , ఇంకా అంతర్గత రహదారులు, డ్రెయినేజీ , మౌలిక సదుపాయాలు కల్పించివలసి ఉందన్నారు. ఈ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇంకా లబ్దిదారులకు కేటాయింపు జరగలేదని అధికారులు కలెక్టర్ కు వివరించారు. పేరూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తనిఖీ చేయాగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు చేతులు శుభ్రం చేసేందుకు నిర్మించిన పాత ట్యాంకు కూలి ఉన్న శిథిలాలు గమనించారు. ఈ శిథిలాలను వెంటనే తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు . పాఠశాల పరిసర ప్రాంతాల్లో గడ్డి , పిచ్చి మొక్కలు తొలగించి బ్లీచింగ్ వేసి పరిశుభ్రం చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. పిహెచ్‌సిలో సిబ్బంది హాజారు రిజిష్టర్ పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ ఎల్లయ్య , వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



# ప్రణాళిక బద్దంగా విద్య అందించాలి

### అదనపు కలెక్టర్ మిట్టల్

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**
విద్య బోధనలో ఉపాధ్యాయులు ప్రణాళిక బద్ధంగా ముందుకు పోవాలని నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ అన్నారు. గురువారం యాదగిరి రోడ్డులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో న్యాస్ -2024 ఓరియంటేషన్ కార్యక్రమానికి హాజరై పరిశీలించారు. 3,6,9 తరగతులకు జిల్లా రిసోర్స్ పర్సన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ప్రశ్నాపత్రాల తయారీ విద్యాబోధన తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా పరీక్షలకు విద్యార్థులను ప్రిపేర్ చేసెల ఉపాధ్యాయులు ముందుకు పోవాలన్నారు.




# క్యాన్సర్ జయిద్దాం..!




**శరీర మాధ్యమ్ కలుధర్మ సాధనమ్**
**దేహే సరోగేతు నచార్థ సిద్ధి:**
**అరుజ్ఞతాం దర్ధ్వ మపీహ లబ్ధమ్**
**సదౌషదం కాయ పటుత్వ సాధకమ్**
**మన పనులను సక్రమంగా చేసుకోవాలంటే మనకు కావలసింది ఆరోగ్యవంతమైన శరీరం. శరీరం రోగాల కుప్పగా మారినట్లయితే ఏ పనిని చేయలేము అనుకున్నది సాధించలేము. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యం**

క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరిని వణికిస్తున్న సంక్లిష్ట వ్యాధి .తన లక్షణాలను బయటకి కనిపించకుండా చాప కింద నీరులా సంవత్సరాలు గడుస్తున్న కొలది తన నైజాన్ని బయట పెట్టకుండా మనని కాటికి నడిపించేస్తుంది. మనం అ లక్ష్యంగా ఉన్నామా మనని కబళించేస్తుంది. మన జాగూరుకతే మన ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుతుంది. శరీరంలో వచ్చే చిన్న చిన్న మార్పులను రెండు వారాల కంటే అధికంగా కొనసాగినప్పుడు క్యాన్సర్ ఉంది అనటానికి అది ఒక బర్లర్ అలారం. దీర్ఘకాలిక అలసట, నిరంతర నొప్పి ,సడన్ గా బరువు తగ్గటం, చర్మం లో వచ్చే మార్పులు, పెరిగే కొత్తగా వచ్చే పుట్టుమచ్చలు, శ్వాసలో ఇబ్బందులు, దీర్ఘకాలిక రక్తస్రావం, మింగటంలో ఇబ్బంది ఇలాంటి చిన్న చిన్న సమస్యలు ఎక్కువ కాలం కొనసాగినట్లయితే మనం డాక్టర్ని సంప్రదించటం మనదైన కర్తవ్యం. 5% నుండి 12% వారసత్వంగా, ఉత్పరివర్తనాల వల్ల సంభవించి నియంత్రణ లేని క్యాన్సర్ కూడా ప్రస్తుతం విజృంభిస్తున్నాయి.

*అంతే కాదండోయ్...... మనం చేజేతులా క్యాన్సర్ ను ఆహ్వానిస్తున్నాం అదేదో మన చుట్టంలా..... ముఖ్యంగా మన జీవనశైలిలో వచ్చిన పెనుమార్పులు క్యాన్సర్ భూతం నీ పెనుభూతంలా మార్చి మనని ఒక్కరి బిక్కిరి చేస్తూ ప్రాణ సంకటానికి గురిచేస్తున్నాయి. దీన్ని అందరూ నాతో అంగీకరిస్తారు కదా......*


పెద్దవారు చెప్పినట్టు అభివృద్ధి అనే మాయలో పడి మనం కూర్చున్న కొమ్మని మనమే నరుక్కుంటూ మన ఆరోగ్యాన్ని జీవితాన్ని అగాధంలో తోసేసుకుంటున్నాం. ఇంతవరకు క్యాన్సర్ అంటే అరుదుగా వచ్చే జబ్బు కానీ ఇప్పుడు ఇది అతి సాధారణ జబ్బులా ప్రతి వారిని చుట్టుముడుతుంది .

మరో 10 సంవత్సరాల్లో ఇంటికో ఉద్యోగం ఉంటుందో లేదో కానీ ఇంటికో క్యాన్సర్ పేషెంట్ ఉంటారు అనడంలో ఎలాంటి సందేహం లేకపోలేదు.



వాతావరణంలో వచ్చే పెను మార్పులు, ధూమపానం, పొగాకు ,ఆల్కహాల్ , కాలుష్యం ,పురుగుమందులతో కూడిన ఆహారం, తీవ్రమైన ఎండ, అనారోగ్యకర జీవనశైలి ,అకాల నిద్ర, అకాల భోజనం, మితిమీరిన ఉపవాసాలు, రేడియేషన్, అధిక బరువు, శారీరక శ్రమ లేకపోవడం, దీర్ఘకాలిక అజీర్తి, వీడని తలనొప్పి కలుషిత నీటిలో ఆర్గానిక్స్, వైరస్ లు క్యాన్సర్ కు హేతువులు.

ప్రపంచవ్యాప్తంగా మరణాలకు క్యాన్సర్ ప్రధాన కారణం 2018లో ప్రపంచవ్యాప్తంగా 96 మిలియన్లు కేసులు ఉండగా 70% క్యాన్సర్ మరణాలు తక్కువ మరియు మిడిల్ క్లాస్ ఉన్న దేశాలలో ఉన్నాయి. 2020లో దాదాపు పది మిలియన్ల మరణాలు సంభవించవచ్చని వీటిలో రొమ్ము క్యాన్సర్ 2.26 మిలియన్స్, ఊపిరితిత్తులు 2.21 మిలియన్స్, పెద్దప్రేగు పురుషనాళం 1. 93 మిలియన్స్, ప్రొస్టేట్ 1.41 మిలియన్స్, చర్మం నాన్ మెలనిన్ 1.20 మిలియన్స్, పొట్ట 1.09



మిలియన్ల మంది క్యాన్సర్ బారిన పడ్డారు అని నిపుణుల సర్వే చెబుతోంది.

సర్వైకల్ క్యాన్సర్ 23 దేశాల్లో సర్వసాధారణంగా మారింది.

ఆన్సర్ అనేది శరీరంలో అసాధారణ కణాలు వేగంగా విభజించబడి వచ్చే వ్యాధుల సమూహం. ఇది ఇతర భాగాలకు శరవేగంగా వ్యాప్తి చెంది జీవన క్రియలకు కు ఇబ్బంది కలిగిస్తూ ప్రాణాంతక వ్యాధిగా పరిణమిస్తుంది.

క్యాన్సర్ పురాతన కాలం నుండి తెలిసినప్పటికిని శాస్త్రవేత్తల అవగాహన పురోగతి 20 శతాబ్దం మధ్యకాలం నుండి జరిగాయి ఇవే క్యాన్సర్ చికిత్సలకు దారితీసాయి. ఖచ్చితమైన రోగ నిర్ధారణ, శస్త్ర చికిత్సలు రేడియేషన్ ,కీమోథెరపీ మొదలైనవి.

ఇక ఈనాటి ప్రత్యేకత ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ రోజు గురించి కొంత తెలుసుకుందాం. ఆగస్టు 1 ప్రపంచ లంగ్ క్యాన్సర్ డే నీ జరుపుకోవాలని గల ముఖ్య ఉద్దేశ్యం

ఊపిరితిత్తుల రక్షణ మరియు పొరపాటున క్యాన్సర్ బారిన పడితే దానిని త్వరగా కనుక్కొని సరైన సమయంలో చికిత్స చేయించుకోవడం వంటి వాటిపై అవగాహన కల్పించడం.

మన ఊపిరి తిత్తులు శ్వాస వ్యవస్థలో ప్రధాన అవయవాలు మనం పీల్చుకునే గాలిలో ఆక్సిజన్ గ్రహించి ప్రతి ఒక్క క్షణానికి అందజేసి కార్బన్డయాక్సైడ్ ను బయటికి పంపించడంలో ప్రధాన పాత్రను వహిస్తాయి అంటే మనకు శక్తినిచ్చేటటువంటి ఒక గొప్ప ఆయుధం మన ఊపిరితిత్తులు. అలాంటి ఊపిరితిత్తులు నేడు అనేక స శ్వాసకోశ సమస్యలతో అతలాకుతలం అవుతూ ప్రధానంగా క్యాన్సర్ బారిన కూడా పడుతుంది. మనదేశంలో కనిపించే ఐదు క్యాన్సర్లలో ఊపిరితిత్తుల క్యాన్సర్ ఒకటి దాదాపు 6% ఊపిరితిత్తుల క్యాన్సర్ మనదేశంలో ఉన్నాయి ప్రతి ఏటా లక్ష మంది వరకు ఈ భయంకరమైన వ్యాధి పారిన పడుతున్నారనేదే నిపుణుల అంచనా.

ఊపిరితిత్తులు వాటి శక్తిని కోల్పోవడానికి ప్రధాన శత్రువు ఎవరంటే...... మనం, మన జీవనశైలి.. వీటిలో ప్రధాన కారణంస్మోకింగ్. "లిస్మోకింగ్ థ్రిల్స్ బట్ ఇట్ కిల్స్" సిగరెట్, బీడి, చుట్ట తాగే యాక్టివ్ స్మోకర్స్ కంటే ఆ గాలి పీల్చే ప్యాసివ్ స్మోకర్స్ కూడా 20 నుండి 30% వరకు లంగ్స్ క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది ఈ పొగలో 70% కార్సినోజన్స్ లంగ్స్ లోని వాయుగోనులలో మరియు వాయు గొట్టాలను కమ్మేసి వాటి సాగదీసే తత్వాన్ని కోల్పోయేలా చేసి ఆక్సిజన్ మన అవయవాలకు అందకుండా చేసి శ్వాస సమస్యలకు కారణభూతం అవుతుంది మన భారత దేశంలో అభివృద్ధి చెందుతున్న దేశం అభివృద్ధి అనే పదం ముందే కానీ ఇంకా కొన్ని గ్రామాలలో ఆ పదానికి నోచుకోలేదు ఎలా అంటారా...... ఇంకా కొన్ని ప్రదేశాలలో ఎల్పిజి బదులు కట్టెల పొయ్యి ,పిడకల పొయ్యి, ఇరుకు గదులలో వంట చేసి ఆడవారిలో ఇది సమస్యాత్మకంగా మారుతుంది . ప్రజలు, తక్కువ వెంటిలేషన్ ఉన్న అపార్ట్మెంట్లో ఉండేవారు, బయోమాస్ ఇంధనం వాడే వారిలో ఈ క్యాన్సర్ ప్రమాదం అధికం.

కమ్మని వాసనలతో చల్లని గాలి ఒంటికి తాకుతూ ఉంటే ఎంతో హాయి హాయి ...కానీ నేటి పట్టణ ప్రజలకు అది అందని ద్రాక్షోయి. ఇంటికో బైక్ కారు ప్రయాణానికి ఎంతో సులభం. కానీ వాటి తో స్వచ్ఛమైన గాలి దుర్లభం ...

పట్టణంలో కిలోమీటర్ వెళ్లడానికి గంట ప్రయాణం ఈ ప్రయాణంలో ఎన్నో జంక్షన్స్,వాటి వద్ద ఆగని హారన్ మోతలు, ఆపని బైక్ ల నుండి రిలీజ్ అయ్యే కార్బన్ మోనాక్సైడ్ వాయు కాలుష్యాన్ని ప్రమాదకరస్థాయిలో మించి క్యాన్సర్ కే కాదు శ్వాసకోశ సమస్యలుకు దారి తీస్తున్నాయి. అభివృద్ధి అనే పదంతో రోగాలకి తలుపు తీసిన ఇళ్లలా మన శరీరంలోకి ఈ బూచి వాయువులు చేరి మనని భయపెడుతూ మన ఊపిరితిత్తులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

ఇక మరొక కథ కొస్తే....

మట్టి పగుళ్ల నుంచి, రాళ్ల నుంచి నిశ్శబ్ద హంతకి లా మన ఇళ్లలోకి జొరపడే మరో రేడియో యాక్టివ్

రేపటి సంచికలో



Dr. NCH కృష్ణ జ్యోతి
ఖమ్మం



# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

బోనాలు ఉత్సవం తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖంగా జరుపుకునే హిందూ పండుగ. ఈ పండుగను ముఖ్యంగా హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాల్లో ఘనంగా జరుపుతారు. బోనాలు ఉత్సవం దేవత మహాకాళికి అంకితం చేయబడింది. ఇది హిందూ క్యాలెండర్ ప్రకారం ఆషాఢ మాసంలో జరుపుకుంటారు.

**బోనం సమర్పణ:** బోనాలు అంటే బాణాలుగా పిలువబడే పెళ్లపు కుండలను దేవతకు సమర్పించడం. ఈ కుండల్లో పులిహోర, పెరుగు అన్నం మరియు బెల్లం ఉన్నాయి.

**పూజలు మరియు వేడుకలు:** ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణతో అలంకరిస్తారు. వివిధ రంగుల కుంకుమలు, పూలతో అలంకరించిన బోనాలు మోసి గౌరిని పూజిస్తారు. పరేడ్ మరియు డాన్సులు: ఈ పండుగలో సంప్రదాయ పతాక పండుగలు, డోల్లు డప్పు డాన్సులు ముఖ్యంగా జరుగుతాయి. బోనాలు మోసిన మహిళలు ఈ పరేడ్‌లో పాల్గొంటారు.

**పోతరాజు:** బోనాలు పండుగలో పోతరాజు పాత్ర ముఖ్యమైనది. ఆయనను మహాకాళి దేవత యొక్క సైనికునిగా పరిగణిస్తారు.

**ఈ పండుగ ఆచారాలు:** పూజలు చేయడానికి మహిళలు సంప్రదాయ వస్త్రధారణతో పాటు, గాజులతో తమను అలంకరిస్తారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

దేవతకు బోనం సమర్పించడానికి ముందుగా ఇంట్లో అన్నం, పెరుగు మరియు పులిహోర వంటి వంటకాలు తయారు చేస్తారు.

బోనాలు ఉత్సవం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో ఒక ముఖ్యమైన భాగం. బోనాలు పండుగను సాధారణంగా హిందూ క్యాలెండర్ ప్రకారం ఆషాఢ మాసంలో, అంటే జూలై మరియు ఆగస్టు నెలల్లో జరుపుకుంటారు.

హైదరాబాద్‌లో బోనాలు పండుగ మూడు ప్రధాన వారాంతాల్లో జరుపుకుంటారు గోల్కొండ బోనాలు: ఆషాఢ మాసం మొదటి వారంలో గోల్కొండ కోటలో ఈ పండుగ మొదలవుతుంది.

**సికింద్రాబాద్ బోనాలు:** ఆషాఢ మాసం రెండవ లేదా మూడవ వారంలో, సికింద్రాబాద్ ప్రాంతంలోని మహంకాళి దేవాలయంలో జరుపుకుంటారు. లాల్‌దర్వాజా బోనాలు: ఆషాఢ మాసం చివరి వారంలో, లాల్‌దర్వాజా మహంకాళి దేవాలయంలో పెద్ద ఎత్తున జరుపుకుంటారు. ఈ మూడు ప్రధాన తేదీలతో పాటు, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో కూడా బోనాలు పండుగను విభిన్న తేదీలలో జరుపుకుంటారు.



చకిలం సునిష
సిద్దిపేట

# రాజన్న ఆలయంలో... బ్రేక్ దర్శనం

- శ్రావణమాసం నుండి అందుబాటులోకి
- విప్ ఆది ఆదేశాలతో ఏర్పాట్లు చేస్తున్న ఆలయ అధికారులు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 1 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని అతిపెద్ద శైవ క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామివారి ఆలయంలో ప్రతినిత్యం భక్తుల రద్దీ పెరుగుతుంది. ఈ క్రమంలో స్వామివారి దర్శనానికి వస్తున్న వీఐపీల కోసం బ్రేకు దర్శనం పెట్టాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గత కొద్ది రోజుల క్రితం ఆలయ అధికారులకు సూచించారు. ఈనెల ఐదు నుండి ప్రారంభం కానున్న శ్రావణమాసంలో విఐపిల కోసం బ్రేక్ దర్శనం ఏర్పాటు చేయడానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారి దర్శనం కోసం వచ్చే విఐపిలకు బ్రేక్ దర్శనంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఈ రాజేష్ తెలిపారు. ఈవో కార్యాలయం నుండి ప్రస్తుత శీఘ్రదర్శనము క్యూలైన్ను బ్రేక్ దర్శనానికి కేటాయిస్తామన్నారు. శీఘ్ర దర్శనం క్యూ లైన్ ఆలయ ముందు భాగంలోని రాజగోపురం నుండి ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. బ్రేక్ దర్శనంలో స్వామివారి దర్శించుకునే వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లపై చర్చిస్తున్నామని, ఆ సమస్యను కూడా రెండు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వ విప్ చెప్పిన విధంగా విఐపిలకు బ్రేక్ దర్శనం ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. విఐపి బ్రేక్ దర్శనాలు అమలు చేయడంతో సామాన్య భక్తులకు సైతం ఇబ్బందులు తొలగనున్నాయి.

# బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలకు సీఎం క్షమాపణ చెప్పాలి :రామకృష్ణారెడ్డి




**వలిగొండ ఆగస్టు 01 (జనం సాక్షి):** బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై సభానాయకులు రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని ఇచ్చిన పిలుపుమేరకు గురువారం వలిగొండ మండల కేంద్రంలోని చిట్యాల-భువనగిరి రహదారిపై బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అసెంబ్లీ సమావేశాలు ఎంతో హుందాగా నిర్వహించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచామని తెలిపారు సభా సాంప్రదాయాలను తుంగలో తొక్కుతూ ప్రతిపక్షాల గొంతును నొక్కుతూ కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరి మంచిదికాదని మండిపడ్డారు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రతిపక్షంగా తాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడమే తప్పా అని ప్రశ్నించారు అధికార అహంకారంతో రేవంత్ రెడ్డి మాట్లాడారని ఆ వ్యాఖ్యలను సమాజమంతా ఖండించాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఆడబిడ్డలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మొగుళ్ల శ్రీనివాస్ పడమటి మమతా నరేందర్ రెడ్డి దేగల పాండు యాదవ్ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ అఫ్రోజ్ కొండూరు వెంకన్న ఢిల్లీ మల్లారెడ్డి ఐటిపాముల సత్యనారాయణ ప్రభాకర్ పలుసం రాజు కొండూరు వెంకన్న నానచర్ల శ్రీను కొమురెల్లి బాలకృష్ణారెడ్డి గుడిసె నరసింహ కునపూరి శ్రీశైలం పబ్బు స్వామి ఈతప మల్లేశం బర్ల నాగార్జున నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తల్లి పాల వారోత్సవాలు

**ముర్రు పాలు తాగించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది : డాక్టర్ స్వర్ణలత**



**వలిగొండ ఆగస్టు 01 (జనం సాక్షి) :** ముర్రుపాలు త్రాగిన బిడ్డలు గుండె జబ్బులు క్యాన్సర్ బిపి తీవ్ర శ్వాసకోశ వ్యాధులు ఎలర్జీ వ్యాధులను ఎదుర్కొనే శక్తి ఎక్కువగా ఉంటుందని డాక్టర్ స్వర్ణలత తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలకు తల్లిపాల విశిష్టత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నపిల్లల బరువు ఎత్తును కొలతలు వేశారు. శిశువు పుట్టిన వెంటనే ముర్రపాలు పట్టించాలని, తద్వారా శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడని అవగాహన కల్పించారు. గర్భిణీ స్త్రీలు బాలింతలు తీసుకోవాల్సిన ఆహారంపై వారు పలు సూచనలు చేశారు. వారం రోజులపాటు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తామని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వలిగొండ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ స్వర్ణలత మాట్లాడుతూ మురుపాలలో విటమిన్ ఏసిడిఈకె ప్రోటీన్స్, మినరల్స్ కొవ్వులు, మరియు చక్కెర, పదార్థాలు బిడ్డకు కావలసిన సమతుల్యత పుష్కలంగా ఉంటాయన్నారు . బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఎదుగుదలకు దోహదం చేసే పౌష్టిక పదార్థాలు మురుపాలలో 90% కంటే వ్యాధి నిరోధక శక్తి ఉండడం వల్ల నీళ్ల విరోచనాలు మరియు ఇతర వ్యాధులు రాకుండా కాపాడ గలమని తెలిపారు. తల్లిపాలు శిశువుకు సులభంగా జీర్ణం అవుతుందని మలబద్ధకం కడుపునొప్పి లాంటి సమస్యలు రావని తెలిపారు. . ఈ కార్యక్రమంలో హెచ్ ఎస్ శౌరి, శ్రీలక్ష్మి ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

# మౌలిక వసతులకు పెద్దపీట

- కౌన్సిలర్ పంగ హరిబాబు
- రు.5లక్షల నిధులతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన



**కీసర, ఆగస్టు 01 (జనంసాక్షి) :** దశలవారీగా అన్ని కాలనీలలో మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నానని కౌన్సిలర్ పంగ హరిబాబు అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో మల్లికార్జున నగర్ లో మున్సిపల్ సాధారణ నిధులు రు.5లక్షల రూపాయలతో సిసి రోడ్డు పనులకు గురువారం వార్డు కౌన్సిలర్ పంగ హరిబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తూ అన్ని కాలనీలలో అభివృద్ధి కృషి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొండలరావు, అన్నమయ్య కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పూర్ణ ప్రకాష్, సభ్యులు రవి, మాధవి, వివిధ కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఆధునిక సాంకేతిక పద్ధతులలో
# ఉపాధి శిక్షణ అందించాలి




- నేటి పరిస్థితులకు తగినట్లుగా అవకాశాలు కల్పించాలి
- మైనారిటీ రెసిడెన్షియల్ ఆకస్మికంగా తనిఖీ
- అన్ని విభాగాల పరిస్థితులపై ఆరా : కలెక్టర్ హనుమంత్ కే. జండగే

**భువనగిరి ప్రతినిధి ,ఆగస్టు 1 (జనం సాక్షి) :** ఆధునిక పద్ధతులలో ఉపాధి సాంకేతిక శిక్షణ అందించాలి అని జిల్లా కలెక్టర్ హనుమంత్‌కి జండేగా సూచించారు. కాలానుగుణంగా నేటికీ పరిస్థితు లు తగ్గట్టు అవకాశాలు కల్పించాలన్నారు. ఆలేరు ప్రభుత్వ ఐటీఐ ఆకస్మికంగా సందర్శించారు. ఐటి ఐ శిక్షణ సంస్థలో కోపా, డ్రాఫ్ట్స్ మెన్ సివిల్, ఎలక్ట్రిషియన్, ఎలక్ట్రానిక్స్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, మోటార్ మెకానిక్, టర్నర్, వెల్డర్ ట్రేడ్ లలో శిక్షణా కార్యక్రమాలను పరిశీలించారు. వివిధ ట్రేడులలోని ట్రైనీలకు గల ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని ఉపాధి అవకాశాల గురించి ప్రిన్సిపాల్ హరికృష్ణ కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ బిల్డింగ్ పనులను కలెక్టర్ పరిశీలించారు. టీ.జీ.ఐ.ఐ.సీ. ఇంజనీర్ల తో మాట్లాడారు. అక్టోబర్‌లోగా నిర్మాణ పనులు పూర్తి చేసి అప్పగించాలని వారికి సూచించారు. అనంతరం ఆలేరు మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల, సిబ్బంది హాజరు రిజిస్టర్లను, సిక్ రిజిస్టర్, పేరెంట్స్ విజిటింగ్ రిజిస్టర్లను పరిశీలించారు. కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్ లో ఉన్న సరుకుల నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం వంటలను చేస్తున్నారా, నాణ్యమైన ఆహారం, వసతుల పట్ల ఆరా తీశారు. విద్యార్థినులతో ఆయన కలెక్టర్ ముచ్చటించారు. టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్ ఇవ్వడం జరిగిందా అని అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థినులతో రీడింగ్ చేయించారు. వర్షాకాలం కాబట్టి సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు డెంగ్యూ, చికెన్ గున్యా లాంటి విష జ్వరాలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. వెంట ప్రిన్సిపల్ జి.లలిత, వార్డెన్ సయ్యదా ముస్కినా, సిబ్బంది అంజూమ్ ఉన్నారు.



## తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):**
తల్లి పాల ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికి తెలియజేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.గురువారం కలెక్టర్ ఛాంబర్ లో పోషణ అభియాన్ లో భాగంగా తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ని ఆవిష్కరించి మాట్లాడారు.జిల్లా మహిళా శిశు దివ్యాంగుల వయో వృద్ధుల సంక్షేమం వారి ఆధ్వర్యంలో ఈ నెల ఒకటి నుండి ఏడవ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతరాలను తొలగించి తల్లిపాల ప్రాముఖ్యతను చాటుదాం, రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ప్రసూతి ఆసుపత్రులలో ప్రసవించే తల్లులకు సహకరించి తల్లిపాల ప్రాముఖ్యతను ప్రోత్సహిద్దాం..అనే నినాదముతో నిర్వహించబడుతుందని అన్నారు.దీనిలో భాగంగా మహిళ గర్భం దాల్చినప్పటి నుండి ప్రసవనంతరం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాహారం మొదలైన వాటిపై వార్డ్, గ్రామ, మండల స్థాయిలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి లత, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## 30 ఏళ్ల ఉద్యమానికి సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పుకు అభినందనలు..

భువనగిరి టౌన్, జనంసాక్షి:
ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ గ పిలుపు మేరకు, బూసి మహేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు. మాదిగల చిరకాల కోరిక ఎస్సీ వర్గీకరణ 30 సంవత్సరాల పోరాటానికి ఈరోజు భారతదేశ అత్యున్నత న్యాయస్థానము ఇచ్చిన తీర్పు ఎస్సీ, ఎస్టీలలో వర్గీకరణ సమర్థనీయం అని తీర్పునివ్వడం దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ విషయం ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ఆశువులు బాసిన మాదిగ మృత వీరులకు ఆత్మసంతృప్తిరి ఇచ్చే రోజు ఈ ఉద్యమానికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించిన అన్ని వర్గాల ప్రజలకు ప్రజాస్వామ్య వాదులకు హృదయపూర్వక ఉద్యమాభి వందనాలు , సుప్రీంకోర్టు తీర్పు న్యాయాన్ని నిలబెట్టింది. సామాజిక న్యాయం వైపు నిలబడింది. ఈ తీర్పు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు రాజ్యాంగ స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమం జిల్లా అధ్యక్షులు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు భూక్య సంతోష్ నాయక్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు జె గిరి, జిల్లా నాయకులు మోత్కుపల్లి రవి, మేకల కుమార్, జలగం క్రాంతి, బొల్లారం శ్రీనివాస్, బూసి కిషన్, మేకల శ్రీకాంత్, బొట్టు నరేష్, బుర్రకాయల మహేష్, మసాపాక విజయ్ కుమార్, జాలిగాం కుమార్, ఎర్రోళ్ళ గంగులు, తూటి శ్రీను, రామారం నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలకు డ్రై డే గురించి అవగాహన కల్పించాలి
- రాష్ట్ర మలేరియా అడిషనల్ డైరెక్టర్ అమర్ సింగ్

**హుజూర్ నగర్ ఆగస్ట్ 01 (జనంసాక్షి):**



సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మలేరియా అడిషనల్ డైరెక్టర్ అమర్ సింగ్ అన్నారు. గురువారం లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, లక్కవరం గ్రామాలను ఆయన సందర్శించి డెంగ్యూ నియంత్రణకు సిబ్బందికి తగు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ వో డాక్టర్ కోటాచలం, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ నీరంజన్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాజియా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పుష్పలత, ఏ ఎం ఓ మోతిలాల్ నాయక్, సబ్ యూనిట్ అధికారులు శ్రీనివాసరాజు, రామకృష్ణ, సూరి, సి హెచ్ ఓ పద్మ, పి హెచ్ ఎన్ నూర్జహాన్ బేగం, సూపర్ వైజర్ పద్మ, ఇందిరాల రామకృష్ణ, ఉదయగిరి శ్రీనివాస్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల పోరాట ఫలితానికి సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు

- సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేసిన దళిత సంఘాలు

**తుంగతుర్తి ఆగస్టు 1(జనం సాక్షి)**
ఎస్సీ వర్గీకరణ విషయంలో ఎవరెన్ని కుట్రలు చేసినా సుప్రీంకోర్టు వర్గీకరణ బిల్లు చట్టబద్ధమే అని భారత సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారికి విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మహాజన నేత మాన్య శ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్లగా ఉద్యమాల, పోరాట ఫలితంగా నేడు ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ... ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుందని నిరూపించిన మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ప్రాణ త్యాగాలు చేసి అమరులైన మాదిగ బిడ్డలకు ఈ విజయాన్ని అంకితం చేస్తున్నాం అని అన్నారు.మాదిగల్లో ఉండబడేటువంటి 59 ఉపకలాలకు ఈరోజు స్వాతంత్రం వచ్చిందన్నారు. సుప్రీంకోర్టు



ఏడుగురు జడ్జిలతో విధించిన ధర్మాసనంలో జస్టిస్ చంద్ర చూర్ నేతృత్వంలో ఈరోజు తీర్పు వెల్లడించడం చాలా సంతోషకరమైన విషయం అని 30 సంవత్సరాల సుదీర్ఘ ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో మాదిగ బిడ్డలందరిని ఒక తాటిపై నడిపించిన అభినవ అంబేద్కర్ మందకృష్ణ మాదిగకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేం అని అన్నారు.అదేవిధంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ మాదిగలకు మాట ఇచ్చి ఆ మాట నిలబెట్టుకోవడం మాకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.ఎస్సీ వర్గీకరణకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగ సంఘాల రాష్ట్ర నాయకులు మిట్ట గడుపుల పురుషోత్తం, బొంకూరి బిక్షం, మల్లెపాక రవీందర్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మల్లెపాక సాయిబాబా, ఆకారపు ముత్తిలింగం, తడకమళ్ళ రవీందర్, పోలేపాకు అంజయ్య, పోలేపాక సోమయ్య,ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు చెడుపాక గంగరాజు, జిల్లా కార్యదర్శి కొండగడుపుల శ్రీనివాస్, కత్తుల నరేష్, బొంకురి నాగయ్య,వెంకన్న, భాను, పుల్లూరి పరుశురాములు, చిటపాక కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

**కొండమల్లేపల్లి, ఆగస్టు 1 ( జనంసాక్షి ) :**
సుప్రీం కోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు ముప్పై ఏళ్లుగా సాగిన ఉద్యమం విజయం సాధించిందని అన్యాయానికి గురైన వర్గాల పక్షాన న్యాయవ్యవస్థ బలంగా నిలబడుతుందనడానికి ఈ తీర్పు నిదర్శనం అని ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పును వెలువరించిన న్యాయమూర్తులకు ధన్యవాదాలు తెలుపుతూ ఈ విజయం అమరులకు, ఉద్యమ మద్దతుదారులకు అంకితమిస్తున్నాం అన్నారు. రిజర్వేషన్ల చట్టం రెండో అడుగు వేయబోతుందని ఇప్పటివరకూ ఉమ్మడి రిజర్వేషన్లు నడిచాయని రిజర్వేషన్లు అందుకోలేకపోయిన వర్గాలు నేడు రిజర్వేషన్లు అందుకుంటాయని వర్గీకరణకు సంబంధించిన మార్గదర్శకాలు వెలువడేంత వరకూ ఎలాంటి నోటిఫికేషన్లు విడుదల చేయొద్దని వర్గీకరణ జీవోలు వచ్చిన తర్వాతే ఉద్యోగ నియామకాల వంటి నోటిఫికేషన్లు విడుదల చేయాలని అన్నారు గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ సంబరాలు చేస్తూ మంద కృష్ణ మాదిగ ఫోటోకి పాలాభిషేకం చేస్తూ సంబరాలు చేశారు ఈ



కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా జిల్లా నాయకులు మారుపాక గోపాల్, మండల ఇన్చార్జి ఎద్దుల ఎల్లయ్య, పట్టణ అధ్యక్షులు తిరుపతయ్య మాజీ సర్పంచులు గడ్డం శ్రీరాములు, పంది రుద్రమ్మ శ్రీను, సీనియర్ నాయకులు అందుగుల లింగయ్య, ఆదిరాల రమేష్, యాదయ్య, సాలయ్య, వస్కుల శ్రీనివాసులు, అందుగుల నాగయ్య, మారుపాక గిరి ఎమ్మార్పీఎస్ నాయకుల తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి



**కల్లూరు ఆగస్టు 01(జనంసాక్షి):**
పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యత అని సత్తుపల్లి డిపో మేనేజర్ యు రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం కల్లూరు నూతన బస్టాండులో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా డిపో మేనేజర్ యు రాజ్యలక్ష్మి, స్థానిక ఎస్సై ఎస్కే షాకీర్, ఆర్టీసీ సిబ్బంది పలువురు గ్రామస్తుల తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా సంతోషకరమైన రోజులలో ఒక మొక్క నాటాలని తద్వారా సమాజాభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ప్రకృతి ప్రకోపానికి గురి కాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు విధిగా ఒక్క మొక్కను నాటాలని సూచించారు. స్థానిక ఎస్ఐ షాకీర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని సత్తుపల్లి డిపో ఆధ్వర్యంలో కల్లూరులో పెద్ద ఎత్తున మొక్కలు నాటడం హర్షించదగిన విషయమని ఆయన అన్నారు.మొక్కలు ఎక్కువగా నాటకపోవడం వలన కాలుష్య కోరల్లో చిక్కుకొని మానవ మునుగడ కష్టతరమవుతుందని అందుకే ప్రతి పౌరుడు తమవంతు బాధ్యతగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని కోరారు.. కల్లూరు బస్టాండ్లో మొక్కలు నాటేందుకు గ్రామపంచాయతీ కార్యదర్శి నంది శెట్టి నాగేశ్వర రావు సహకారం మరువలేనిదని డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన అసిస్టెంట్ ఇంజనీర్ మెకానికల్ సాహితి, విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు, కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎస్కే మునీర్ పాషా, సిబ్బంది కంచి సాంసన్ , ఫీల్డ్ అసిస్టెంట్ మిద్దె. బాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటా : ఎమ్మెల్యే వేముల వీరేశం

**రామన్నపేట, ఆగస్ట్ 1 (జనంసాక్షి) :**
పేద ప్రజలకు అన్నివిధాల అండగా ఉంటానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన బోయపల్లి స్వామి కుమారుడు అనారోగ్యంతో హైద్రాబాద్ లోని ప్రసిద్ధి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శించారు. మెరుగైన చికిత్స కోసం 30వేలు ఆర్థిక సహాయం అందించారు. కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డి, మారేపల్లి మల్లారెడ్డి, పూస బాలకిషన్, పున్న జగన్, జినుకుల ప్రభాకర్, తిమ్మాపురం మహేందర్ రెడ్డి, గుత్తా నర్సిరెడ్డి, ఎర్ర శేఖర్ గౌడ్, కూనూరు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.





## సంపద వనాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

**మునగాల, ఆగస్టు 01(జనంసాక్షి):**
మునగాల మండల పరిధిలోని కృష్ణానగర్ గ్రామ శివారులోని సంపద వనాలను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశాడు. అంతేగాక బరాఖత్ గూడెం గ్రామంలోని గ్రామపంచాయతీ ఆవరణంలో నిర్వహించిన బ్లాక్ ప్లాంటేషన్ కూడా తనిఖీ చేయడం జరిగింది. అనంతరం కలెక్టర్ తన చేతులతో కొన్ని మొక్కలను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వి. ఆంజనేయులు, ఎంపీడీవో రమేష్ దీన్ దయాళ్, ఎంపీఓ భూపాల్ రెడ్డి, ఏపీవో శైలజ, టిఏ శ్రీధర్, శేఖర్, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, అనిత, ఎఫ్.ఏ సులోచన తదితరులు పాల్గొన్నారు.




## జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులుగా పాస్టర్ మీసాల గోవర్ధన్

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
జిల్లా కేంద్రంలోని సిలోయం వర్షిప్ సెంటర్ లో ఆ సంఘ జిల్లా మాజీ అధ్యక్షులు కాసర్ల శ్రావణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ కాసర్ల శ్రావణ్ కుమార్, చీఫ్ అడ్వైజర్ గా డాక్టర్ సెల్వి కొత్తపల్లి, చీఫ్ అడ్వైజర్ గా డాక్టర్ సామేలు గుండు, అడ్వైజర్స్ గా ధరావత్ లాజర్ నాయక్, బి.ప్రభుదాస్,జిల్లా అధ్యక్షులుగా పాస్టర్ మీసాల గోవర్ధన్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా రెవరెండ్ గడ్డం డేవిడ్ రాజు, వైస్ ప్రెసిడెంట్ గా రెవరెండ్ రేమడాల ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా రెవరెండ్ కాపర్తి సైమన్, ట్రెజరర్ గా రెవరెండ్ డాక్టర్ పూజర్ల సామెల్ కిరణ్, జాయింట్ సెక్రెటరీ గా రెవరెండ్ కోయిలపగు సైమన్, చీఫ్ కో ఆర్డినేటర్ గా రెవరెండ్ కే లోతు చంద్రశేఖర్, మీడియా కన్వీనర్ గా రెవరెండ్ జె సామెల్సన్, సభల కన్వీనర్ గా రెవరెండ్ మిర్యాల పాకిరాజు,ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా రాంబాబు, ఆనోక్ పీటర్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా అధ్యక్షుడు కాసర్ల శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ పాత కమిటీ కాలపరిమితి అయిపోయినందున నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు పాస్టర్ మీసాల గోవర్ధన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఎన్నికకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.గతంలో సూర్యాపేట పట్టణ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులుగా రెండు సంవత్సరాలు, సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షులుగా ఐదు సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉందని తెలిపారు. సంఘ అభివృద్ధి, ఐక్యత కోసం పని చేస్తానని అన్నారు.కార్యక్రమంలో బిషప్ ఏజె సామిల్, బిషప్ జె.సుదర్శనం, రెవరెండ్ తలకప్పుల సుధాకర్, రెవరెండ్ జిల్లా సామ్సన్, రవరెండ్ జలగం డేవిడ్ రాజు, కరుణాకర్, సాల్మన్ లింగ నాయక్, కోక ఏసురత్నం, జలగం పీటర్ బాబు, సొలోమోన్ రాజు పినపాడు, పేరాల రాజరత్నం, కోట సామ్సన్, మచ్చ ఏసుపాదం, బొడ్డు మత్తయి తదితరులు పాల్గొన్నారు.

## కార్యదర్శికి ఘనంగా సన్మానం

పెన్ పహాడ్ జూలై 01 (జనం సాక్షి):
మండల పరిధిలోని అన్నారం బ్రిడ్జి గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా పంచాయతీ కార్యదర్శిగా సేవలు అందించిన సతీష్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా గురువారం బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు మీసాల లింగయ్య అధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు, ఈ సందర్భంగా సతీష్ కు శాలువా కప్పి పూల గుచ్ఛాన్ని అందించి అనంతరం లింగయ్య మాట్లాడుతూ గ్రామంలో కార్యదర్శిగా ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి తమ సేవలను అందించారని ఉద్యోగికి బదిలీలు తప్పవని ఎక్కడ ఉన్న ఆయురారోగ్యాలతో ఉండాలని విధి నిర్వహణలో సక్రమంగా బాధ్యతలు నిర్వహించాలని కోరారు, ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ యాకుబ్, గ్రామపంచాయతీ సిబ్బంది సైదులు, సుధాకర్, పాల్గొన్నారు...

## విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే వినియోగదారులతో ముఖాముఖి

హుజూర్నగర్ ట్రాన్స్ కో డిఈ వెంకటకిష్టయ్య



**నేరేడుచర్ల( జనంసాక్షి):**
విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారం కోసమే వినియోగదారులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు హుజూర్నగర్ డిఇ ట్రాన్స్ కో వెంకట కిష్టయ్య అన్నారు. గురువారం ఆయన వివిధ అసోసియేషన్ నాయకులు విద్యుత్ వినియోగదారులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వినియోగదారులు విద్యుత్ సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు పట్టణంలో లో ఓల్టేజి సమస్యను పరిష్కరించాలని పలువురు వినియోగదారులు వెంకట కిష్టయ్య దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని ట్రాన్స్కో ఏఈ శ్రీనివాసును ఆదేశించారు.ట్రాన్స్ఫార్మర్ల ఫీజులు పోయిన సరఫరా సక్రమంగా కావడం లేదని లైన్మెన్ ల దృష్టికి తీసుకువెళ్తే సరిగా స్పందించడం లేదని పలువురు వినియోగదారులు డి ఈ వెంకటకిష్టయ్య దృష్టికి తీసుకువచ్చారు.సిబ్బంది కొరత ఉందని ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హుజూర్నగర్ ట్రాన్స్కో ఏ డి ఈ సక్రు నాయక్, నేరేడుచర్ల,పాలకీడు, గరిడేపల్లి, ట్రాన్స్కో ఏఈలు పందిరి శ్రీనివాస్,నరసింహ నాయక్ ,నగేష్, కిరాణ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు రాచకొండ రామ్మోహన్రావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలిశెట్టి వినయ్ కుమార్, ప్రైవేటు విద్యాసంస్థల అధ్యక్షుడు అలక సైదిరెడ్డి, ధాన్యం వ్యాపారుల అసోసియేషన్ నాయకులు మాశెట్టి మోహన్, సోమప్ప దేవాలయ చైర్మన్ చిత్తనూరు సత్యనారాయణ, పలువురు వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మక నిర్ణయం

- బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్

మునగాల, ఆగస్టు 01(జనంసాక్షి):
ఏబిసిడి ఎస్సీ వర్గీకరణ కోసం గత 30 సంవత్సరాలుగా అలుపెరగని పోరాటం చేస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగకు గురువారం పత్రిక విలేకరుల సమావేశంలో ఆయన అభినందనలు తెలిపారు. వివిధ వర్గాల నాయకులు కార్యకర్తలు పోరాట ఫలితంగానే కేంద్రం దిగివచ్చి సుప్రీంకోర్టుకి వర్గీకరణ న్యాయమేని చెప్పిందని, దాని ద్వారానే జస్టిస్ చంద్ర చూడోతో కూడిన ఏడుగురు ధర్మాసనం వర్గీకరణ అనుకూలంగా తీర్పు ఇచ్చారని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి మద్దతు తెలిపారని, ఈ పోరాట పంతాలో ఎంతోమంది ప్రాణ త్యాగం చేశారని, ఎంతోమంది కార్యకర్తలు ఉద్యమ నాయకులు పోరాటం చేశారని గుర్తు చేశారు. జనాభా



ప్రాతిపదికనే రిజర్వేషన్లు కల్పిస్తే బలహీన వర్గాల వారికి పేదలకి న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రాలు వెంటనే రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు.

# టాటా, ఆదానీ గ్రూప్స్ వ్యాపార విభజన నిర్ణయం



**ముంబయి, ఆగస్టు 1 (జనంసాక్షి) :** ప్రస్తుత మార్కెట్ పరిస్థితులతో పాటు కంపెనీ యాక్ట్ చట్టాలకు అనుగుణంగా టాటా గ్రూప్, అదానీ గ్రూప్ తమ వ్యాపారాలను విభజించాలని నిర్ణయించాయి. వాస్తవానికి దేశీయ స్టాక్ మార్కెట్లు బుల్ జోరులో కొనసాగుతున్న వేళ అనూహ్యంగా రెండు సంస్థలు ఏకకాలంలో ఒకటే నిర్ణయాన్ని వెల్లడించటం గమనార్హం.

ముందుగా టాటా మోటార్స్ నేడు తన మొదటి త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ఏకీకృత నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 74 శాతం పెరిగి రూ.5,566 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. ఇదే క్రమంలో ఆదాయం రూ.1,09,623 కోట్లకు పెరిగింది. సమీక్షా కాలంలో టాటా మోటార్స్ స్టాండ్ అలోన్ నికర లాభం రూ.2,190 కోట్లుగా ఉంది.

టాటా మోటార్స్ లిమిటెడ్ బోర్డు సభ్యులు ఆగస్టు 1న జరిగిన సమావేశంలో కంపెనీని రెండు లిస్టెడ్ కంపెనీలుగా విభజించే ప్రణాళికను ఆమోదించారు. అలాగే టాటా క్యాపిటల్‌తో టాటా మోటార్స్ ఫైనాన్స్ విలీనం కూడా జరుగుతోంది. ఇదే క్రమంలో ఈవీ పాలసీపై స్పందిస్తూ భారత ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఈవీ పాలసీ జాగ్వార్ లాండ్‌రోవర్ సంస్థలకు అనుకూలమైనది కాదని పేర్కొంది.

ఇదే సమయంలో అదానీ గ్రూప్ ఫ్లాగ్‌షిప్ కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ నేడు తన తొలి త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. జూన్ త్రైమాసికంలో కంపెనీ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 116% పెరిగి రూ.1,454 కోట్లకు చేరుకుంది. అలాగే కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 13 శాతం పెరిగి రూ.25,472 కోట్లకు చేరుకున్నట్లు నివేదించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.22,644 కోట్లు.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఎఫ్ఎంసీజీ వ్యాపారాన్ని డీ-మెర్జర్ చేసే ప్లాన్‌ను ఆమోదించింది. ఈ క్రమంలో అదానీ కమోడిటీస్ ఎల్ఎల్‌పీ ఆదానీ విల్మార్ వ్యాపారం నుంచి వేరు చేయబడుతుంది. అదానీ కమోడిటీస్ ఎడిబుల్ ఆయిల్, ఇతర సంబంధిత వస్తువులను వ్యాపారం చేస్తుంది. ఇటీవల భారీ లాభాలను ఆర్జించిన తర్వాత అదానీ విల్మార్ ఎడిబుల్ ఆయిల్ సంబంధిత వ్యాపారంపై దృష్టి పెడుతోంది. మార్కెట్లో వంటనూనెల వ్యాపారంలో కంపెనీ మరింతగా ముందుకు సాగేందుకు నిర్ణయించటంతో కొత్త కంపెనీ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి.




| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 442 | ₹ 53 |
| వరంగల్ | ₹ 442 | ₹53 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

హైదరాబాద్

₹ 70,360 (24 క్యారెట్లు) | ₹ 64,500 (22 క్యారెట్లు)

చెన్నై

₹64,300 (22 క్యారెట్లు) | ₹ 70,150 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్

₹91,700

# టాటా మోటార్స్‌కు భారీగా నికరలాభం




**హైదరాబాద్, ఆగస్టు 1 (జనంసాక్షి) :** టాటా గ్రూప్ కు చెందిన టాటా మోటార్స్ మొదటి త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. ఏకీకృత నికర లాభం 74 శాతం పెరిగి రూ. 5,566 కోట్లకు చేరింది. గతేడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ. 3,203 కోట్లుగానే ఉంది. ఈసారి మార్కెట్ అంచనా వేసినదానికంటే అధిక లాభాలు నమోదే చేసి ఆశ్చర్యపరిచింది. క్యూ1 లో రెవెన్యూ 5.7 శాతం పెరిగి రూ. 1,01,528 కోట్ల నుంచి రూ. 1,07,316 కోట్లకు పెరిగింది. కాగా ఏప్రిల్ -జూన్ త్రైమాసికంలో టాటా మోటార్స్ నికర లాభం రూ. 5,149 కోట్లు, రెవెన్యూ రూ. 1.09 లక్షల కోట్లుగా నమోదు కావచ్చని మనీ కంట్రోల్ నిర్వహించిన పోల్ లో 6 బ్రోకరేజీలు అంచనా వేశాయి. ఈ అంచనాలను మించి లాభాలు నమోదయ్యాయి. రెవెన్యూ మాత్రం అంచనాలకంటే కొంచెం తక్కువగా నమోదైంది. కాగా టాటా మోటార్స్ షేర్లు ప్రస్తుతం రికార్డు స్థాయి వద్ద ట్రేడ్ అవుతున్నాయి. గత వారం రోజుల్లోనే 11 శాతం వృద్ధి నమోదు చేశాయి. ప్రస్తుతం రూ. 1,144 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. అయితే క్యూ1 ఫలితాల నేపథ్యంలో షేరు ధర 1.4 శాతం క్షీణత నమోదు చేసింది. జూన్ త్రైమాసికంలో పన్నుకు ముందు లాభం (ఈబీఐటీడీఏ) 19 శాతం పెరిగి రూ. 15,785 కోట్లకు చేరింది. ఆపరేటింగ్ మార్జిన్ 12.9 శాతం నుంచి 14.6 శాతానికి పెరిగింది. టాటా మోటార్స్ లగ్జరీ కార్ల విభాగం జాగ్వార్ లాండ్ రోవర్ రెవెన్యూ 5.4 శాతం వృద్ధి నమోదు చేసి 7.3 బిలియన్ పౌండ్లకు చేరింది. ఈబీఐటీ మార్చిన్ 30 బేసిస్ పాయింట్లు పెరిగి 8.9 శాతానికి చేరింది. వాల్యూమ్ బలంగా ఉండటం, మిక్స్ అండ్ మెటీరియల్ కాట్స్ మెరుగుపడటం ఈ వృద్ధికి దోహదపడినట్లు కంపెనీ ప్రకటనలో తెలిపింది. ఇక డొమెస్టిక్ మార్కెట్లో కమర్షియల్ వెహికిల్ రెవెన్యూ 5.1 శాతం పెరిగి రూ. 17,800 కోట్లకు చేరింది. ఈబీఐటీ మార్జిన్లు 240 బేసిస్ పాయింట్లు పెరిగి 8.9 శాతానికి చేరాయి. మెటీరియల్ కాస్ట్ సేవింగ్స్ వల్లే మార్జిన్లు పెరిగినట్లు కంపెనీ తెలిపింది. ప్యాసింజర్స్ వెహికిల్స్ రెవెన్యూ మాత్రం 7.7 శాతం తగ్గింది. ప్రతికూల మార్కెట్ పరిస్థితులే ఇందుకు కారణమని కంపెనీ చెప్పింది. అయితే ఈబీఐటీడీఏ మాత్రం 50 బేసిస్ పాయింట్లు పెరిగి 5.8 శాతానికి చేరింది. మెటీరియల్ కాస్ట్ తగ్గడం వల్లే ఇది సాధ్యమైంది. కాగా టాటా మోటార్స్ ను రెండు వేర్వేరు కంపెనీలుగా విభజించే ప్రక్రియ 12 నుంచి 15 నెలల్లో పూర్తవుతుందని కంపెనీ తెలిపింది. అప్పుడు టాటా మోటార్స్ రెండు కంపెనీలుగా స్టాక్ మార్కెట్లో లిస్ట్ అవుతుంది. అలాగే టాటా మోటార్స్ ఫైనాన్స్ ను టాటా క్యాపిటల్ లో విలీనం చేసే ప్రక్రియ కూడా రాబోయే 9 నుంచి 12 నెలల్లో పూర్తవుతుందని కంపెనీ తెలిపింది.

# హైదరాబాదు బ్యాంకులో రూ.300 కోట్ల గోల్‌మాల్

**హైదరాబాద్, ఆగస్టు 1 (జనంసాక్షి) :** హైదరాబాదులో ఒక బ్యాంకుపై జరిగిన ఈడీ దాడులు పెద్ద ఆందోళనకు దారితీసింది. దీంతో బ్యాంకులో డబ్బులు జమచేసిన, దాచుకున్న ఖాతాదారులు ఇప్పుడు ఆందోళన చెందుతున్నారు. ఏపీ మహేశ్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ సంస్థలో పెద్ద కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ క్రమంలో ఏకకాలంలో 6 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించబడ్డాయి. 300 కోట్లకు పైగా నిధుల దుర్వినియోగానికి సంబంధించిన కేసు దర్యాప్తులో భాగంగా ఈ దాడులు జరిగాయి. ఈ క్రమంలో అధికారులు కోటి నగదు, 4 కోట్ల విలువైన ఆభరణాలు, విదేశీ కరెన్సీ, ఆస్తి పత్రాలు, బ్యాంక్ లాకర్ కీలు, నేరారోపణ పత్రాలు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఏపీ మహేష్ కోఆపరేటివ్ బ్యాంక్ షేర్‌హోల్డర్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్యామ్ సుందర్ బియానీ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లలో బ్యాంక్ బోర్డు సభ్యులు ఇటీవలి సార్వత్రిక ఎన్నికల సమయంలో మోసానికి పాల్పడ్డారని, డిపాజిటర్లు వాటాదారుల డబ్బును పెద్ద మొత్తంలో దుర్వినియోగం చేశారని ఆరోపించారు. నకిలీ పత్రాలు సృష్టించి ఏకంగా రూ.300 కోట్లకు పైగా అక్రమ రుణం మంజూరు చేయటంతో పాటు రూ.18.30 కోట్లు స్వాహా చేయడం వంటివి ఆరోపణల్లో కీలకంగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫిర్యాదులు, ఆదేశాలు ఉన్నప్పటికీ పోలీసులు మొదట్లో ఈ అధికారులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయలేదు. అయితే దర్యాప్తుపై ఉన్న స్టేను సుప్రీంకోర్టు ఎత్తివేయటంతో ఈడీ రంగంలోకి దిగేందుకు మార్గం సుగమం అయ్యింది. కోటి రూపాయలకు పైగా రుణాలు మంజూరు చేసినందుకు గాను బ్యాంక్ చైర్మన్ రమేష్ కుమార్ బంగ్, ఉమేష్ చంద్ అసవా, పురోషతమ్‌దాస్ మంధాన తదితరులపై హైదరాబాద్ కమిషనరేట్‌లోని బంజారాహిల్స్ పోలీసులు నమోదు చేసిన వివిధ ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. వక్ఫ్ బోర్డు భూములు, ఉనికిలో లేని ఆస్తులను తనఖాగా చూపించి వివిధ వ్యక్తులు, సంస్థకు రూ.300 కోట్ల రుణాలను అందించి వారి నుంచి 10% వరకు కమీషన్ వసూలు చేసినట్లు వెల్లడైంది. తప్పుడు బిల్లుల ద్వారా 6.5 కోట్లు, మోసపూరిత మార్గాల ద్వారా 1800 డమ్మీ వ్యక్తులు మరియు సంస్థలకు బంగారు రుణాలు పంపిణీలు జరగకం వంటివి వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలో రుణాల మంజూరు, రుణ ఖాతాల నిర్వహణ, వాటి మూసివేతలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు ఈడీ విచారణలో వెల్లడైంది. నిందితులు, వారి కుటుంబ సభ్యులు ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరల కంటే చాలా తక్కువ విలువలకు, కొన్ని సందర్భాల్లో గతంలో రుణాలు మంజూరు చేసే సమయంలో బ్యాంకుకు వచ్చిన వాల్యుయేషన్ కంటే తక్కువ ధరలకు ఆస్తులు సంపాదించినట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో కొన్ని అనుమానాస్పద లావాదేవీలు కూడా వెల్లడయ్యాయి.




# కమలా హ్యారిస్ భారతీయురాలేనా?

- దుమారం రేపుతున్న ట్రంప్ వ్యాఖ్యలు



**వాషింగ్టన్, ఆగస్టు 1 (జనంసాక్షి) :** గడువు సమీపిస్తోన్న కొద్దీ అమెరికా అధ్యక్ష ఎన్నికల వేడి పతాక స్థాయికి చేరుకుంటోంది. ఈ ఏడాది నవంబర్‌లో పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో.. ప్రచార తీవ్రత రోజురోజుకూ తీవ్రతరమౌతోంది. అభ్యర్థుల మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంటోంది. అధ్యక్ష ఎన్నికల బరి నుంచి జో బైడెన్ తప్పుకొన్న విషయం తెలిసిందే. తన అభ్యర్థిత్వాన్ని ఆయన ఉపసంహరించుకున్నారు. ఆయన స్థానంలో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా ఆ దేశ ప్రస్తుత ఉపాధ్యక్షురాలు, భారత సంతతికి చెందిన కమలా హ్యారిస్ పేరు ఖరారైంది. కమలా హ్యారిస్‌ను తమ అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించింది డెమొక్రటిక్ పార్టీ.

రిపబ్లికన్ల తరఫున మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మూడోసారి రేసులో నిలిచారు. ఇప్పుడు వీరిద్దరి మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. పరస్పరం విమర్శలు-ప్రతి విమర్శలకు దిగుతున్నారు. తాజాగా కమల హ్యారిస్‌పై ట్రంప్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. జాత్యహంకార వ్యాఖ్యలు చేశారనే అభిప్రాయాలు వ్యక్తమౌతోన్నాయి. చికాగోలో నేషనల్ అసోయేషన్ ఆఫ్ బ్లాక్ జర్నలిస్ట్ ఏర్పాటు చేసిన ఓ కన్వెన్షన్‌లో డొనాల్డ్ ట్రంప్ విలేకరులతో ముఖాముఖి మాట్లాడారు. సుమారు వెయ్యిమందికి పైగా ఇందులో పాల్గొన్నారు. వాళ్లు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలను ఇచ్చారు. ఈ క్రమంలో కమలా హ్యారిస్‌పై జాత్యహంకార వ్యాఖ్యలు చేశారనే విమర్శలు తలెత్తుతున్నాయి.

కమలా హ్యారిస్ భారతీయురాలా? లేక నల్లజాతీయురాలా? అనేది అర్థం కావట్లేదని డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇటీవలి కాలం వరకు ఆమె స్వదేశంలో భారతీయతను ప్రోత్సహించేలా వ్యవహరించారని, ఇప్పుడు నల్ల జాతీయురాలిగా గుర్తింపు పొందడానికి ప్రయత్నిస్తోన్నారని చెప్పారు. భారతీయులన్నా, నల్ల జాతీయులన్నా తనకు ఎంతో గౌరవం ఉందని ట్రంప్ అన్నారు. కమలా హ్యారిస్ జన్మతః భారతీయురాలే అయినా దేశంలో ఉన్న పరిస్థితులను సొమ్ము చేసుకునేలా ఇప్పటికిప్పుడు నల్ల జాతీయురాలిలాగా వ్యవహరించడం మొదలు పెట్టారని ట్రంప్ చెప్పారు. నల్లజాతీయుల ఓట్లను ఆకర్షించడానికే ఆమె ఆ ముద్రను పొందే ప్రయత్నం చేస్తోన్నారంటూ పరోక్షంగా ఆరోపించారు. కమలా హ్యారిస్ తల్లి పేరు శ్యామల గోపాలన్. ఆమె స్వస్థలం తమిళనాడులోని తులసేంద్రపురం. తండ్రి డొనాల్డ్ జే హ్యారిస్‌ది జమైకా. శ్యామలా గోపాలన్ 65 సంవత్సరాల కిందటే ఉన్నత విద్యను అభ్యసించడానికి అమెరికాకు తరలి వెళ్లారు. ఓక్లాండోలో స్థిరపడ్డారు. కాలిఫోర్నియాలో చదువుకున్నారు. డాక్టరేట్ పొందారు. జమైకాకు చెందిన ఎకనమిస్ట్ డొనాల్డ్ హ్యారిస్‌ను పెళ్లాడారు.

# ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నాం

- సుప్రీం తీర్పుతో సామాజిక న్యాయం గెలిచింది
- టిడిపి సామాజిక న్యాయానికి కట్టుబడి ఉంది
- రాయలసీమను రతనాల సీమగా మారుస్తా
- సాగునీటి సమస్యలు లేకుండా సంపద సృష్టిస్తా
- శ్రీశైలం పర్యటనలో ఎపి సిఎం చంద్రబాబు వెల్లడి
- స్వామి అమ్మవార్లను దర్శించుకున్న చంద్రబాబు
- కృష్ణమ్మకు జలహారతి పట్టిన సిఎం



**నంద్యాల, ఆగస్ట్ 1 (జనంసాక్షి) :** ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సుప్రీంకోర్టు సమర్థించింది. సామాజిక న్యాయం టీడీపీ సిద్దాంతం. 2024 ఎన్నికల్లో టికెట్ల విషయంలో సామాజిక న్యాయం పాటించాం. ఈ ప్రభుత్వం అందరిది. అందరికీ న్యాయం జరగాలి. జీరో పావర్టీ కింద ఉన్నపేదలను పైకి తీసుకు రావడమే నా లక్ష్యం. రూ.33 వేల కోట్లు ఖర్చు చేసి పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. దోచుకోవడం, దాచుకోవడం, విధ్వంసం చేయడం వైసీపీ నైజం. రెండు నెలల్లో ఏమి చేశారని వైసీపీ అంటోంది. నేనేమి చేశానో ప్రజలకు తెలుసు. సిద్దేశ్వరం దగ్గర కృష్ణానదిపై బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి నీటి సమస్య పరిష్కరిస్తా అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కర్నూలు జిల్లా సున్నిపెంటలో నిర్వహించిన 'మన నీరు-మన సంపద' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సుప్రీం తీర్పుపై స్పందించారు. సామాజిక న్యాయం, దామాషా ప్రకారం ప్రతి వర్గానికి న్యాయం చేయడం తెదేపా సిద్దాంతం. గతంలో వర్గీకరణకు సంబంధించి ఏబీసీడీలుగా కేటగిరీ తీసుకొచ్చాను. అందరికీ న్యాయం జరగాలి. ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు కూడా అలాగే చేశాం. ఈ ప్రభుత్వం అందరిది.. మీ అందరివాడిగా ఉంటా అని చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వం నీటిపారుదల ప్రాజెక్టులను పట్టించుకున్న పాపాన పోలేదని సీఎం విమర్శించారు. ప్రాజెక్టులకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. రాయలసీమను రతనాల సీమగా మార్చే బాధ్యత తనదని చెప్పారు. సంపద సృష్టితో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. శ్రీశైలాన్ని దివ్యక్షేత్రంగా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు నాయుడు తెలిపారు. గురువారం నాడు శ్రీశైలంలో ముఖ్యమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా సున్నిపెంటలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో సీఎం ప్రసంగించారు. ఏపీకి మంచి రోజులొచ్చాయని అన్నారు. రానున్న రోజుల్లో కూడా ప్రజలు మంచిగా ఉండాలని భ్రమరాంబ మల్లికార్జున స్వామిని కోరుకున్నానని చెప్పారు. జూలైలోనే శ్రీశైలం ప్రాజెక్టు నిండటం, జల హారతి ఇవ్వడం సంతోషమని తెలిపారు. రాయలసీమను సస్యశ్యామలం చేయడం ఎన్టీఆర్ కల అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. రాయలసీమకు నీళ్లు ఇచ్చిన తర్వాతనే తెలుగు గంగ నుంచి చెన్నైకి నీళ్లు తీసుకెళ్లాలని దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చెప్పారని గుర్తుచేశారు. రాయలసీమ ప్రాజెక్టుల కోసం రూ.12 వేల కోట్లు ఖర్చు చేశాను. కానీ మాజీ సీఎం జగన్ కేవలం రూ. 2వేల 11 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. జగన్ పాలనలో జనం భయంతో బతికారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జనం స్వేచ్ఛగా ఉన్నారు. ఎన్నికల్లో చాలా హామీలు ఇచ్చాను. కానీ ఖజానా ఖాళీ అయింది. మరో రెండు, మూడు రోజుల్లో నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులు నిండుతాయి. వరద నీరు సముద్రంలో కలవకుండా ప్రాజెక్టులకు తరలించేలా ప్రణాళికలు రూపొందించి రాయలసీమను రత్నాల సీమ చేస్తా.. ఇది సాధ్యం అవుతుందని అన్నారు. వైసీపీ పాలనలో రాయలసీమ రాళ్ల సీమగా మారింది. నీరు ఉంటే సంపద సృష్టిస్తాం. సంపద ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. దీని వల్ల పేదరికం పోతుంది. యువతలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లు ఏర్పాటు చేస్తాం అని సీఎం చంద్రబాబు తెలిపారు. శ్రీశైలం మండలం యువత అమెరికాలో ఉద్యోగం పొందేలా స్కిల్స్ నేర్పిస్తామని అన్నారు. అంతకు ముందు శ్రీశైలం జలాశయం వద్ద కృష్ణమ్మకు ముఖ్యమంత్రి చంద్రబాబు జలహారతి ఇచ్చారు. 'ప్రాణికోటి జీవనాధారమైన జలాలను ఇచ్చే నదులని దేవతలుగా భావించి పూజించే సంస్కృతి మనది. నిండుకుండలా ఉన్న శ్రీశైలం జలాశయం వద్ద కృష్ణమ్మకు జలహారతిని ఇవ్వడం ఎంతో సంతోషాన్ని, సంతృప్తిని ఇచ్చింది. సమృద్ధిగా కురుస్తున్న వర్షాలు రైతుల కళ్లలో ఆనందం నింపుతున్నాయి. ఇది రాష్ట్రానికి శుభసూచకం' అంటూ చంద్రబాబు స్పందించారు. ఈ సందర్భంగా నీటి వినియోగదారు సంఘాలతో చంద్రబాబు ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు గురువారం శ్రీశైలంలో పర్యటించారు. శ్రీశైల మహాక్షేత్ర పర్యటనలో భాగంగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున భ్రమరాంబ అమ్మవార్లను సీఎం చంద్రబాబు దర్శించుకున్నారు. శ్రీశైలాన్ని దివ్యక్షేత్రంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. అనంతరం సున్నిపెంటలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ప్రసంగించిన ఆయన.. ఏపీకి మంచి రోజులొచ్చాయని అన్నారు. రానున్న రోజుల్లో కూడా ప్రజలు మంచిగా ఉండాలని భ్రమరాంబ మల్లికార్జున స్వామిని కోరుకున్నానని తెలిపారు. జులైలోనే శ్రీశైలం ప్రాజెక్టు నిండటం, జల హారతి ఇవ్వడం సంతోషమని తెలిపారు. రాయలసీమను సస్యశ్యామలం చేయడం ఎన్టీఆర్ కల అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. సిఎం వెంల మంత్రి ఫరూక్ తదితరులు ఉన్నారు.

# ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం: ఐఎండీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 1 (జనంసాక్షి) :** ఈ సంవత్సరం రుతుపవనాల సీజన్ రెండవ భాగమైన ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో కూడా సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నెలల్లో దేశవ్యాప్తంగా వర్షాలు దీర్ఘకాలిక సగటులో 94-106% కనిపిస్తాయని తెలిపింది. ఈ నెలల్లో మంచి వర్షాలు కురవడం వల్ల రైతులకు మేలు జరుగుతుంది. అభివృద్ధి చెందుతున్న లానినా పరిస్థితుల కారణంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో సాధారణం నుంచి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని, ఇది దేశ వ్యవసాయం, మొత్తం ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టులో రుతుపవనాలు దీర్ఘకాలిక సగటులో 94-106% వరకు సాధారణ స్థాయిలో ఉంటాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర గురువారం విలేకరుల సమావేశంలో తెలిపారు. 1971-2020 సగటు ఆధారంగా ఆగస్టులో దీర్ఘకాలిక సగటు 254.9 మిల్లీమీటర్లు, ఆగస్టు-సెప్టెంబర్ కాలానికి ఇది 422.8 మి.మీ. గా ఉంది. రాబోయే రెండు నెలల్లో చాలా ప్రాంతాలు సాధారణం కంటే ఎక్కువ వర్షపాతాన్ని చవిచూస్తాయి. లడఖ్, ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర మరియు కచ్ తో సహా కొన్ని ప్రాంతాలు సాధారణం కంటే తక్కువ వర్షపాతాన్ని నమోదు చేసే అవకాశం ఉంది. ఆగస్టు మొదటి రెండు వారాల్లో పంజాబ్-హర్యానా-ఉత్తరప్రదేశ్-బీహార్-పశ్చిమ బెంగాల్ బెల్ట్ లో స్థిరమైన వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ తెలిపింది. జూలైలో తక్కువ వర్షపాతం నమోదైన గంగా మైదాన ప్రాంత రైతులకు ఈ స్థిర వర్షపాతం ఉపశమనం కలిగిస్తుంది. జూలైతో పోలిస్తే ఆగస్టు మొదటి వారం తర్వాత దేశవ్యాప్తంగా వర్షపాతం తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. ఏదేమైనా, పసిఫిక్ మహాసముద్రం యొక్క ఉపరితల ఉష్ణోగ్రతలను క్రమానుగతంగా చల్లబరచడం కలిగి ఉన్న లా నినా దృగ్విషయంతో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతంతో సెప్టెంబర్ ఏవైనా లోటుపాట్లను భర్తీ చేస్తుంది.

విదర్భ ప్రాంతంతో సహా మహారాష్ట్రలోని ఉత్తర ప్రాంతాల్లో ఆగస్టులో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. జూన్-సెప్టెంబర్ లో వచ్చే నైరుతి రుతుపవనాల వర్షపాతం భారతదేశం యొక్క 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలో ఎక్కువ భాగాన్ని నడిపిస్తుంది. నైరుతి రుతుపవనాల వల్ల దేశ వార్షిక వర్షాలలో దాదాపు 75% వర్షాలు కురుస్తాయి. ఇది వ్యవసాయాధారిత దేశమైన భారత్ కు అత్యంత కీలకమైన మాన్సూన్ సీజన్. భారతదేశ వ్యవసాయ యోగ్యమైన భూమిలో సగానికి పైగా వర్షాధారంగా ఉంది.



## మెప్మా ఆధ్వర్యంలో గోరింటాకు వేడుకలు

**రాయికల్ ఆగస్టు1(జనంసాక్షి):**
ఆషాడ మాసం సందర్భంగా రాయికల్ మెప్మా ఆధ్వర్యంలో గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మెప్మా సిబ్బంది అంతా ఒకచోట చేరి,అమ్మవారిని అందంగా అలంకరించి, అమ్మవారి పూజ చేసి, గోరింటాకును నూరి, ఒకరికొకరు చేతులకు మైదాకును పెట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆషాడ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం మన సంస్కృతి, సంప్రదాయమని, ప్రతి ఆడపడుచు గోరింటాకు పెట్టుకోవాలని, దీనివల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ వచ్చి అమ్మవారికి కొబ్బరి కాయ కొట్టి పూజించారు. ఈ కార్యక్రమంలో టిఎంసి శరణ్య,మెప్మా ఆర్పీలు, మున్సిపల్ మేనేజర్ వెంకటి, మున్సిపల్ సిబ్బంది ప్రత్యూష, అశ్విని, సుజాత, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో వృద్ధురాలు మృతి



**ముస్తాబాద్ (జనంసాక్షి):**
ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండలో పిట్ల రాజ్యలక్ష్మి 75 అనే వృద్ధురాలపై కుక్కల దాడి నిద్రిస్తున్న వృద్ధురాలుపై వీధి కుక్కలు చంపేయడం జరిగింది, ఇష్టం వచ్చిన రీతిలో దాడి చేసి మెడ బాగానే శరీరం నుండి వేరుచేసి భయంకరంగా సృష్టించాయి, ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలు మృతురాలికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు, కుక్కుల భారీ నుండి కాపాడాలని గ్రామస్తుల వినతి, మృతి రాలు పక్కింట్లో ఉన్న కుమారులు వ్యవసాయ పరులు ముగించుకొని ముత్తురాలికి రాత్రి9 గంటలకు భోజనం ఇచ్చి కొడుకులు ఎవరింట్లో వాళ్ళు పడుకున్నారు, ఉదయం చూసేసరికి సంఘటన జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు, సంఘటన స్థలానికి ఎస్సై గణేష్ చేరుకొని కుటుంబ సభ్యులను ఎలా జరిగిందని వివరాలు తెలుసుకొని అనంతరం మృతదేహాన్ని పంచనామాకు సిరిసిల్లకు ఏరియా ఆసుపత్రికి తరలించారు

## ఏనాటికైనా ధర్మమే గెలుస్తుంది

సడిమెల ఎల్లం మాదిగ



**ముస్తాబాద్ (జనంసాక్షి):**
దశాబ్దాల పోరాటానికి ఫలితం దక్కింది. ఎట్టకేలకు ఎస్సీ వర్గాల డిమాండ్ ఆచరణ రూపంలోకి వచ్చేందుకు ఇక అడుగులు పడనున్నాయి. అన్నారు మాదిగ దండోరా నాయకులు మాజీ సర్పంచి సడిమెల్ల ఎల్లం మండలంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి మిఠాయిలు పంచిపెట్టారు, ఎస్సీ, ఎస్టీల్లో ఉప వర్గీకరణ సాధ్యమేనా అన్న అంశంపై విచారణ జరిపిన ధర్మాసనం. కీలక తీర్పు వెలువ రించింది. వర్గీకరణ సమర్థ నీయం అని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా వర్గీకరణపై అధికారం కల్పిస్తూ ఆదేశాలిచ్చింది. ఎస్సీ వర్గీకరణపై మూడు దశాబ్దాలుగా పోరాటం కొనసాగింది అన్నారు మాజీ సర్పంచి నల్ల నరసయ్య, బట్టు శీను జంగం త్రినేత్రం, శ్రీను బడుగు రాజ్యం శీలం లచ్చయ్య రాజు, దండోరా నాయకులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే మదన్ మోహన్ జన్మదిన వేడుకలు

**గాంధారి (జనంసాక్షి):**
ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పుట్టిన రోజు వేడుకను భామన్ నాయక్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేట్ సంగం లో ఘనంగా నిర్వహించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు.కేక్ కట్ చేసి విద్యార్థులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయుర్ ఆరోగ్యముతో నిండు నూరేళ్ళు అన్ని విజయాలతో ముందుకు సాగాలని విద్యార్థులు కోరారు.యూత్ నాయకులు ఆయన పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు,కార్యక్రమంలో యూత్ నాయకులు బామన్ సురేష్, జరప్ల భాస్కర్, జరప్లా దశరథ్ కాంగ్రెస్ కార్యకర్తలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# వర్గీకరణపై సుప్రీం తీర్పు చారిత్రకం

**ఇది ఏళ్ల పోరాటం .. మాదిగలదే విజయం:మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**



**కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి):**
షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల రిజర్వేషన్ల ఉప వర్గీకరణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉందని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనదని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఎస్సి వర్గీకరణపై సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించిన నేపథ్యంలో గురువారం శాసనసభలో ఆయన మాట్లాడారు. దాదాపు చాలా ఏళ్లుగా మాదిగలు సాగిస్తున్న వర్గీకరణ పోరాటానికి ఇప్పుడు న్యాయం జరిగిందని, ఇది మాదిగల విజయమని అభివర్ణించారు. ఉద్యోగ నియామకాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం రిజర్వేషన్ కోటాను రాష్ట్రాలు విభజించుకునే అవకాశం ఈ తీర్పు వల్ల కలిగిందని పేర్కొన్నారు. వర్గీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన మంచి అడ్వకేట్ ను పెట్టి సుప్రీం కోర్టులో వాదనలు వినిపించడం కోసం ఢిల్లీకి పంపించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా అడ్వకేట్ జనరల్ ను పిలిపించుకొని వర్గీకరణపై బలమైన వాదనలు వినిపించే విషయమై మూడు గంటల పాటు చర్చించి ఆయనతోపాటు మాదిగ ఎమ్మెల్యేలను పంపించారన్నారు. మాదిగలకు అనుకూలంగా తీర్పు వెలువడడానికి రేవంత్ రెడ్డి చేసిన కృషి తోడైందని ఆయన పేర్కొన్నారు. మాదిగల పక్షపాతిగా మరోసారి నిరూపించుకున్న రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు ధన్యవాదాలు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వర్గీకరణను పక్కన పెట్టిందని, తప్పని పరిస్థితిలో అన్ని పక్షాలతో కమిటీ వేసి ఢిల్లీకి పంపిస్తామని కేసీఆర్ చెప్పి మోసం చేశారని డాక్టర్ కవ్వంపల్లి ఆరోపించారు. మాదిగ, మాల ఉప కులాలకు వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ తరపున శాసనసభలో ఎమ్మెల్యే సంపత్ కుమార్ వాయిదా తీర్మానం ఇస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వం సంపత్ కుమార్ ను సస్పెండ్ చేసిందని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ వస్తే మాదిగల బతుకులు బాగుపడతాయనీ ఆశించామని, తెలంగాణ ఉద్యమంలో డప్పు కొట్టిందీ, దరువు వేసిందీ మాదిగలేనని ఆయన గుర్తు చేశారు. కేసీఆర్ కేబినెట్లో ఒక్క మాదిగ మంత్రి అయినా ఉన్నారా..? అని ఆయన ప్రశ్నించారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి, కేసీఆర్ కు మాదిగలంటేనే పడదని, అందుకే ఉప ముఖ్యమంత్రిగా డా.రాజయ్యను అవమానకర రీతిలో భర్తరఫ్ చేశారని కవ్వంపల్లి విమర్శించారు. అప్పుడు సిఎల్పీగా ఉన్న భట్టి విక్రమార్క ను ప్రతిపక్ష నేతగా ఉండకుండా చేసారని ఆయన దుయ్యబట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులను నిర్లక్ష్యానికి గురి చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు అండగా ఉంటోందన్నారు. దళితులైన మల్లు భట్టి విక్రమార్క ను ఉప ముఖ్యమంత్రిగా, ప్రసాద్ కుమార్ ను స్పీకర్ గా, దామోదర రాజనర్సింహ గారిని మంత్రిగా, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను విప్ గా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లకు దక్కిందన్నారు. ఇందిరమ్మ పాలన నుంచి మాదిగలు కాంగ్రెస్ కి అండగా ఉంటారన్నారు. వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలోనై ప్రతిపక్ష నేత కేసీఆర్ సభకు రాకపోవడం దొర అహంకారానికి నిదర్శనమని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. శాసనసభలో మాదిగల ఎమ్మెల్యేలు మాట్లాడితే వినాల్సి వస్తుందన్న దొరతనపు అహంకారం, నిర్లక్ష్యంతో వారు వాకౌట్ చేశారని విమర్శించారు. మాదిగ వర్గీకరణపై మాట్లాడకుండా అడ్డుకుంటున్న బీఆర్ఎస్ నాయకుల ఇళ్ల ముందు చావు డప్పు కొట్టాలని ఆయన మాదిగలకు పిలుపునిచ్చారు. ఎట్టకేలకు తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నం ఫలించిందని, వర్గీకరణపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ వర్గీకరణ సాధనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ ధన్యవాదాలు తెలిపారు.

# మనుమడని నమ్మితే...ఆస్తి అమ్ముకొని తరిమేశాడు

**వృద్ధప్యంలో రోడ్డున పడ్డ వృద్ధుడు • ఆసరా కల్పించాలని కలెక్టరేట్ వద్ద ఫ్లెక్సీతో వేడుకోలు**




**సిరిసిల్ల ఆగస్టు 1(జనంసాక్షి)**
మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారిపోయి అయినవాళ్లు రాక్షసులుగా మారిపోతున్న పరిస్థితులు. మానవత్వం మచ్చుకైనా కనురాకపోతున్న దుస్థితి. అయిన వాళ్ళని నమ్మితే ఆస్తి అమ్ముకొని తన్ని పరమేశ్వర అంటూ వృద్ధుడు కన్నీటి పర్యంతరం అవుతున్నాడు. తన ఆస్తి తనకు ఇప్పించాలని కోరుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట ఫ్లెక్సీ ఏర్పాటు చేసి వేడుకుంటున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగలపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బత్తుల ఎల్లయ్య కు తన వారంటూ ఎవరూ లేరు. ఏడాదికితం తనతో జీవితం పంచుకుంటానని వచ్చిన భార్య తన పేరుపై ఉంచిన రెండు ఎకరాల భూమిని అమ్ముకుని మాయమైంది. ఈ పరిస్థితుల్లో ఒంటరిగా ఉంటున్న ఎల్లయ్యను తన సమీప బంధువు వరుసకు మేనల్లుడు అయిన గోపాలరావుపల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్ చేరదీశాడు. అన్ని తనై సాదుకుంటారని నమ్మ పలికాడు. కూలిపోయిన ఇంటి స్థానంలో కొత్త ఇల్లు నిర్మించి ఇస్తానని నమ్మబలికాడు.ఆస్తి నీ పేరు పై ఉంటే మాజీ భార్య మళ్ళీ వచ్చి ఆస్తి మొత్తం కాజేస్తుందని మాయమాటలు చెప్పాడు. నిజమేనని నమ్మిన ఎల్లయ్య ఆస్తిని ప్రశాంత్ పేరు పైకి మార్పు చేశాడు. మొదట్లో ఎకరం భూమి అమ్మకానికి పెట్టడంతో ఇదేమని అడిగితే తన ఆరోగ్యం కోసం ఖర్చు పెట్టాలని చెప్పడంతో ఎల్లయ్య సర్దుకున్నాడు. ఈ క్రమంలోనే మనస్పర్థలు రావడంతో ఎల్లయ్య శేఖర్ కు దూరంగా ఒంటరిగానే ఉంటున్నాడు. ఇటీవల ఉన్న రెండు ఎకరాలు అమ్మకానికి పెట్టడంతో జరుగుతున్న మోసాన్ని గ్రహించిన ఎల్లయ్య ఇదేమని అడిగితే ఏం చేసుకుంటావో చేసుకోమంటూ దురుసుగా వ్యవహరించారని రోధిస్తూ తెలిపారు. తన సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్తే న్యాయం చేస్తారని న్యాయం చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకొని అధికారులను వేడుకుంటున్నాడు. అన్నీ కోల్పోయి రోడ్డున పడ్డ తనకు ఆసరా చూపించాలని కన్నీటి పర్యంతరం అవుతున్నాడు.



# ఉద్యమాన్ని ముద్దాడిన గద్దర్ పాట

**విమలక్క. అరుణోదయ సాంస్కృతిక సమైక్య చైర్మన్. సిరిసిల్లలో గద్దర్ స్మారక సభ**

**సిరిసిల్ల (జనంసాక్షి):**
ఉద్యమాలను ముద్దాడిన గద్దర్ పాట పోరాటాలు ఉన్నంతవరకు సజీవమని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్మన్ గాయని విమలక్క అన్నారు. గురువారం గద్దర్ ప్రథమ వర్ధంతిని సిరిసిల్లలో నిర్వహించారు. స్మారక సభకు హాజరైన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్మన్ విమలక్క, ప్రొఫెసర్ కాసిం, సిపిఐ జాతీయ కార్య వర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, గద్దర్ కూతురు వెన్నెల మాట్లాడుతూ గద్దర్ పాట ఉద్యమాలను ముద్దాడిందని ప్రజా పోరాటాలు ఉన్నంతకాలం గద్దర్ పాట సజీవంగా ఉంటుందని తెలిపారు. గద్దర్ స్మృతులను గుర్తు చేసుకున్నారు. గద్దర్ అభిమానులు పాల్గొన్నారు.

# సబ్‌రిజిస్టర్ కార్యాలయంలో నిలిచిన సేవలు

- రూ. 2.53 లక్షల విద్యుత్
- బకాయిలు
- సరఫరా నిలిపివేసిన అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొన్న క్రయ, విక్రయదారులు




**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):**
వేములవాడ సబ్ రిజిస్టర్ కార్యాలయం విద్యుత్ బకాయిలు పెరిగి పోవడంతో సెస్ అధికారులు విద్యుత్తు సరఫరా నిలిపివేయగా రిజిస్ట్రేషన్ కు వచ్చిన క్రయ విక్రయదారులు గురువారం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత సంవత్సరం కాలం నుండి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో విద్యుత్ బిల్లులు చెల్లించక పోవడంతో బకాయిలు పేరుకుపోయాయి. ప్రతి నెల విద్యుత్ బిల్లులకు సంబంధించి సబ్ రిజిస్టర్ కార్యాలయం నుంచి ప్రతిపాదనలు పంపుతున్నప్పటికీ నిధులు విడుదల కావడం లేదు. రూ. 2.53 లక్షల బకాయిలు పేరుకుపోయాయి.దీంతో విద్యుత్ అధికారులు కరెంట్ కట్ చేయడంతో కార్యాలయం బోసిపోయింది. ప్రతిరోజు కార్యాలయంలో సుమారుగా 25 నుండి 30 రిజిస్ట్రేషన్లు జరుగుతున్న క్రమంలో ప్రభుత్వానికి సుమారుగా చాలాన్ రూపేనా 15 నుండి 20 లక్షల వరకు ఆదాయం వస్తున్నట్లు సమాచారం.గత సంవత్సర కాలం నుండి పలుమార్లు విద్యుత్ అధికారులు నోటీసులు జారీ చేసిన జిల్లా రిజిస్టర్ నుండి విద్యుత్ డబ్బులు రాకపోవడంతో బకాయి పేరుకు పోయినట్లు సమాచారం. గురువారము కార్యాలయానికి విద్యుత్ కట్ చేయడంతో అక్కడ రిజిస్టర్ చేసుకునే వారు లేకపోవడంతో కార్యాలయం బోసిపోయి సిబ్బంది మాత్రమే ఆఫీసులో ఉన్నారు. ఇప్పటికైనా జిల్లా రిజిస్టర్ విద్యుత్ బకాయిలు చెల్లించి సక్రమంగా ప్రజల రిజిస్ట్రేషన్లు అయ్యే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆటోడ్రైవర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ఆటో డ్రైవర్ల దినోత్సవం వేడుకల్లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి**



**కరీంనగర్ బ్యూరో ఆగస్టు01 (జనంసాక్షి)**
ఆటో డ్రైవర్ ల దినోత్సవం సందర్భంగా మంచిర్యాల చౌరస్తా వద్ద గల లోకల్ ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్ లు ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... ఆటో డ్రైవర్ ల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని సంవత్సరానికి పన్నెండు వేల రూపాయలు ఇచ్చే విధంగా హామీ ఇవ్వడమైనదని త్వరలో హామీ నెరవేర్చుతుందని అన్నారు. ప్రయాణికులను క్షేమంగా గమ్య స్థానాలకు చేర్చుతూ పొరపాటున ఆటోలలో మరచి పోయిన విలువైన వస్తువులను తిరిగి వారికి అందించడం ఆటో డ్రైవర్ లకు ఉన్న గొప్పగుణం అని నరేందర్ రెడ్డి అన్నారు. మద్దెల మల్లేశం అనే ఆటో డ్రైవర్ తన ఆటోలో మరచిపోయిన ఇరవై వేల రూపాయలు ఉన్న పర్సును ప్రయాణికుడికి అందించినందుకు సుడా చైర్మన్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్ ల సంఘం జిల్లా అధ్యక్షుడు చలిమెల రామచంద్రం, కాడే రఘుపతి, డి.జితేందర్, ఎండి చాంద్, దండి రవీందర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, మిరాజ్, కీర్తి కుమార్, మామిడి సత్యనారాయణ రెడ్డి, ఇమ్రాన్, మహాలక్ష్మి, కిరణ్ రెడ్డి, మాచర్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు తమ విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలి

**పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి,గోదావరిఖని(జనంసాక్షి):**
ప్రభుత్వ ఆసుపత్రులలో పని చేసే వైద్యులు తమ విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని, డ్యూటీ టైం లో పూర్తి స్థాయిలో ఆసుపత్రిలోనే ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి పట్టణంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం, గోదావరిఖని ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్ ను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన గర్భిణీ స్త్రీలకు అందుతున్న వైద్య సేవలు, 102 సర్వీస్ సేవలు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పౌష్టికాహారం, తీసుకోవాల్సిన మందుల పై ఫాలో అప్ చేస్తున్నారా వంటి పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ఔట్ పేషెంట్లు వైద్యులను కలిసి, అవసరమైన పరీక్షలు చేయించుకుని మందులు తీసుకుని త్వరగా వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్ సింగ్, పెద్దపల్లి సివిల్ సర్జన్ డాక్టర్ శ్రీధర్ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ రవీందర్ ,నర్సింగ్ సూపర్డెంట్, క్వాలిటీ మేనేజర్ అనిల్ సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.



## మంత్రి శ్రీధర్ బాబుని కలిసిన లద్నాపూర్ కాంగ్రెస్ నాయకులు

**మంథని, (జనంసాక్షి) :**
హైదరాబాదులోని మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు నివాసంలో లద్నాపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు గురువారం కలిశారు. గ్రామంలోని సమస్యలు, ఆర్ అండ్ ఆర్ సంబంధించిన పలు విషయాలపై మంత్రి శ్రీధర్ బాబు తో వారు చర్చించారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడి భూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూస్తానని మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు వనం రామచంద్ర రావు, మాజీ సర్పంచ్ బీవీ స్వామి గౌడ్ మంథని అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు బర్ల శ్రీనివాస్, సీనియర్ నాయకులు తోగారి లింగయ్య, రాంచందర్ ,సత్యనారాయణ,శ్రీనివాస్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డికి క్షమాపణలు చెప్పాలి

**సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం.**
ఆర్మూర్(జనంసాక్షి): అసెంబ్లీలో ఎమ్మెల్యే సబితాపై సీఎం అనుచిత వాక్యాలకు నిరసనగా పెర్కిట్ చౌరస్తాలో సీఎం దిష్టి బొమ్మ దహనం చేశారు.అసెంబ్లీ సాక్షిగా మహిళ పట్ల అనుచిత వాక్యాలు చేసినందుకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.ఇట్టి కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఈ గంగాధర్,మాజీ పిఏసిఎస్ చైర్మన్ నచ్చు చిన్నరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ఆర్మూర్ మండల యువజన అధ్యక్షులు అగ్గు క్రాంతి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అల్లూరి గంగారెడ్డి. నడుకుడ నాగరాజు,అగ్గు లింబాద్రి,అర్షద్,విజయ్, రాజు, అశోక్, తదితరులు పాల్గొన్నారు

## సుప్రీంకోర్టు తీర్పు హర్షించదగ్గ విషయం

**మాదిగ విద్యార్థి ఉద్యమ నాయకుడు సంపత్**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి(జనంసాక్షి)**
ఎన్నో ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం జరుగుతున్న ఉద్యమానికి దేశ అత్యున్నత న్యాయస్థానం సానుకూల తీర్పు ఇవ్వడం ఎంతో హర్షిందగ్గ విషయమని మాదిగ విద్యార్థి ఉద్యమ నాయకుడు గడ్డం సంపత్ అన్నారు. సామాజిక అణచివేతకు గురవుతున్న ఎస్సీల్లో ఉన్న వారందరికీ ఎటువంటి అసమానతలు లేకుండా చూడాలని విద్య, ఉద్యోగ రంగాల్లో అవకాశం కల్పించాలని కోరుతూ జరిగిన ఉద్యమానికి చారిత్రక తీర్పు వెలువడటం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుతం తెలంగాణ లోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే వర్గీకరణ అమలుచేస్తామని చెప్పారని, ఆ దిశగా ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే ఉద్యోగ నోటిఫికేషన్లలో ఈ రిజర్వేషన్లు కల్పించి న్యాయం చేయాలని కోరారు.



## బోధన్ సహకార కేంద్ర బ్యాంకును పరిశీలించిన చైర్మన్ కుంట రమేష్ రెడ్డి

**బోధన్(జనంసాక్షి):**
బోధన్ పట్టణంలోని బోధన్ సహకార సంఘం బ్రాంచ్, పురాతన బ్యాంకు భవనాన్ని గురువారం నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి పరిశీలించారు. చైర్మన్ గా ఎన్నికైన తర్వాత మొట్టమొదటిసారిగా బోధన్ కు వచ్చిన జిల్లా సహకర కేంద్ర బ్యాంకు చైర్మన్ కుంట రమేష్ రెడ్డికి డిసిసిబి డైరెక్టర్లు పెద్దోళ్ల గంగారెడ్డి, గింజుపల్లి శరత్ లతో పాటు మేనేజర్ లు ఘన స్వాగతం పలకడంతో పాటు చైర్మన్ ను ఘనంగా సన్మానించారు. పురాతన భవనం యొక్క స్థితిని పరిశీలించిన్ చైర్మన్. బ్యాంకు అధ్యక్షుల లావాదేవీలు, లాకర్స్, ఋణమాఫీ ఇతర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిసిసిబి డైరెక్టర్లు పెద్దోల్ల గంగారెడ్డి, గింజుపల్లి శరత్, పెంటాకలాన్ సొసైటీ చైర్మన్ రాజరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు నరేందర్ రెడ్డి, బ్యాంకు మేనేజర్, సిబ్బంది ఉన్నారు.

## 'బండ్ల' ఊగిసలాట

**మంత్రి జూపల్లితో చర్చలు**
**పార్టీలోనే కొనసాగాలని బుజ్జగింపులు**

**హైదరాబాద్(జనంసాక్షి):**
గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఇంటికి మంత్రి జూపల్లి కృష్ణారావు వెళ్లారు. ఆయన తిరిగి భారాసలోకి వెళ్తారనే ప్రచారం జోరుగా సాగు తున్న నేపథ్యంలో బుజ్జగించేందుకు మంత్రి వెళ్లినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో కృష్ణమోహన్‌రెడ్డి గద్వాల నియోజకవర్గం నుంచి భారాస అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇటీవల భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తో ఆయన భేటీ కావడంతో పార్టీ మారతారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కృష్ణమోహన్‌రెడ్డి ఇంటికి మంత్రి వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాంగ్రెస్‌లో చేరిన అనంతరం స్థానికంగా ఆ పార్టీ నేతలతో ఎమ్మెల్యేకు సమస్యలు ఎదురయ్యాయని తెలుస్తోంది. గద్వాల కాంగ్రెస్ నాయకులు కొందరు కృష్ణమోహన్‌రెడ్డి చేరికను బహిరంగంగానే వ్యతిరేకించారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్‌తో సమన్వయం లోపించి... కొంతకాలంగా అసంతృప్తిగా ఉన్న ఎమ్మెల్యే తాజాగా భారాసలోనే కొనసాగాలని నిర్ణయించుకున్నట్లు ఆ పార్టీ ముఖ్యనేత ఒకరు తెలి పారు. భారాసను వీడిన మరికొం దరు ఎమ్మెల్యేలు కూడా తిరిగి సొంత గూటికి చేరతారని ఆ పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## రాజీవ్ తండాలో తీజ్ ఉత్సవాలు



మంథని, (జనంసాక్షి ) : పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గం బామ్మ నాయక్ జిపి పరిధిలోని రాజీవ్ తండాలో తాజా మాజీ ఉపసర్పంచ్ జ్యోతి శంకర్ తన సొంత ఖర్చులతో తీజ్ ఉత్సవాలను నిర్వహించారు. గిరిజనుల ఆరాధ్య దేవుడైన సేవాలాల్ మహారాజ్, మేరమా తల్లిని కొలిచి తీజ్ ఉత్సవాల్లో గ్రామ ఆడబిడ్డలు కలిసి కట్టుగా ఉండి ఎవరికి వారు భూట్టి కట్టడం జరిగింది. బుట్టిలలో గోధుమలు ఎరువు వేసి మొలకలు వేస్తారు. తొమ్మిది రోజులు ఉపవాసం ఉండి ఆడ బిడ్డలు నిష్టితతో పూజలు చేస్తారు. ఆడ బిడ్డలు అందరు ప్రత్యేకంగా ఇంటిల్లి పాది నిష్టితతో ఉండి పూజలు నిర్వహిస్తారు. ఆడబిడ్డ లు అందరు కలిసి పొద్దున సాయంత్రం రోజు బట్టిలలో నీరు పోయడం జరుగుతుంది. ఆఖరి రోజు ఊరు పెద్దమనుషులు ఆడబిడ్డ లు ఉట్టి ని తెంపడం జరుగుతుంది. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాలనుసారం డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య, మాజి సర్పంచ్ లాల్ సింగ్ ఈ తీజ్ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఇబ్రహీం,మాజీ వార్డు సభ్యులు సంపంగి కుమార్, దాడి పోచం మేకల గోవర్ధన్, బొంగోని మల్లేష్, శ్రీకాంత్,తండా పెద్ద మనుసులు కెల్దన్,సారయ్య, ,తండా కారోబార్ సమ్మయ్య,శక్లల్ తండా పెద్దలు పులచంద్,చందు,గట్టయ్య,జగన్,రాజు,తిరుపతి, విజయ్, సమ్మయ్య,కిషన్,శ్రీను,రమేష్,రాజేష్, నరేష్,సారయ్య, సురేష్,కుమార్,తిరుపతి, తండా మహిళలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్పూర్, ఆగస్టు 01 (జనం సాక్షి) :** ఎస్సీవర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పునేపథ్యంలో అసెంబ్లీ లోని సీఎం ఛాంబర్ లో రాష్ట్ర మంత్రి దామోదర రాజ నర్సింహతో కలసి మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డికి స్వీట్స్ తినిపించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇతర శాసనసభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ మూడు దశాబ్దాల ఆకాంక్ష నెరవేరిందని,ఎస్సి వర్గీకరణతో మాదిగలకు న్యాయం జరిగిందని,ఎస్సి వర్గీకరణతో వెనుకబడిన వర్గాల్లో అట్టడుగున ఉన్న వారికి లబ్ధి చేకూరిందని, ఎస్సీ వర్గీకరణతో విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు పెరు గుతాయని అన్నారు.ఎస్సీ వర్గీకరణ తీర్పు త్వరగా వచ్చేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.

# సుప్రీంకోర్టు తీర్పు వల్ల మాదిగలకు అన్యాయం

- మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి



**హైదరాబాద్, ఆగస్టు 1 (జనంసాక్షి) :** సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి గారు అన్నారు.తెలంగాణ లో మాదిగలు 12% ఉన్నారని ఏబీసీడీ వర్గీకరణ ద్వారా మాదిగలకు 7% ఇస్తే తీవ్ర అన్యాయం జరుగుతుంది అని అన్నారు. వర్గీకరణ అంశంలో సుప్రీంకోర్టులో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంప్లేడు అవ్వడం సంతోషమని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. సుప్రీంకోర్టులో ఏడుగుర సభ్యుల ధర్మాసనం వర్గీకరణ రాష్ట్రాలు చేసుకోవచ్చని ఎస్సి వర్గీకరణకు అనుగుణంగా తీర్పునివ్వడం స్వాగతిస్తున్నామని అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు ఎమ్మార్పీఎస్,బిజెపి కి సంబంధించింది కాదు అని పంజాబ్ వర్సెస్ రవీందర్ సింగ్ కేసులో తీర్పు వెలువడిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అతి పెద్ద కులమైన మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ ఇచ్చి వర్గీకరణ చేయాలని అన్నారు. బిజెపి పార్టీ వర్గీకరణ హామీ నెరవేర్చుకోలేదని మాదిగలను మోసం చేసిన జాతీయ పార్టీ బిజెపి మాత్రమేనా? అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉషా మెహ్రా కమిషన్ వేసి వర్గీకరణ అంశాన్ని చట్టసభల్లో ప్రస్తావించిందని, కానీ బిజెపి మాత్రం చట్టసభలో వర్గీకరణ గురించి మాట్లాడలేదని అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని అన్నారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గీకరణ విద్యా ఉద్యోగ రంగాల్లో అమలు చేస్తాననడం చాలా సంతోషకరమని రేవంత్ రెడ్డికి మాదిగల అందరి తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. రేవంత్‌రెడ్డి మాదిగల పక్షపాతిగా ఉన్నందుకు మాదిగ జాతి కాంగ్రెస్ పార్టీ వెంటే ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గద్ద యాదయ్య మాదిగ, నేషనల్ దళిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు భుదాల బాబురావు, తెలంగాణ తల్లిదండ్రు రాష్ట్ర అధ్యక్షులు బచ్చలకూర బాలరాజు, బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, మాదిగ జేఏసీ రాష్ట్ర యూత్ అధ్యక్షులు నక్క మహేష్, మాదిగ జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు జెర్రిపోతుల సాయన్న మాదిగ, జేఏసీ నాయకులు దేవరకొండ నరేష్ జోగు గణేష్ జనపల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.




# నిరంతర విద్యుత్‌పై నిఘా ఉండాలి

- పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్



**నిజామాబాద్, ఆగస్ట్ 1 (జనంసాక్షి) :** వ్యవసాయానికి 24 గంటల కరంటు అందరికీ అందుబాటులోకి వచ్చినా పలు సమస్యలు ఇంకా ఉన్నాయి. ప్రధానంగా వ్యవసాయ విద్యుత్ పేరుతో అక్రమంగా వాడుకుంటున్న వారి పనిపట్టే చర్యలు తీసుకోవడం లేదు. వ్యయసాయం మాటుల నకొందరు సొంత పనులు వెళ్లదీసుకుంటున్నారు. దీనిని పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటుకబట్టీలు ఇతరత్రా చిన్నిచన్ని పరిశ్రమల లాంటివాటి వినియోగం జరగుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నోఏళ్లుగా కరెంట్ కష్టాలు అనుభవించన రైతులు ఇప్పుడు 24 గంటల నిరంతర విద్యుత్ పొందుతున్నారు. వ్యవసాయానికి కూడా నిరంతర కరెంట్ అన్నది అన్నదాతకు భరోసా ఇస్తోంది. ఇది పంటల ఉత్పత్తులను గణనీయంగా పెంచిందనడంలో సందేహం లేదు. మడిచేల్లో పడిగాపులు కాసే రోజులు పోయాయి. అవసరమున్నంత కరెంట్‌ను అవసరమున్న వేళలో ఉపయోగించుకునే వెసలుబాటు ఉన్నందున దానిపై నియంత్రణ కూడా ఉండాలి. నిరంతర కరెంట్‌ను దుర్వినియోగం చేయకుండా, దారి మళ్లించకుండా నిఘా పెట్టాలి. అప్పుడే దానికి సార్థకత వస్తుంది. నిరంతర విద్యుత్ వ్యవసాయానికి ఆలంబన కానున్న దశలో దానిని ఉచితంగా ఉపయోగించుకునేందుకు కొందరు పన్నాగాలు చేసే ప్రణాళికతో ఉంటారు.విద్యుత్ ఉద్యోగుల పాత్ర, చక్కటి నిర్వహణతోనే ఇది సాధ్యమైంది. ఈ విద్యుత్ వృధా కాకుండా కేవలం వ్యవసాయానికే వాడుకుని వ్యవసాయ పంటల ఉత్పత్తులను పెంచాలి. అప్పుడే తెలంగాణ వ్యవసాయ రంగంలో విప్లవాలు సాధించగలదు. ప్రపంచానికి ఆదర్శం కాగలదు. సమైక్యపాలనలో మైనర్ ఇరిగేషన్ ధ్వంసం అయింది. తొమ్మిది గంటల కరంటు వచ్చిన దాఖలాలు లేనేలేవు. నాడు రెండు గంటలు కరెంటు వస్తే గొప్ప. మోటర్లు కాలిపోయేవి, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయేవి. ఇవన్నీ రైతన్నల అనుభవాలు. 24గంటల కరెంటు తెలంగాణ ఎంత సుస్థిరంగా ఉంటుందనేది తెలియజేస్తున్నది. మొత్తంగా వ్యవసాయం, కరెంట్ రెండూ విడదీయరాని అనుబంధం కలిగి ఉన్నాయి. కరెంట్ రావడం, నీరు లభ్యత ఉండడం అన్నది రైతుకు ఎంతో ముఖ్యం. దీంతో వ్యవసాయం పరుగులు పెడుతుందనడంలో సందేహం లేదు. అయితే దుబారాను అరికట్టేందుకు వ్యవస్థ అవసరం. లేదా ఉచిత్ విద్యుత్‌పై నియంత్రణ ఉండాలి. లేకుంటే ఈ పథకం పక్కదారి పట్టే ప్రమాదం ఉంది. నిరంతర పర్యవేక్షణతో పాటు ఉచిత విద్యుత్‌కు కూడా నియంత్రణ ఉండాలి. రైతుల భూముల లెక్కలు తీస్తున్నందున ఏ పంటకు ఎంత విద్యుత్ అసవరమో, అక్కడ నీటిపారుదల ఎంత ఉందో గుర్తించి సరఫరా చేసే విధానం అమల్లోకి రావాలి. అలాగే అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలకు పూనుకోవాలి.



# నల్లబ్యాడ్జీలతో సభకు బిఆర్ఎస్ సభ్యుల హాజరు

- మహిళా ఎమ్మెల్యేలను అవమానించారని నిరసన

**హైదరాబాద్, ఆగస్ట్ 1 (జనంసాక్షి) :** శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మహిళలపై అత్యంత అవమానకరంగా ప్రవర్తించారని భారాస ఎమ్మెల్యేలు ఆరోపిస్తున్నారు. ఈక్రమంలో గురువారం వారు అసెంబ్లీకి నల్లబ్యాడ్జీలతో హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మాట్లాడుతూ.. సీఎం, డిప్యూటీ సీఎం ప్రవర్తన తమను ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. వెంటనే తమ సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డికి భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులని.. ఎంతో హుందాగా ప్రజలకు సేవ చేసే గుణం వారిదని తెలిపారు. అలాంటి మహిళా నేతలపై ఇంత చులకనగా మాట్లాడటం సరికాదన్నారు. కాంగ్రెస్ నాయకులు చేసిన ఈ వ్యాఖ్యలు వారిద్దరిపై మాత్రమే కాదని.. మొత్తం మహిళలపై వారికున్న చులకన భావాన్ని తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. కచ్చితంగా మహిళలంతా కాంగ్రెస్ నేతల వ్యవహార శైలిని గమనిస్తున్నారని కేటీఆర్ తెలిపారు. మరోవైపు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నలుపు రంగు కోటు ధరించి సభకు హాజరు కావడంపై భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమకు మద్దతుగా నల్ల దుస్తులు ధరించి వచ్చారని పేర్కొంటూ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.



# శ్రీశైలం ప్రాజెక్టులోకి వరదప్రవాహం

- 10 గేట్లు ఎత్తి నీటి విడుదల

**శ్రీశైలం, ఆగస్ట్1 (జనంసాక్షి) :** ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద భారీగా పెరుగుతున్నది. గంట గంటకు వరద ఉధృతి మరింత పెరుగుతూ వస్తున్నది. ప్రస్తుతం ప్రాజెక్టు పది గేట్లను 15 అడుగుల వరకు ఎత్తి 3,76,670 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారు. దాంతో వరద నాగార్జున సాగర్ వైపు వెళ్తున్నది. జూరాలా, సుంకేశుల జలాశయాల నుంచి డ్యామ్‌కు ఇన్‌ఫ్లోలో కొనసాగుతున్నది. శ్రీశైలం జలాశయానికి ప్రస్తుతం 3,95,162 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. అవుట్ ఫ్లో 4,36,902 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 884.40 అడుగులుగా ఉన్నది. జలాశయం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 215.807 టీఎంసీలు.. ప్రస్తుతం జలాశయంలో 212.4385 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. కుడి, ఎడమగట్టులోని జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో కరెంటు ఉత్పత్తి కొనసాగుతున్నది. మరో వైపు ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో శ్రీశైలం పరిసరాలన్నీ పర్యాటకులతో కిక్కిరిసి పోతున్నాయి. డ్యామ్ అందాలను చూసేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. దాంతో ఘాట్ రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయాయి.

# పారిశుధ్య కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రత్యేక టీములుండాలి

- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా బ్యూరో, (జనంసాక్షి) :** ప్రతి ఇంటి నుండి తడి, పొడి వ్యర్ధాల సేకరణ పక్కగా జరగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పంచాయతి, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో వ్యర్ధాలు సేకరణ, స్వచ్ఛ వాహనాలకు జీపీఆర్ఎస్ ఏర్పాటు, సురక్షిత మంచినీటి సరఫరా, అంటు వ్యాధుల నియంత్రణ చర్యలు, వన మహోత్సవం, యానిమల్ బర్త్ కేర్ యూనిట్ అందుబాటులోకి తేవడం తదితర అంశాలపై మండల ప్రత్యేక అధికారులు, వైద్య, విద్యా, ఆర్ డబ్ల్యూఎస్, డిఆర్డీఏ, ఇరిగేషన్, ఎంపిడిఓలు, ఎంపీవోలతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రత్యేక టీములు ఏర్పాటు చేసి రేపటి లోగా టీముల వివరాలు అందచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీ స్థాయిలో గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారి, పంచాయతి కార్యదర్శి, ఏఎన్ఎం, ఆశా, మహిళా సంఘాలు, యువతతో టీములు ఏర్పాటు చేయాలని డిపిఓకు సూచించారు. అలాగే మున్సిపల్ స్థాయిలో వార్డు ప్రత్యేక అధికారి, వార్డు అధికారి, మెప్మా రిసోర్స్ పర్సన్స్, కౌన్సిలర్లతో టీములు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. రేపటి లోగా గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డుల్లో టీములు ఏర్పాటు జాభితా అందచేయాలని తెలిపారు. మున్సిపాలిటీలో వర్మి కంపోస్టు జరగడంలేదని వారం రోజుల్లో వర్మీ తయారు ప్రక్రియ ప్రారంభం కావాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. కుక్కల వృద్ధి నియంత్రణ చర్యల్లో భాగంగా కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహణకు యానిమల్ భర్త్ కేర్ యూనిట్ ను అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. కుక్కల సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో తక్షణమే చర్యలు చేపట్టి నియంత్రణ శాస్త్ర చికిత్సలు చేపట్టాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుద్ధ్య కార్యక్రమాలు, మొక్కలు నాటే అంశాలపై పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. అంటువ్యాధుల నియంత్రణలో సురక్షిత మంచినీటి సరఫరా అత్యంత ప్రధానమని, మంచినీటి వనరులను నెలలో మూడు దఫాలు క్లోరినేషన్ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలో మురుగునీటి నిల్వలున్న ప్రాంతాలను గుర్తించి పరిశుభ్రం చేయాలన్నారు. దోమలు వ్యాప్తి నిరోధానికి మురుగునీటి గుంటల్లో ఆయిల్ బాల్స్ వేయాలని తెలిపారు. అలాగే ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపచేసి భూగర్భజలాలు పెంచడానికి కమ్యూనిటి ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టాలని డిఆర్డీఓ ను ఆదేశించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు లేని ఇండ్లను గుర్తించి నిర్మాణాలు చేపట్టాలని పేర్కొన్నారు. ఇరిగేషన్ అధికారులు చెరువులు తనిఖీ పరిరక్షణ చర్యలు చేపట్టాలని చెరువుల పరిస్థితిపై నివేదికలు అందజేయాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అన్ని శాఖల సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. ప్రతి శుక్రవారం ప్రతి కుటుంబం డ్రై డే పాటించి ఇంటి పరిసరాలు పరిశుభ్రం చేయు విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాకు వర్ష సూచన ఉన్న నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివాసం ఉండకుండా చూడాలని, వంగిన చెట్లు, వంగిన విద్యుత్ స్థంభాలు తొలగించాలని అలాగే తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను సరిచేయాలని పంచాయతీ రాజ్, మున్సిపల్, విద్యుత్ అధికారులను ఆదేశించారు. వనమహోత్సవంలో భాగంగా కేటాయించిన లక్ష్యం మేర అన్ని శాఖలు మొక్కలు నాటాలని సూచించారు.

# గణిత పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరణ

- రచయిత సుతారి మురళీధర్‌ను అభినందించిన కలెక్టర్ దివాకర్ టిస్



**ములుగు బ్యూరో, ఆగస్టు 1 (జనం సాక్షి):** ములుగు మండలం పత్తిపల్లి ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు సుతారి మురళీధర్ రచించిన ఎన్రిచ్మెంట్ ఇన్ బేసిక్ ఆపరేషన్స్ ఆఫ్ మ్యాథమెటిక్స్ అనే పుస్తకాన్ని ములుగు కలెక్టర్ దివాకర గురువారం ఆవిష్కరణ చేశారు.విద్యార్థి ప్రాథమిక దశ నుండే గణితం పైన పట్టు సాదించాలన్నారు.పుస్తక రచయిత మురళీధర్ మాట్లాడుతూ..గణితంలోని చతుర్విద ప్రక్రియలు నేర్చుకోవడానికి ఈ పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. సంఖ్యల, బిన్నాల, దశంశాల, కరెన్సీ, ద్రవాల, సమయం, దూరం,భారం,బిజీయ సమాసాల, పూర్ణంకాల.. వంటి 10అంశాల్లో కూడిక,తీసివేత, గుణకారం,బాగాహారం వివరంగా వ్రాయడం జరిగింది.హైస్కూల్,యూపీ స్కూల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడే సెల్ఫ్ లెర్నింగ్ మెటీరియల్ అని అన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర రచయిత సుతారి మురళీధర్ ను అభినందించారు.ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు ఏ.రాజు, వి.శ్రీనివాస్, పి.వి. శ్రీనివాస్, ఎన్.రజిత, టి.సుమతి పాల్గొన్నారు.

# తల్లిపాల వారోత్సవాలపై విస్తృత ప్రచారం కల్పించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి



**వరంగల్ ప్రతినిధి: ఆగస్టు 1(జనంసాక్షి) :** శిశువుకు తల్లిపాలే రక్ష అని, తల్లి పాల వారోత్సవాల గురించి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో ఈ నెల 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాల గోడ ప్రతులను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం తల్లిపాల వారోత్సవాలలోని ప్రతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా జిల్లాలో నిర్వహించాలని సూచించారు. మండల స్థాయిలో వైద్యశాఖ అధికారులు, ఐసీడీఎస్, మహిళ సంఘాల ద్వారా సంయుక్తంగా సమావేశం నిర్వహించి తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాల ప్రణాళిక రూపొందించుకోని గ్రామాల వారిగా అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, ఆర్డీఓ కృష్ణవేణి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370